PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 273 | విజయవాడ, బుధవారం 8 మే 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday 8 May 2024 | Rs

తృణమూల్ దాదాగిరి.. తిప్పికొట్టిన ప్రజలు

- చాలా చోట్ల ఏడేళ్ల తరువాత ఓటు వేసే అవకాశం లభించింది
- మహ్మద్ సలీం 10



అటు ఫ్రేజర్.. ఇటు అభిషేక్... 8

- రాజస్థాన్‌పై 20 పరుగుల తేడాతో ఢిల్లీ గెలుపు

పిడుగుల వాన

ఏడుగురు మృతి • ఈదురుగాలులతో అరటి, మామిడికి తీవ్ర నష్టం
• తడిచిన మొక్కజొన్న, ఎండుమిర్చి

ప్రజాశక్తి- యంత్రాంగం

ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం పిడుగుల వాన కురిసింది. భారీ వర్షానికి, ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అరటి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. పిడుగుపాట్లకు ఐదుగురు, వేర్వేరు ఘటనల్లో మరో ఇద్దరు... మొత్తం ఏడుగురు మృత్యువాతపడ్డారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఊటుకూరులో మొక్కజొన్న చేలో పనిచేస్తున్న సమయంలో పిడుగుపాటుకు బొందల నాగేంద్రం (52), ఆమె కుమార్తె యంద్రపల్లి నాగరాణి (25) మరణించారు. అదే మండలం కుందిరివానిపాలేనికి చెందిన ఆవుల కోటేశ్వరరావు (45), బాపట్ల జిల్లా సంతమావులూరు గ్రామానికి చెందిన ఆయన మేనల్లుడు గోపి (25) గొర్రెలను మేపుతుండగా పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతి చెందారు. కొబ్బరి చెట్టు విరిగి మీదపడడంతో పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన రైతు నిమ్మల శ్రీనివాస్ (45) అక్కడికక్కడే మృతి చెందారు. వర్షానికి ధాన్యం తడిసిపోకుండా బరకా కప్పేందుకు మోటార్ సైకిల్‌పై తన బాబాయ్ ఇంటికి వెళ్లి బయట నుంచి ఆయనను పిలుస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఆచంటకు చెందిన కౌలు రైతు కంకిపాటి శివయ్య (56) వర్షానికి ధాన్యం బస్తాలు తడవకుండా బరకాలు కప్పుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానికులు ఆచంటలోని సిహెచ్‌సికి తరలించగా ఆయన అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం యడవల్లిలో పశువులు మేపేందుకు వెళ్లిన పరస రామారావు (41) పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతి చెందారు. ఈదురు గాలులకు కృష్ణా జిల్లా గుడివాడలో పలుచోట్ల భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంకలో అరటి చెట్లు, శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం కేశవరాయపురం, లావేటిపాలెం, జిజి వలస, లావేరు, సంతవలసలో అరటి, బొప్పాయి చెట్లు, ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలంలో అరటి చెట్లు విరిగిపడ్డాయి. కృష్ణా జిల్లా బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు, అవనిగడ్డ, నాగాయలంక తదితర మండలాల్లో వర్షానికి, ఈదురుగాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పొలాల్లో ఎండబెట్టిన మొక్కజొన్న, కళ్లాల్లో ఎండబెట్టిన ఎండు మిర్చి తడిచిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గంటన్నరపాటు భారీ వర్షం కురవడంతో రైల్వే స్టేషన్ రోడ్డు, తాడి తోట, శ్యామలా సెంటర్, కంబాల చెరువు ప్రాంతాలు నీట మునిగాయి. హైటెక్ బస్టాండ్ జలమయమైంది. కడియంలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కాకినాడ జిల్లాలో శంఖవరం, రౌతులపూడి, ప్రత్తిపాడు మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడు, రెడ్డిగూడెంలో వృక్షాలు నేలకొరిగాయి. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోనూ వర్షాలు కురిశాయి.



కృష్ణా జిల్లా గుడివాడలో గాలివానకు పడిపోయిన విద్యుత్ స్తంభం



అంబేద్కర్ కోనసీమ జిల్లా బడుగువాని లంకలో నేలకొరిగిన అరటి తోట

మైనార్టీలో హర్యానా సర్కార్

- ముగ్గురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేల మద్దతు వాపసు
- సిఎం సైనీ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్

ఛండీగఢ్ : ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను 'ఆపరేషన్ లోటస్' ద్వారా కూల్చే బిజెపికి హర్యానాలో షాక్ తగిలింది. బిజెపి ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మంగళవారం ప్రకటించారు. దీంతో నయాబ్ సింగ్ సైనీ ప్రభుత్వం మైనార్టీలో పడింది. మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు మద్దతు తెలుపుతున్నా మెజార్టీకి ఇంకా రెండు స్థానాలు తక్కువగా ఉండడంతో సైనీ ప్రభుత్వం అధికారంలో కొనసాగే అర్హతను కోల్పోయింది. మార్చిలో జననాయక్ జనతా పార్టీ (జెజెపి) సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నా. ఆ పార్టీలోని కొంతమంది మద్దతు తెలుపుతుండటంతో బిజెపి ప్రభుత్వం ఇన్నాళ్లూ నెట్టుకొచ్చింది. తాజాగా ముగ్గురు ఎమ్మెల్యేలు సోంబీర్ సంగ్వాన్ (దాద్రీ), రణధీర్ సింగ్ గొల్లెన్ (పుండ్రి), ధరంపాల్ గోండర్ (నీలోఖేరి) ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు గవర్నర్‌కు లేఖ పంపినట్లు తెలిపారు. మైనార్టీలో పడిన సైనీ ప్రభుత్వం తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. రాష్ట్రపతిపాలన విధించి అసెంబ్లీకి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని కోరింది. హర్యానా అసెంబ్లీలో 90 స్థానాలు ఉండగా, ప్రస్తుతం 88 మంది సభ్యులు ఉన్నారు.. బిజెపికి 40, కాంగ్రెస్‌కు 30, జెజెపికి 10 మంది ఉన్నారు. మిగతావారు ఇండిపెండెంట్లు. ఈ ఏడాది అక్టోబర్‌లో హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.



అరకులోయ సభలో మాట్లాడుతున్న బృందాకరత్, చిత్రంలో అరకు సిపిఎం లోక్‌సభ అభ్యర్థి అప్పలనర్స

డబుల్ ఇంజిన్ సర్కారొస్తే

ప్రతి గ్రామం మణిపూరే!

- ఇండియా వేదికతోనే ఆదివాసీలకు రక్షణ
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్
- అనంతగిరి, అరకు, ముంచంగిపుట్టుల్లో రోడ్డు షో, సభలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, అల్లూరి జిల్లా విలేకరులు

ఆదివాసీ ప్రాంతంలో వనరులను లూటీ చేసి, హక్కులపై దాడి చేస్తోన్న బిజెపిని, దాని తొత్తులుగా ఉన్న వైసిపి, టిడిపిలను ఈ ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ పిలుపునిచ్చారు. ప్రజల హక్కులకు, బతుకులకు భరోసానిచ్చే ఇండియా వేదికను బలపర్చాలని ఆదివాసీలను కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి, అరకు, ముంచంగిపుట్టుల్లో ఇండియా వేదిక బలపరిచిన అరకు సిపిఎం లోక్‌సభ అభ్యర్థి పి.అప్పలనర్స, అరకు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర్ స్వామికి మద్దతుగా మంగళవారం జరిగిన సభల్లో ఆమె మాట్లాడారు. యుపిఎ-1 ప్రభుత్వంపై వామపక్షాలు ఒత్తిడి తెచ్చి సాధించిన అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేసేలా అటవీ సంరక్షణ చట్టాన్ని మోడీ ప్రభుత్వం సవరించిందని తెలిపారు. నాడు బాక్సైట్‌ను లూటీ చేయకుండా అటవీ హక్కుల చట్టం ద్వారా అడ్డుకున్నామని గుర్తుచేశారు. అదానీ, అంబానీ వంటి వారికి ఖనిజ, సహజ సంపదలను కట్టబెట్టి, అటవీ ప్రాంతం నుంచి గిరిజనులను గెంటివేయడానికి గ్రామ సభ హక్కును మోడీ ప్రభుత్వం నేడు లేకుండా చేసిందని విమర్శించారు. పీసా, ఐదో షెడ్యూల్ హక్కులను కాపాడుకోవాలంటే బిజెపిని ఓడించాలన్నారు. లోక్‌సభలో 23 ఎంపి సీట్లున్న వైసిపి... ప్రత్యేక హోదా, అధిక ధరలు, రైతులకు వ్యతిరేకంగా తెచ్చిన మూడు నల్ల చట్టాలపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఎపిలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వస్తే మణిపూర్‌లో వనరులు కొల్లగొట్టడానికి క్రిస్టియన్ గిరిజనులపై దాడులు జరిగినట్టే ఇక్కడ ఖనిజ సంపద కోసం ఆదివాసీలపై దాడులు జరుగుతాయని హెచ్చరించారు. ప్రజలకు మంచినీరు, విద్య, వైద్య సదుపాయాలు మిగతా 7లో

మూడో దశ

63 శాతం పోలింగ్

- ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికలకు మూడో విడత పోలింగ్ దాదాపు 63 శాతం జరిగింది. మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకూ జరిగింది. ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 93 స్థానాలకు పోలింగ్ జరిగింది. అత్యధికంగా అస్సాం(4)లో 75.26 శాతం, గోవా(2)లో 74.27 శాతం, పశ్చిమ బెంగాల్(4)లో 73.93 శాతం పోలింగ్ జరిగింది. కర్ణాటక (14)లో 67.76 శాతం, ఛత్తీస్‌గఢ్ (7)లో 66.99 శాతం, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ (2)లో 65.23 శాతం, మధ్యప్రదేశ్ (9)లో 63.09 శాతం, ఉత్తరప్రదేశ్ (10)లో 57.34 శాతం, గుజరాత్ (25)లో 56.76 శాతం, బీహార్ (5)లో 56.55 శాతం, మహారాష్ట్ర (11)లో 54.77 శాతం పోలింగ్ జరిగింది. మరోవైపు పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో టిఎంసి కార్యకర్తలు ఓటర్లను బూత్‌లోకి రాకుండా అడ్డుకున్నారని సిపిఎం అభ్యర్థి, రాష్ట్ర కార్యదర్శి ఎండి సలీం విమర్శించారు. రాణినగర్ ప్రాంతంలోని బూత్‌లోకి ప్రవేశించకుండా టిఎంసి కార్యకర్తలు ఓటర్లను అడ్డుకున్నారని పేర్కొంటూ ఎన్నికల కమిషన్‌కు సలీం ఫిర్యాదు చేశారు. ఒక బూత్‌లో, సలీం నకిలీ టిఎంసి ఏజెంట్‌ను గుర్తించారు. తరువాత ఆయనను పోలీసులు అరెస్టు చేశారు."నాకు రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదు. ఓటర్లకు సహాయం చేయడానికి నేను అదనపు ఎస్పీకి ఫిర్యాదు చేశా. ఓటర్లను పోలింగ్ బూత్‌లలోకి రాకుండా అడ్డుకునే అవాంఛనీయ వ్యక్తులను పట్టుకుంటా" అని ఆయన విలేకరులతో అన్నారు. టిఎంసి కార్యకర్తలు ఓటర్లను బెదిరిస్తున్నారని ఆయన అన్నారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి లోక్‌సభ నియోజకవర్గంలో బూత్‌లను దోచుకునేందుకు బిజెపి కార్యకర్తలు ప్రయత్నించారని, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వ్యక్తులను పోలీసు స్టేషన్‌లలో నిర్బంధించారని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. తన భార్య, సిట్టింగ్ ఎంపి డింపుల్ యాదవ్ పోటీలో ఉన్న మెయిన్‌పురి నియోజకవర్గానికి సైఫాయ్ (ఇటావా)లో ఓటు వేసిన యాదవ్, కొన్ని చోట్ల ఓట్లు రిగ్గింగ్ జరిగినట్లు ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు తాము ప్రయత్నిస్తున్నామని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ అన్నారు. ఎక్కడైతే మిగతా 2లో


ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయిస్తానని

మోడీతో చెప్పిస్తారా?

- చంద్రబాబుకు మాజీ మంత్రి వడ్డే ప్రశ్న
- కార్పొరేట్లకు భూముల పందేరానికే ఈ చట్టం
- దేశంలో తొలిసారి జగన్ ఆమోదింపజేశారు
- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ప్రమాదకరమైందని, దీన్ని రద్దు చేస్తానని చెబుతున్న చంద్రబాబు నాయుడు.. మోడీ విజయవాడ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ప్రధానితో ఆ మేరకు ప్రకటన చేయించగలరా? అని రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రశ్నించారు. మంగళవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, రిటైర్డు ఐఎఎస్ అధికారి బి శ్రీనివాసరావు, ప్రముఖ ఇంజినీరు కె విజయరావు తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. నీతి ఆయోగ్ సిఫార్సులతో రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టం చేసిందని తెలిపారు. దానికి ఛైర్మన్‌గా ఉన్న మిగతా 2లో



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు వేదికపై రైతు నాయకులు

సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తుంది

- ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై పివి రమేష్ 2



తెలంగాణలో 'రైతు భరోసా'కు

ఇసి తాత్కాలిక బ్రేక్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



తెలంగాణలో రైతు భరోసా నిధుల విడుదలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ తర్వాతే నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి మంగళవారం ఆదేశించింది. రైతు భరోసా చెల్లింపులలో సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఇసికి హైదరాబాద్‌కు చెందిన ఎన్.వేణుకుమార్ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఇసి... ముఖ్యమంత్రి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని పేర్కొంది. ఐదు ఎకరాలు పైబడి వ్యవసాయ భూమి ఉన్న వారికి రైతు భరోసా నిధులను సోమవారం విడుదల చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి రైతుల ఖాతాల్లో నగదు జమ చేసే ప్రక్రియ చేపట్టింది. దాదాపు రూ.2 వేల కోట్లకుపైగా నిధులు విడుదల చేసినట్లు సమాచారం. మూడు రోజుల్లో చెల్లింపుల ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు భావించగా, ఇసి ఆదేశాలతో రైతుల ఖాతాల్లో నగదు జమ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది.

అల్లూరి స్ఫూర్తితో పోరాటాలు

- అటవీ సంపదను కొల్లగొట్టేవారిని తరిమికొట్టండి
- సిపిఎం అభ్యర్థులను గెలిపించండి : శ్రీనివాసరావు

ప్రజాశక్తి- దేవీపట్నం, రంపచోడవరం, మారేడుమిల్లి విలేకరులు (అల్లూరి జిల్లా)

'అటవీ సంపదను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలు చేస్తోంది. ఈ నేపథ్యంలో నాడు బ్రిటీష్ వారిని తరిమికొట్టిన అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని ఆదివాసీలు, ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలి. సహజ వనరులను దోచుకునేవారిని తరిమికొట్టాలి' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతిని పురస్కరించుకుని అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరిపేట, రంపచోడవరం నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజనుల హక్కులను హరిస్తున్న బ్రిటీషర్లను నాడు అల్లూరి ఎలా తరిమి కొట్టాడో వివరించారు. ఆదివాసీలనే వీరులుగా తీర్చిదిద్ది బ్రిటీష్ సామ్రాజ్యవాదులపై దండెత్తారని వివరించారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి మహోజ్వల శక్తి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్యోద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమని తెలిపారు. కేవలం 27 ఏళ్ల వయసులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, ఆదివాసీలతో, పరిమిత వనరులతో రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్యాన్ని ఢీకొట్టాడన్నారు. నేడు బిజెపి పాలనలో దారుణ పరిస్థితులు ఏజెన్సీలో నెలకొన్నాయని, మోడీ ప్రభుత్వం తెల్లదొరల మాదిరిగానే గిరిజనుల హక్కులను కాలరాస్తోందని వివరించారు. విలువైన ఖనిజ సంపదను, అటవీ భూములను అదానీ, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో అల్లూరి స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని, ఆదివాసీల తరపున పోరాడుతున్న, ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్స, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావులను గెలిపించాలని కోరారు. సిపిఎం గెలుపుతోనే గిరిజన హక్కులు, మిగతా 2లో



అల్లూరి జిల్లా ఇందుకూరిపేటలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరావు తదితరులు



అడ్డంకులను అధిగమించి

అభివృద్ధి సాధిస్తాం

- ఐదోసారి రష్యా అధ్యక్షునిగా పుతిన్ ప్రమాణం


మాస్కో : అన్ని అవరోధాలను అధిగమించి, అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తామని రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు. మంగళవారం రష్యా అధ్యక్షునిగా ఆయన ఐదవ సారి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 'రాబోయే దశాబ్దాల కాలంలో దేశాభివృద్ధిలో నమ్మదగిన కొనసాగింపు వుంటుందని హామీ ఇస్తున్నాం. రష్యా శక్తి సామర్ధ్యాలను మరింత బలోపేతం చేసేలా యువతరాలను పెంచాలి, విద్యా వంతులను చేయాలి. పరస్పర సామరస్యంతో జీవించగలిగే, రష్యాలో నివసించే ప్రజలందరి సాంప్రదాయాలను పరిరక్షించేలా మన దేశ హోదాను అభివృద్ధి పరుస్తామని హామీ ఇస్తున్నాం' అని పుతిన్ అన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్‌కు 87.28 శాతం ఓట్లు లభించిన సంగతి తెలిసిందే.

సాక్షులను కొట్టడం

విధి నిర్వహణలో భాగమా?

- సిబిఐని ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి



సాక్షులను కొట్టడం, థర్డ్ డిగ్రీ ప్రయోగించడం విధి నిర్వహణలో భాగమా? అని సిబిఐని హైకోర్టు ప్రశ్నించింది. వాంగ్మూలం ఇవ్వాలని సాక్షులపై ఒత్తిడి తేవడం సరికాదని ఆగ్రహించింది. వివేకా హత్య కేసులో సిబిఐ అధికారి రాంసింగ్ తీరుపై హైకోర్టు తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేసింది. సునీత, రాజశేఖర్‌రెడ్డి, రాంసింగ్ పిటిషన్లపై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. తాను చెప్పిన విధంగానే వాంగ్మూలం ఇవ్వాలని ఫిర్యాదుదారుడిని రాంసింగ్ ఒత్తిడి చేశారని విస్మయం వ్యక్తం చేసింది. పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత అల్లుడు రాజశేఖరరెడ్డి, సిబిఐ అధికారి రాంసింగ్ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. తాము చెప్పినట్లు వాంగ్మూలం ఇవ్వాలంటూ తనను శారీరకంగా, మానసికంగా వేధించారని పేర్కొంటూ వైఎస్ వివేకానందరెడ్డి పిఎ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఆ కోర్టు ఆదేశాల మేరకు పులివెందుల పోలీసులు రాజశేఖర్ రెడ్డి, సునీత, సిబిఐ అధికారి రాంసింగ్‌పై కేసు నమోదు చేశారు. పులివెందుల కోర్టులో చార్జిషీట్ కూడా దాఖలు చేశారు. దీనిని కొట్టేయాలంటూ వారు ముగ్గురు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు వాయిదా పడింది.

ప్రయివేటు పెట్టుబడులు డీలా 9

- 2022-23లో 36 శాతానికి పతనం
- కోవిడ్ నాటి కనిష్ట స్థాయికి క్షీణత

13న హైకోర్టుకు సెలవు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 13న జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ జరిగే ఒక్కరోజు హైకోర్టుకు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నందున హైకోర్టుతోపాటు పరిపాలనా పరిధిలో పనిచేస్తున్న కార్యాలయాల అధికారులు, సిబ్బందికి సెలవుగా ప్రకటిస్తున్నామని తెలిపారు. హైకోర్టు పాలనా పరిధిలో ఎపి స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఎపి జ్యుడిషియల్ అకాడమీ, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ, హైకోర్టు మీడియేషన్, ఆర్బిట్రేషన్ సెంటర్లకు సెలవు దినంగా ప్రకటించినట్లు లక్ష్మణరావు పేర్కొన్నారు.

ఉన్నత పాఠశాలల్లో యూత్ పార్లమెంటు పోటీలు

- పాఠశాల విద్యాశాఖ కమిషనరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో 9 నుంచి 12వ తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులతో ప్రతి సంవత్సరం యూత్ పార్లమెంటు పోటీలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్ కుమార్ జిల్లా విద్యాశాఖ, ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లను ఆదేశించారు. ప్రజాస్వామ్య మూలాలను బలోపేతం చేయడం, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించడం, పార్లమెంటు పని గురించి విద్యార్థులకు మెరుగైన అవగాహన కల్పించటం, తదితర అంశాలు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మంగళవారం ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమ అమలు కోసం భారత పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. యూత్ పార్లమెంటు వెబ్‌సైట్‌లో మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. ఈ యూత్ పార్లమెంటు పోటీల నిర్వహణకు సంబంధించి ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టరు ప్రతాప్‌రెడ్డిని నోడల్ ఆఫీసరుగా నియమిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టిడిపికి నవతరం పార్టీ మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌డిఎ కూటమికి నవతరం పార్టీ మద్దతు ప్రకటించిందని, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఆ పార్టీ మద్దతును కూటమి స్వాగతించిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తెలిపారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాకంటక, రాజ్యాంగ వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన నడుస్తోందన్నారు. జగన్ పాలనపై పోరాడేందుకు నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం ముందుకు వచ్చారని చెప్పారు. కాగా, రాష్ట్రంలో నవతరం పార్టీ ఆరు అసెంబ్లీ, నాలుగు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తోంది. అయితే పోటీ చేసే స్థానాల్లో పలుచోట్ల జనసేన సింబల్ అయిన గాజు గ్లాసు, కొన్నిచోట్ల గాజు గ్లాసును పోలి ఉండే బకెట్ సింబల్‌ను రిటర్నింగ్ అధికారులు కేటాయించారు. దీంతో ఈ అంశంపై అటు జనసేన ఇటు టిడిపి ఆందోళన వ్యక్తం చేశాయి.

మీ ఓటుతో ఢిల్లీ పీఠం కదలాలి

- ఎన్‌డిఎ గెలిస్తే ఉక్కు పరిరక్షణ అసాధ్యం
- కోరుకొండ, ఇచ్ఛాపురం, గాజువాక సభల్లో సిఎం జగన్



గాజువాక సభలో మాట్లాడుతున్న సిఎం జగన్, పక్కన అమర్నాథ్, బొత్స ఝాన్సీ

ప్రజాశక్తి - యంత్రాంగం

'మీ ఎన్‌డిఎ కూటమితో ఆంధ్రప్రదేశ్‌కు ఏం హామీ ఇస్తున్నారు. ఎపికి ప్రత్యేక హోదా కోసం ప్రధాని మోడీ, చంద్రబాబు, పవన్ జతకట్టారా? రైల్వే జోన్ కోసం కూటమి కట్టారా? వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం చేయడం లేదని మీరు జట్టుకట్టారా? 2024 ఎన్నికల్లో ఎన్‌డిఎకి ఓటేస్తే ఉక్కు అమ్మకమే కాదు రాష్ట్రానికి ఇంకా అన్యాయం జరుగుతుంది' అని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

పేదలకు పథకాలు అందకుండా ఢిల్లీ వాళ్లతో కలిసి చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని, ఢిల్లీ పీఠం కదిలేలా మీ ఓటుతో తీర్పు ఇవ్వాలని కోరారు. విశాఖను పరిపాలనా రాజధాని చేస్తామని, జూన్ నాలుగో తేదీ తర్వాత అక్కడే ప్రమాణ స్వీకారం చేస్తానని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, విశాఖ పాత గాజువాక జంక్షన్ వద్ద నిర్వహించిన సభల్లో ఆయన ప్రసంగించారు.

గాజువాకలో టిడిపికి ఓటు వేసి గెలిపిస్తే అదే ప్రజాభిప్రాయంగా (రిఫరెండం)గా ఎన్‌డిఎ కూటమి భావించి స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి ఆమోదం లభించిందని ముందుకెళ్తుందన్నారు. ఈ ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండి ఓటు ద్వారా కూటమికి బుద్ధి చెప్పాలని కోరారు. 'చంద్రబాబు పార్టీలు మార్చే వ్యక్తి అని, వెన్నుపోట్ల చరిత్ర గలవారని, అత్యంత అవినీతి పరుడని 2019లో చెప్పిన మోడీ.. 2024లో ఎన్‌డిఎ కూటమిలో చేరగానే నీతివంతుడైపోయారా? గెలవడం కోసం మోడీ ఇన్నీ అబద్ధాలు మాట్లాడడం ఘోరం' అని అన్నారు. రైల్వే జోన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలం చూపిస్తే కేంద్రం లిటిగేషన్లతో జోన్ పనులను ఆపేసిందని మండిపడ్డారు.

రాష్ట్రంలో సంక్షేమం తప్ప అభివృద్ధి లేదంటూ చెప్పేవారికి రూ.2.70 లక్షల కోట్లను ప్రజలకు నేరుగా పథకాల కోసం వెచ్చించిన విషయం కనపడడం లేదా అని ప్రశ్నించారు. పేదలకు పథకాలు అందించేందుకు కోర్టుకు వెళ్లి పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందంటే కుట్రలు, కుతంత్రాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. అవ్వాతాతలకు చివరి రెండు నెలలు పింఛన్ సొమ్ము ఇంటికి రానివ్వకుండా ఎవరు అడ్డుకున్నారో తెలియకుండా ఉంటుందా? అని ప్రశ్నించారు. పథకాలు ఆపగలిగినా తన విజయాన్ని అడ్డుకోలేరన్నారు. కోరుకొండ భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారం గురించి ఎమ్మెల్యే రాజా తన దృష్టికి చాలాసార్లు తీసుకొచ్చారని, ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. మళ్లీ వైసిపి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఇసి తీరు సరికాదు : వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల సంఘం పనితీరు సరిగ్గా లేదని వైసిపి విమర్శించింది. బిజెపితో కలిసి వుందని టిడిపి ఏది చెబితే అది అమలు చేయడం తగదని పేర్కొంది. నాలుగేళ్లుగా అమలులో వున్న పథకాలను ఎన్నికల సంఘం నిలిపేయడం ఏమిటని ప్రశ్నించింది. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అంకంరెడ్డి నారాయణమూర్తి, పార్టీ మహిళా విభాగం అధ్యక్షులు పోతుల సునీత, నాయకులు అడపా శేషు మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ వున్నప్పుడు కొత్త పథకాలకు అభ్యంతరం చెప్పొచ్చుగానీ ఇప్పటికే అమలులో వున్న పథకాలను రాష్ట్రంలో ఎన్నికల సంఘం నిలిపేసిందన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులు చేసినా ఎన్నికల కమిషన్ స్పందించకపోవడం సరైందికాదన్నారు.

చనిపోయిన పెన్షనర్లకు పరిహారం ఇవ్వాలి

- ఎన్‌హెచ్‌ఆర్‌సికి కనకమేడల లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చనిపోయిన పెన్షనర్లకు పరిహారం ఇవ్వాలని టిడిపి నేత కనకమేడల రవీంద్ర కుమార్ కోరారు. మంగళవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి)కి టిడిపి మాజీ ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ లేఖ రాశారు. పెన్షనర్ల పంపిణీలో మార్పుల వల్ల 33 మంది పెన్షనర్లు మరణించా రని లేఖలో పేర్కొన్నారు. పెన్షన్ల పంపిణీలో వైసిపి ప్రభుత్వానికి రాజకీయ ప్రయోజనాలు కలిగేలా ఉద్దేశపూర్వకంగా వ్యవహరించిన సిఎస్ జవహర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్ కుమార్, సెర్ప్ అధికారి మురళీధర్‌రెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వ్యవహరించిన తీరుతో పెన్షనర్లు మరణించారని, రాష్ట్రంలో మానవహక్కుల ఉల్లంఘన జరుగుతుందని పేర్కొన్నారు. చనిపోయిన పెన్షనర్లకు రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు.

సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తుంది

- ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై పివి రమేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టును ప్రజల కోసం తెచ్చింది కాదని, వారిని నియంత్రించడానికి తెచ్చిందని మాజీ ఐఎఎస్ అధికారి పివి రమేష్ అన్నారు. ఇది సమాజానికి మంచి చేసేది కాదని, విచ్ఛిన్నం చేసేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చీఫ్ సెక్రటరీగా చేసిన తనకే ఇన్ని ఇబ్బందులు ఎదురైతే సామాన్య జనం పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. తన తండ్రి చినపోయే ముందే వీలునామా రాసిన భూమిని తనపేరున మ్యుటేషన్ చేయడానికి అధికారులు తిరస్కరించడం ఏమిటని ప్రశ్నించారు. తన భూమి ఉన్న ప్రాంతంలో 30 మంది రైతులు కలిసి 120 ఎకరాల్లో చేపల చెరువు ఏర్పాటు చేశారని, దానిలో తన తొమ్మిది ఎకరాలు ఎక్కడో చూపిస్తే మ్యుటేషన్ చేస్తానని తహశీల్దార్ చెప్పడం ఆశ్చర్యం వేసిందని అన్నారు. సిసిఎల్‌ఎ దృష్టికి తీసుకొస్తే మ్యుటేషన్ చేయాలని కలెక్టర్‌కు ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. వీటిని కలెక్టరు ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు పంపారని, ఇంతవరకూ స్పందన లేదని వివరించారు. వివాదంలో ఉంది కనుక మ్యుటేషన్ చేయడం లేదని చెప్పడంలో వాస్తవం లేదని, అది ఆయన కష్టార్జితమని పేర్కొన్నారు. దానికి పట్టా ఉందని, వారసత్వ ఆస్తి బదిలీకే ఇన్ని ఇబ్బందులు ఎదురైతే భవిష్యత్‌లో పరిస్థితి ఏమిటో, టైటిల్ నిరూపించుకోవడానికి ఎన్ని ఇబ్బందులు పడాలో అర్థం కావడం లేదని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై గందరగోళం

- చిలకలూరిపేటలోఅదనపు అధికారి విధుల నుంచి తొలగింపు
- ఆర్‌ఒకు షోకాజ్ నోటీసు జారీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పోస్టల్ ఓట్ల పోలింగ్ తీవ్ర గందరగోళం, ఉద్రిక్తత మధ్య కొనసాగుతున్నాయి. పల్నాడు జిల్లా గణపవరంలో చిలకలూరిపేట నియోజకవర్గం ఉద్యోగులకు ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో జరిగిన తప్పిదాల వల్ల 1,219 మంది ఉద్యోగుల ఓట్లు మురిగిపోయాయి. వీరికి తిరిగి బుధ, గురువారాల్లో పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ ఘటనకు బాధ్యులుగా గుర్తించి అదనపు ఎన్నికల అధికారి వరకుమార్‌ను విధుల నుంచి తప్పిస్తూ జిల్లా కలెక్టర్ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. రిటర్నింగ్ అధికారి నారాదామునికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పోస్టల్ బ్యాలెట్లుగా కాకుండా ఇవిఎం బ్యాలెట్‌లపై పోలింగ్ నిర్వహించడాన్ని ఎన్నికల కమిషన్ తప్పుపట్టింది. ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ల ఓట్లు లేకపోవడంతో మంగళగిరిలో ఉద్యోగులు నిరసన తెలిపారు. మంగళగిరి నిర్మల హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం ఒపిఒ ఉద్యోగులు 500 మంది, పోలీసులు 435 మంది మొత్తంగా 1500 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. అందరూ ఒక్కసారిగా రావడంతో గందరగోళం ఏర్పడింది. వెంటనే నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ జి రాజకుమారి కలుగజేసుకొని ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. మొత్తంగా ఇక్కడ 2,950 ఓట్లు ఉన్నాయని, అందులో ఇతర జిల్లాలకు చెందిన వారి 1600 ఉన్నాయని చెప్పారు. అందరికీ ఓట్లు ఉన్నాయని తెలిపారు. తెనాలిలో ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. తొలుత ఏ నియోజకవర్గంలో ఓటు ఉంటే అక్కడే ఓటు వేయాలని ఒకసారి, పనిచేసే చోట



మంగళగిరిలో బారులు తీరిన ఉద్యోగులు

ఓటు వేయవచ్చని మరోసారి చెప్పడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్న ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని, సిబ్బందికి సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు పెంచాలని ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, శెట్టిపల్లి సతీష్‌కుమార్ కోరారు.

ప్రలోభాలకు తెర

కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద టిడిపి, వైసిపి నాయకులు ప్రలోభాలకు తెరలేపారు. ఉద్యోగులకు ఒక్కో ఓటుకు రూ.2 వేల చొప్పున పంపిణీ చేశారు. ఓటింగ్ కేంద్రం వద్దే డబ్బు పంపిణీ చేయడం చర్చనీయాంశమైంది.



స్టీల్ ఇడి వర్క్స్ ఇన్‌ఛార్జికి సమస్యలను వివరిస్తున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

జీతాల కోసం ఉక్కు కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

సకాలంలో జీతాలు చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్టీల్ ఇడి వర్క్స్ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఇడి వర్క్స్ ఇన్‌ఛార్జ్ సోబ్దిని కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ..మే ఏడవ తేదీ దాటినా కార్మికులకు జీతాలు చెల్లించకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కొన్ని మాసాలుగా జీతాలు చెల్లించలేక యాజమాన్యం తీవ్ర జాప్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. దీంతో ఉక్కు కార్మికులు సకాలంలో లోన్ బకాయిలు చెల్లించకుండా బ్యాంకుల వద్ద డిఫాల్ట్ అవుతున్నారని వివరించారు. యాజమాన్యం తన వైఖరిని మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ.. స్టీల్ యాజమాన్యం కావాలనే ఉత్పత్తిని తగ్గించి ఆ నెపం కార్మికులపై నెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉత్పత్తికి అవసరమైన కోల్‌ను అదానీ గంగవరం పోర్టు నుంచి తేవడంలో స్టీల్ యాజమాన్యం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. అదానీ పోర్టు యాజమాన్యం కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తుంటే స్టీల్ యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వైటి.దాస్, టివికె.రాజు, గంగాధర్, ఎంవి.రమణ, బి.మహేష్, డి.సత్యనారాయణ, కృష్ణమూర్తి, శ్రీనివాస్, పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

వేసవిలో ఉపశమనం

- తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో భారీ వర్షాలు
- మరో 3 రోజులపాటు కొనసాగే అవకాశం
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిప్పులు వెదజల్లే ఎండల నుంచి ప్రజలకు ఊరట దక్కింది. బంగాళా ఖాతంలో ఏర్పడ్డ ద్రోణి ప్రభావంతో పలు జిల్లాల్లో మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లా వేమగిరిలో 124.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే కోనసీమ జిల్లా మండపేటలో 120.5 మి.మీ, రాజమండ్రిలో 92, కోనసీమ జిల్లా తాటపూడిలో 75.5, ఏలూరు జిల్లా నూజివీడులో 73.5, కృష్ణా జిల్లా మచిలీపట్నంలో 73, కోనసీమ జిల్లా ఆలమూరులో 73 మి.మీ వర్షపాతం నమోదైంది. దాదాపు 45 ప్రాంతాల్లో 20 మి.మీ నుండి 64 మి.మీ వరకు వర్షపాతం నమోదైనట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలు జిల్లా లద్దగిరిలో 43.4 డిగ్రీలు, ప్రకాశం జిల్లా ఎంద్రవల్లిలో 43.2 డిగ్రీలు, కడప జిల్లా మద్దూరు, తిరుపతి జిల్లా మంగనెల్లూరులో 42.9 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైనట్లు కూర్మనాథ్ తెలిపారు. బుధవారం నాడు శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, నెల్లూరు, పల్నాడు, బాపట్ల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం వుందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పాత పథకాల నిధులు నిలుపుదలపై వ్యాజ్యాలు

ప్రజాశక్తి-అమరావతి

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యా దీవెన, మహిళలకు వైఎస్సార్ చేయూత నిధుల విడుదలకు కేంద్ర ఎన్నికల సంఘం నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో వేర్వేరు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. అనంతపురం, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన రైతులు, విద్యార్థులు, ఓ గృహిణి అత్యవసర లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని న్యాయమూర్తి బొప్పుడి కృష్ణమోహన్ మంగళవారం విచారణ చేపట్టారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.847.22 కోట్ల పంపిణీకి అనుమతి ఇవ్వాలంటూ అనంతపురం జిల్లాకు చెందిన యల్లక్కగారి నారాయణ, గాజుల శ్రీనివాసులు పిటిషన్ దాఖలు చేశారు. విద్యా దీవెన కింద రూ.610.79 కోట్ల నిధుల విడుదలకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ పల్నాడులోని గుడిపాడుకు చెందిన పఠాన్ సూరజ్, గుంటూరులోని అడవి తక్కెళ్లపాడుకు చెందిన బంకా అరుణ పిటిషన్ వేశారు. చేయూత కింద నిధులను పంపిణీని నిలుపుదల చేస్తూ ఇసి తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గుంటూరు, భారత్‌పేటకు చెందిన గృహిణి కె శాంత కుమారి ఇంకో పిటిషన్ వేశారు. ఇసి తరపున సీనియర్ న్యాయవాది దేశాయ్ అవినాష్ వాదిస్తూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడే ఇసి వాటి అమలును నిలుపుదల చేసిందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యా దీవెన నిధుల పంపిణీ అత్యవసరం ఏముందో రాష్ట్రం వివరిస్తూ వినతిపత్రం ఇస్తే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. వాదనల తర్వాత స్పందించిన హైకోర్టు.. రాష్ట్రం తాజాగా సమర్పించే వినతిపై ఇసి తీసుకునే నిర్ణయాన్ని నివేదించాలని ఇసిని ఆదేశించింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది.

చంద్రబాబుతోనే సర్వతో అభివృద్ధి

- తన్జీమ్ ఈ ముఫ్తియాన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముస్లిముల అభివృద్ధి టిడిపి అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని, టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ముస్లిం సమాజం సంక్షేమానికి, అభివృద్ధికి బాటలు వేస్తుందని తన్జీమ్ ఈ ముఫ్తియాన్ (ముఫ్తీల జాతీయ సంస్థ) ప్రధాన కార్యదర్శి ఖాన్‌ఖాసిమి, కోశాధికారి అల్లమా ముఫ్తి ఘుఫ్రాన్, ఎపి అధ్యక్షులు ముఫ్తీ ఇస్మాయిల్ ఖాసిమీ పేర్కొన్నారు. మంగళవారం చంద్రబాబుతో వారు సమావేశమై, వారి మద్దతు ప్రకటించారు.

మోడీతో చెప్పిస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

నరేంద్ర మోడీ విజయవాడ పర్యటనకు వస్తున్న సందర్భంగా ఆయనతో ఈ సిఫార్సులను వెనక్కు తీసుకుని చట్టాన్ని రద్దు చేయిస్తామనే ప్రకటనను చంద్రబాబు చేయించాలని డిమాండ్ చేశారు. శాసనసభలో ఈ బిల్లును టిడిపి స్వాగతించిందని గుర్తు చేశారు. కార్పొరేట్లకు భూములను కట్టబెట్టేందుకు న్యాయపరమైన చిక్కులు రాకూడదనే ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తీసుకొచ్చారని వడ్డే తెలిపారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టును అమలు చేయాలని సూచించిందే బిజెపి ప్రభుత్వమని, ఇప్పుడు వ్యతిరేకిస్తామని చెబుతున్న టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో చట్టానికి మద్దతు ఇవ్వలేదా? అని ప్రశ్నించారు. లోపల మద్దతు ఇస్తూ పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఈ చట్టాన్ని రద్దు చేయాలని, కేంద్రాన్ని ప్రశ్నించాలని చంద్రబాబును కోరారు. టిడిపి హయాంలో తీసుకొచ్చిన భూసేకరణ సవరణ చట్టాన్ని ఉపయోగించుకుని వైసిపి ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేరుతో అక్రమాలకు పాల్పడిందని, ఈ అవకాశం ఇచ్చింది టిడిపి అనే అంశాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర విభజన చట్టం సందర్భంగా రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని నరేంద్ర మోడీ నెరవేర్చలేదని చంద్రబాబుకు రాష్ట్రాభివృద్ధిపై చిత్తశుద్ధి వుంటే ఆ హామీలపై ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, విభజన చట్టాల హామీని నిలబెట్టగలుగుతారా? అని ప్రశ్నించారు. 14వ ఫైనాన్స్ కమిషన్ ప్రత్యేక హోదా ఇవ్వొద్దని సిఫార్సు చేసిందని బిజెపి చెబుతోందని, వాస్తవానికి ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వడానికి బిజెపి వ్యతిరేకమని తెలిపారు. ఏడాదిపాటు జరిగిన రైతు ఉద్యమానికి సంఘీభావం తెలిపిన టిడిపి ఎన్నికల్లో బిజెపికి మద్దతు ప్రకటించడం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. ఢిల్లీలో చారిత్రాత్మకమైన రైతాంగ పోరాటం సందర్భంగా రైతులకు మోడీ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదని తెలిపారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన నరేంద్ర మోడీ పర్యటనను రాష్ట్ర ప్రజలు నిరసించాలని కోరారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా బిజెపికి మద్దతిచ్చే పార్టీలను ఓడించాలని, ఇండియా వేదిక భాగస్వామ్య పార్టీలైన కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ మేరకు రైతు సంఘాల సమన్వయ సమితి తీర్మానించింది. విలేకరుల సమావేశంలో రైతు నాయకులు సింహాద్రి ఝాన్సీ, కొలనుకొండ శివాజి, చుండూరు రంగారావు, ఎలమందరావు, తోట ఆంజనేయులు, వీరబాబు, ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, మరీదు ప్రసాదుబాబు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో పోరాటాలు

(మొదటిపేజీ తరువాయి)

చట్టాల రక్షణ సాధ్యమన్నారు. అల్లూరికి నివాళ్లర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, నాయకులు ఎం.వాణిశ్రీ, పిల్లి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వి.శ్రీనివాసరావు అన్నారు. దేవీపట్నం మండలం ఉప్పయ్యపాలెం గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కార్మికులను పని ప్రదేశంలో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే క్రమంలోనే కేంద్రం బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తోందని తెలిపారు. ఆ చట్టాన్ని తెచ్చేందుకు వామపక్షాలు చేసిన కృషిని వివరించారు. మోడీ హయాంలో జిఒ 3 రద్దు, 1/70 చట్టం నిర్వీర్యంతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీ భీమవరం గ్రామంలో సర్పంచ్ ఈతపల్లి మల్లేశ్వరి సహా పలువురు గిరిజన మహిళలు శ్రీనివాసరావుకు హారతులిచ్చి, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ బిజెపి, టిడిపి, వైసిపిలను ఏజెన్సీలో ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సభకు ఈతపల్లి సత్యనారాయణరెడ్డి అధ్యక్షత వహించారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ బలోపేతానికి కృషి

- తిరుపతి రోడ్డుషోలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

'తిరుమల వెంకటేశ్వర స్వామి సాక్షిగా హామీ ఇస్తున్నాను. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తాం. టిటిడి మొదలుకొని అన్ని దేవాలయాల్లోనూ ట్రస్టు బోర్డు మెంబర్లుగా బ్రాహ్మణులను నియమించే బాధ్యత మాది. వైసిపి పాలనలో 120 ఆలయాలపైన, అర్చకులపైన దాడులు చేశారు. దేవాలయ ఆస్తులు కబ్జా చేశారు. కూటమి అధికారంలోకి రాగానే విచారణ జరిపి దేవాలయాలను కూల్చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. దేవాలయాల పవిత్రత కాపాడతాం' అని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. తిరుపతి లీలామహల్ సర్కిల్ నుంచి దేవేంద్ర థియేటర్, పాత కార్పొరేషన్ కార్యాలయం మీదుగా నాలుగు కాళ్ల మండపం వరకూ రోడ్‌షో నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. తిరుపతిలో దొంగలు పడ్డారని విమర్శించారు. పవన్‌కల్యాణ్‌కు నెల్లూరుతో ఎలాంటి అవినాభావ సంబంధం ఉందో, తనకు తిరుపతితో అలాంటి సంబంధమే ఉందని, తిరుపతిలో ప్రతి గల్లీ తాను తిరిగినదేనని చెప్పారు. తిరుపతిలో ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి 10 నుంచి 15 శాతం కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. పేరుకే తిరుపతి మేయర్ అని, పెత్తనమంతా డిప్యూటీ మేయర్‌దేనన్నారు. తిరుపతి అభివృద్ధి అంతా టిడిపి హయాంలోనే జరిగిందని గుర్తు చేశారు. తిరుపతిని పవిత్రమైన కేంద్రంగా నిలిపే బాధ్యత మోడీ, తాను, పవన్‌కల్యాణ్ తీసుకుంటామని చెప్పారు. సమయం ముగియడంతో 'హలో తిరుపతి, బాయ్‌బాయ్ జగన్' అంటూ సభను ముగించారు. సభ ప్రారంభానికి ముందుగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. అభినయ్‌రెడ్డి కావాలా? కోడిబొచ్చుపైన వ్యాపారం చేసే భూమన కరుణాకర్‌రెడ్డి, కొడుకు అభినయ్‌రెడ్డి కావాలా? అని ప్రశ్నించారు. అమరరాజా పరిశ్రమను తిరిగి తిరుపతికి తీసుకొచ్చి, ఉపాధి కల్పిస్తామన్నారు. తిరుమల తిరుపతి నిధులతో విద్య, వైద్యంతో పాటు స్థానిక ప్రజల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు నరసింహయాదవ్, సిఆర్ రాజన్, సుగుణమ్మ, భానుప్రకాష్‌రెడ్డి, పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్ పాల్గొన్నారు.

మూడో దశ 61.48 శాతం పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

బోగస్ ఓటింగ్ జరిగిందో అక్కడ తమ కార్యకర్తలు అడ్డుకుంటారని చెప్పారు. మెషీన్ (ఈవిఎం) ఏదైనా మెషీన్ అని, తానెప్పుడూ ఈవీఎంలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘడ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈవిఎంలో మీ ఓటు ఎటు వెళ్లిందో మీరు చూడలేరని అన్నారు. వివిప్యాట్ మెషీన్‌లో సాఫ్ట్‌వేర్ ఉంటుందని, అసలు ఏం జరగాలనేది ఆ సాఫ్ట్‌వేర్ నిర్ణయిస్తుందని దిగ్విజయ్ పేర్కొన్నారు. మనం ఏం చేసినా సాఫ్ట్‌వేర్ తాను కోరుకున్నదే ప్రింట్ చేస్తుంది..దాన్నే ఎన్నికల అధికారులు కౌంట్ చేస్తారని దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యానించారు.

మూడో విడత పోలింగ్ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పోలింగ్ ప్రారంభమైన తొలి గంటలోనే ఓటు వేశారు. గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్ పరిధిలోని అహ్మదాబాద్‌లో ఉన్న నిషాన్ హైస్కూల్‌లో ప్రధాని మోడీ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా కేంద్ర హోం శాఖ మంత్రి, గాంధీనగర్ బిజెపి ఎంపి అభ్యర్థి అమిత్ షా సైతం తన కుటుంబంతో కలిసి అహ్మదాబాద్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. సతీమణి సోనాల్ షా, కుమారుడు, బిసిసిఐ కార్యదర్శి జైషా ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఓటేశారు.

ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బిజెపి విదిశ లోక్‌సభ అభ్యర్థి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రులు మన్‌సుఖ్ మాండవీయ, ప్రహ్లాద్ జోషి, జ్యోతిరాదిత్య సింధియా, బారామతి ఎంపి అభ్యర్థులు సుప్రియా సూలే, సునేత్ర పవార్, మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవార్, ఎన్‌సిపి చీఫ్ శరద్ పవార్, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో అదానీ గ్రూపు చైర్మెన్ గౌతమ్ అదానీ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహమ్మద్‌పురా ప్రైమరీ స్కూల్‌లో ఉన్న పోలింగ్ బూత్‌లో ఆయన ఓటేశారు. యాక్టర్స్ రితీష్ దేశ్‌ముఖ్, జెనీలియా మహారాష్ట్రలోని లోతూర్ లో ఓటు వేశారు.

ఎన్నికల విధుల్లో కలిసికట్టుగా పనిచేయాలి

- శాంతియుత పోలింగ్ నిర్వహణకు చర్యలు
- ఎన్నికల పరిశీలకులు రామ్ మోహన్ మిశ్రా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాధారణ ఎన్నికల్లో అధికారులు కలిసికట్టుగా పనిచేయడం ద్వారా ప్రత్యేక అవకాశంగా భావించి ఈ మేరకు విజయవంతం చేయాలని ఎన్నికల పరిశీలకులు రామ్ మోహన్ మిశ్రా పిలుపునిచ్చారు. మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సాధారణ ఎన్నికలు – 2024 సంసిద్ధతపై నోడల్ అధికారు లు, ఇతర సిబ్బందితో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ పోలింగ్‌ను శాంతియుతంగా నిర్వహించాలన్నారు. ప్రశాంతం గా ఎన్నికల నిర్వహించేందుకు అన్ని రకాల గట్టి బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భం గా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధ నలను పాటిస్తూ ఎన్నికలను సజావుగా జరిపేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఒక పార్లమెంట్, 8 అసెంబ్లీ నియోజక వర్గాలు, 20,20,366 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికల కోసం 2,236 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ర్యాంపు, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్, షేడ్, లైటింగ్ లాంటి అన్ని రకాల కనీస సౌకర్యాలు కల్పించామన్నారు. 576 వీల్‌ఛైర్స్ సౌకర్యాన్ని కల్పించామన్నారు.

ప్రలోభాలకు గురయ్యే ఉద్యోగులపై చర్యలు

- వివిఐపి బందోబస్తుకు వెళ్లిన పోలీసులకు 9న బ్యాలెట్‌ను ఉపయోగించుకునే అవకాశం
- ఇప్పటి వరకు 3.03 లక్షల పోస్టల్ బ్యాలెట్లు వినియోగం
- సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోస్టల్ బ్యాలెట్ వినియోగం సమయంలో ప్రలోభాలకు గురయ్యే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా హెచ్చరించారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో లంచాలు ఇచ్చేవారితోపాటు లంచాలు పుచ్చుకునే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయంలో మంగళవారం ఆయనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కొంత మంది ఉద్యోగులు ప్రలోభాలకు లోబడుతూ నగదు కూడా తీసుకుని ఓటు హక్కును వినియోగించుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో డబ్బులు పంచుతున్న నలుగురిని అరెస్టు చేసి ఎఫ్ఐఆర్ నమోదుచేశామన్నారు. అనంతపురంలో ఒక కానిస్టేబుల్ ఉద్యోగుల జాబితాను పట్టుకుని నగదు పంపిణీ చేస్తున్నట్లు గుర్తించామని, ఆయన్ను వెంటనే సస్పెండ్ చేశామని చెప్పారు. విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఫెసిలిటేషన్ సెంటర్ దగ్గర కొంత నగదును సీజ్ చేశామన్నారు. ఒంగోలులో కొంతమంది యుపిఐ విధానం ద్వారా కొంతమంది ఉద్యోగులకు నగదు పంపినట్లు గుర్తించామన్నారు. సంబంధిత జిల్లా ఎస్‌పిని సమగ్ర విచారణ చేయాలని ఆదేశించామని చెప్పారు.

అలాగే వివిఐపిల పర్యటనల బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది, అధికారులు ఈ నెల 9న తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా వెల్లడించారు.

ఇప్పటి వరకు 70 శాతం పోస్టల్ బ్యాలెట్ వినియోగం

పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న 4.30 లక్షల మంది ఉద్యోగుల్లో ఇప్పటి వరకూ 3.03 లక్షల (70 శాతం) లక్షల మంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని సిఇఒ తెలిపారు. కొన్ని జిల్లాల్లో 3న, మరికొన్ని జిల్లాల్లో 4న హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ప్రారంభమైందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో 3.20 లక్షల మంది ఉద్యోగులు, 40 వేల మంది పోలీసులు, హోమ్ ఓటింగ్ కేటగిరి కింద 28 వేల మంది, ఎసెన్షియల్ సర్వీసెస్ కేటగిరి కింద 31 వేలమందితో పాటు సెక్టార్ ఆఫీసర్లు ఉన్నట్లు తెలిపారు. వీరిలో 2.76 లక్షల మంది ఉద్యోగులు ఫెసిలిటేషన్ సెంటర్లలోనూ, హోమ్ ఓటింగ్, ఎసెన్షియల్ సర్వీసెస్ కేటగిరి కింద 28 వేల మంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు.

ఎంఎల్‌హెచ్‌పి వేధింపులు..

- ఆశావర్కర్ ఆత్మహత్యాయత్నం
- ఆసుపత్రి ఎదుట ఆందోళన

ప్రజాశక్తి-గోరంట్ల టౌన్

శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల పట్టణంలోని ప్రభుత్వా సుపత్రిలో ఆశ వర్కర్ గా పని చేస్తున్న శబరి ఎంఎల్‌హెచ్‌పి వేధింపులు తాళలేక ఆత్మహత్యకు యత్నించింది. మంగళ వారం ఉదయం ఆమె క్రిమిసంహారక మందు తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు మాట్లాడు తూ గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఎంఎల్ హెచ్‌పి గౌతమి శబరిని అకారణంగా నిత్యం వేధిస్తుండంతో తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించింద న్నారు. ఆసుపత్రిలో మందులు, పరికరాలను శబరి ఎత్తుకెళ్లిందని అకారణంగా నిందలు మోపిందన్నారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శబరి ఇంట్లో క్రిమిసంహార మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడిందన్నారు.

ఆసుపత్రి ఎదుట ఆందోళన

ఆశావర్కర్‌పై అకారణంగా నిందలు మోపి వేధింపులకు గురి చేసిన ఎంఎల్‌హెచ్‌పిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సాంబ మాట్లాడుతూ ఆశ వర్కర్ శబరిని వేధించిన గౌతమిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు గంట పాటు ఆందోళన కొనసాగింది. ఈ విషయం తెలుసుకున్న సిఐ సుబ్బరాయుడు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి న్యాయం చేస్తామని చెప్పారు. దీంతో ఆశార్కర్లు ఆందోళన విరమించారు.

ఎయిర్‌పోర్టుల అభివృద్ధి సంస్థ
బకాయిలపై హడ్కో ఆగ్రహం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రుణాలు తీసుకోవడం, తిరిగి సకాలంలో వాటిని చెల్లించలేక అపవాదులను ఎదుర్కొనడం రాష్ట్ర ఆర్థికశాఖకు అలవాటుగా మారింది. తాజాగా హడ్కో నుంచి కూడా హెచ్చరికలు వచ్చాయి. రాష్ట్రంలోని విమానాశ్రయాల అభివృద్ధి సంస్థకు ఇచ్చిన రుణాలపై వాయిదాలను చెల్లించకపోవడంపై హడ్కో తీవ్రంగానే స్పందిస్తూ ఇలా అయితే భవిష్యత్తులో రుణ సాయం కొనసాగించలేమంటూ హెచ్చరించింది. రాష్ట్రంలోని విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ పలు అభివృద్ధి పనుల కోసం హడ్కో నుంచి రుణాన్ని తీసుకుంది. ఇందుకు సంబంధించిన వాయిదాల చెల్లింపుల్లో ప్రతిసారీ జాప్యం జరుగుతోంది. ఈసారి కూడా ఫిబ్రవరిలో చెల్లించాల్సిన 38.86 కోట్ల రూపాయలను మే నెల వచ్చినప్పటికీ చెల్లించకపోవడంతో రాష్ట్ర ఆర్థికశాఖకు లేఖ రాసింది. ఇంకా జాప్యం చేస్తే సంస్థ నిరర్ధక ఆస్తుల జాబితాలోకి చేరిపోతుందని హెచ్చరించింది. ఇదే జరిగితే ఇకపై రుణ సాయాన్ని కొనసాగించలేమని లేఖలో తేల్చిచెప్పింది. సాయం కొనసాగాలంటే వాయిదా బకాయిలపై తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

కాయ్.. రాజా కాయ్..!

- అభ్యర్థి గెలుపు, మెజార్టీలపై పందేల హోరు
- దెందులూరు, ఉండి వంటి స్థానాల్లో పోరు రసవత్తరం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న కొద్దీ బెట్టింగుల జోరు ఊపందుకుంది. ప్రతి నియోజకవర్గంలోనూ అభ్యర్థి గెలుపు, మెజార్టీలపై పందేలు హోరెత్తుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. అక్కడా, ఇక్కడా అనే తేడా లేకుండా ప్రతి నియోజకవర్గంలోనూ పందేలు సాగుతున్నాయి. దెందులూరు, ఉండి వంటి నియోజకవర్గాల్లో రాజకీయం రసవత్తరంగా మారడంతో పందెంరాయుళ్లు అదేస్థాయిలో రెచ్చిపోతున్నారు. నరసాపురంలో ఫలానా పార్టీ అభ్యర్థి గెలుస్తారంటూ కోసు పందేలు సైతం వేస్తున్నట్లు తెలుస్తోంది. అత్యధిక పందేలు అభ్యర్థి గెలుపుపై సాగుతుండగా, అభ్యర్థి గెలుస్తాడన్న ధీమా ఉన్న నియోజకవర్గాల్లో మెజార్టీపైనా పందేలు కాస్తున్నారు. ఎన్నికల పందేల్లో విచిత్రమైన పరిస్థితి కన్పిస్తోంది. వైసిపి అభిమానులు టిడిపి గెలుస్తుందని పందేలు కాస్తుండగా, టిడిపి అభిమానులు వైసిపి అభ్యర్థులు గెలుస్తారని పందేలు కాస్తుండటం గమనార్హం. ముఖ్యంగా వివిధ సంస్థలు విడుదల చేస్తున్న సర్వేల ఆధారంగా పందేల జోరు ఊపందుకుంటుంది. ఆచంట నియోజకవర్గంలో టిడిపి నుంచి పితాని సత్యనారాయణ, వైసిపి నుంచి చెరుకువాడ రంగనాథరాజు నువ్వానేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. ఆర్థికంగా బలమైన అభ్యర్థులు కావడంతో గెలుపుపై ఇరువురు ధీమాగా ఉన్నారు. దీంతో ఇక్కడ అభ్యర్థి గెలుపుపై ఎక్కువగా పందేలు సాగుతున్నాయి. పాలకొల్లులో గడిచిన రెండుసార్లుగా టిడిపి తరపున నిమ్మల రామానాయుడు గెలిచారు. ఈసారి వైసిపి నుంచి గుడాల గోపి, టిడిపి నుంచి రామానాయుడు తలపడుతున్నారు. నిమ్మల మూడోసారి గెలుస్తాడని కొంతమంది పందేలు కాస్తుండగా, ఈసారి గోపీ గెలుస్తారని మరికొంత మంది పందేలు కాస్తున్నారు. ఇక్కడ అభ్యర్థుల మెజార్టీపై పందేలు సాగుతున్నాయి. నరసాపురంలోనూ అభ్యర్థి గెలుపు, మెజార్టీపైనా పందేలు జోరుగా సాగుతున్నాయి. భీమవరంలో వైసిపి నుంచి గ్రంధి శ్రీనివాస్, జనసేన నుంచి పులపర్తి రామాంజనేయులు తలపడుతున్నారు. ఈ స్థానంలో పందేలు పెద్దఎత్తున సాగుతున్నాయి. అభ్యర్థి గెలుపుకంటే మెజార్టీపైనే ఎక్కువ బెట్టింగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఉండిలో టిడిపి నుంచి పోటీ చేస్తున్న రఘురామకృష్ణంరాజు గెలుపోటములపై ఎక్కువగా పందేలు నడుస్తున్నాయి. తాడేపల్లిగూడెం, తణుకులోనూ అభ్యర్థి గెలుపుపై ఎక్కువగా బెట్టింగులు కడుతున్నారు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో టిడిపి నుంచి చింతమనేని ప్రభాకర్, వైసిపి నుంచి అబ్బాయిచౌదరి మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లు ఉంది. దీంతో ఇక్కడ పందేలు మరింత ఎక్కువగా సాగుతున్నాయి. విజేత ఎవరైనా అతి తక్కువ మెజార్టీనే వస్తుందని లెక్కలు కడుతూ మెజార్టీపైనే పందేలు సాగుతున్నాయి. ఏలూరులో అభ్యర్థి గెలుపుపై ఎక్కువగా పందేలు సాగుతున్నాయి. నూజివీడు, చింతలపూడిలో అభ్యర్థి గెలుపుపై పందేలు సాగుతుండగా, కైకలూరులో అభ్యర్థి మెజార్టీపై పందేలు ఎక్కువగా సాగుతున్నాయి. పోలవరంలో మాత్రం పందేల జోరు కొంత తక్కువగా ఉంది. ఎంపీ స్థానాలపైనా పందేలు పడుతున్నారు. ఏలూరు, నరసాపురం ఎంపీ స్థానాలు ఏ పార్టీ గెలుచుకుంటుందనే దానిపై పందేలు సాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలోనూ రూ.20 కోట్లకుపైగా పందేలు ఉంటాయని అంచనా. కొంతమంది ఒక్కటిగా కలిసి తలోకొంత వేసుకుని పందేలు కడుతున్నారు. మధ్యవర్తుల ద్వారా ఈ పందేలు సాగుతున్నాయి. పందేలు కాసేవారు మధ్యవర్తిని కలిసి చెబితే అతను వేరొకరిని పందేనికి ఏర్పాటు చేస్తున్న పరిస్థితులు సాగుతున్నాయి. ఈ పందేల విషయం బయటికి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎవరికి ఆనందం.. ఎవరికి బాధో జూన్ నాలుగో తేదీన తెలియనుంది.

26 మంది పిఒ, ఎపిఒలకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి -తిరుపతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా ఎన్నికల అధికారులు పిఒ,, ఎపీఓ లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన 26 మందికి జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పిఒ, ఎపిఒలకు రెండు విడతల శిక్షణ తరగతులు జరిగాయి. అందులో మొదటి విడత వారు పని చేస్తున్న అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా, రెండో విడత వారికి ఎన్నికల విధులు నిర్వర్తించ వలసిన నియోజక వర్గాల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించారు. రెండవ విడత శిక్షణ తరగతుల్లో మొత్తం 4524 మంది పిఒ, ఎపిఒలకు శిక్షణకు రావాలని ఆదేశాలు జారీ చేశారు. అందులో 4498 మంది హాజరయ్యారు. 26 మంది ఏ విధమైన కారణం చూపకుండా శిక్షణకు గైర్హాజరు అయ్యారు. ఈ 26 మంది నుండి రాత పూర్వక సంజాయిషీ కొరకు అండర్ సెక్షన్ 134ఆర్‌పి యాక్ట్ ప్రకారము షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో వారి నుండి సంతప్తికరమైన సమాధానం రాకపోయిన యెడల ఎన్నికల విధుల నిర్వహణలోఅలసత్వం ప్రదర్శించినందు వలన ఎన్నికల నియమావళి ప్రకారము తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



యుపిలోని సంభాల్ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్ వద్ద లైన్లో వేచి ఉన్న ముస్లిం ఓటర్లను తనిఖీ చేస్తున్న పోలీసులు



బీహార్‌లోని ఖగారియా నియోజకవర్గంలో పోటెత్తిన మహిళలు



అస్సాంలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు క్యూలో వేచి ఉన్న ఓటర్లు


కోర్బా ఎన్నికల బరిలో వ్యవసాయ కూలీ

- జీరో బ్యాలెన్స్ బ్యాంక్ ఖాతా

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ భేద్రపాణి గ్రామానికి చెందిన శాంతి బాయి మారావి అనే వ్యవసాయ కూలి కోర్బా లోక్‌సభ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. నామినేషన్ దాఖలు సమయంలో తన ఆస్తుల వివరాల్లో జీరో బ్యాంక్ బ్యాలెన్స్‌గా నమోదు చేశారు. దీంతో ఆమెకు జీరో బ్యాలెన్స్ అనే పేరు వచ్చింది. తన తోటి వ్యవసాయ కూలీల ఆర్థిక సహకారంతో డిపాజిట్ మొత్తాన్నీ కట్టానని శాంతి చెబుతున్నారు. రోడ్లు, సరైన రవాణా సదుపాయం లేక తమ ప్రాంతం వాళ్ల ఇబ్బందులు పడుతున్నారని ఏ రాజకీయ పార్టీ వారి సమస్యలను వినకపోవడంతో తానే ఎన్నికల్లో పోటీకి దిగానని చెప్పారు శాంతి బాయి. డబ్బుతో పనిలేకుండా స్థానిక సమస్యలపై ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయొచ్చనడానికి శాంతి బాయిని ఒక ఉదాహరణగా చెప్పొచ్చు. కోర్బా నియోజకవర్గానికి మే 7న (మంగళవారం) పోలింగ్ జరిగింది.



దేశద్రోహులుగా పిలుస్తారని గాంధీ, నెహ్రూలు ఊహించలేదు : ప్రియాంక



రాయ్‌బరేలీ : జాతిపిత మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ తమను దేశద్రోహులుగా పిలుస్తారని ఊహించలేదని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ అన్నారు. రాయ్‌బరేలీలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ.. 'గాంధీ, నెహ్రూలిద్దరూ దేశ ప్రజల హక్కులను బలోపేతం చేసేందుకు ఉద్యమాలు చేశారు. అయితే దేశంలో తమను దేశ ద్రోహులుగా పిలిచే ప్రభుత్వం వస్తుందని వారు ఊహించలేదు.' అని ఆమె అన్నారు. ఈ ప్రచారంలో ప్రియాంక రైతుల నిరసనల్ని కూడా ప్రస్తావించారు. బ్రిటీష్ రాజ్ సమయంలో జరిగిన రైతు నిరసనల్లో మోతీలాల్ నెహ్రూ, గాంధీలను మొదటిసారి అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. అప్పటి నుంచి రాయ్‌బరేలీలో ఓవైపు ప్రజాస్వామ్యం, మరోవైపు ఉగ్రవాదం తరహా రాజకీయాలు ఉన్నాయి. ఈ పోరాటంలో ఎల్లప్పుడూ సత్యం, ప్రజాస్వామ్య సూత్రాలకు మీరు విజయాన్ని అందించారని కాంగ్రెస్ కార్యకర్తలనుద్దేశించి అన్నారు. కాగా రాయ్‌బరేలీ నుంచి రాహుల్‌గాంధీ పోటీ చేస్తున్నారు. ఇక్కడ మే 20న ఎన్నికలు జరగనున్నాయి.

తెలంగాణలో హస్తానికే మెజార్టీ సీట్లు !

- కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ మధ్య త్రిముఖ పోటీ
- అగ్రనేతల సుడిగాలి ప్రచారం

ఎస్. భవాని

గతేడాది తెలంగాణాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఘోరంగా ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కొద్ది నెలలకే లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడాక బిఆర్ఎస్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. కేంద్రంలో 400 సీట్ల లక్ష్య సాధన కోసం బిజెపి తెలంగాణాలో వీలైనన్ని సీట్లు తెచ్చుకునేందుకు పావులు కదుపుతోంది. మరోవైపు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎక్కువ స్థానాలను గెలవాలని ప్రయత్నిస్తోంది. భువనగిరి స్థానంలో పోటీ చేస్తున్న సిపిఎం మిగతాచోట్ల కాంగ్రెస్‌ను బలపరుస్తుండగా, సిపిఐ అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు మద్దతునిస్తోంది. తెలంగాణాలో 17 లోక్‌సభ స్థానాలున్నాయి. మే 13న ఇక్కడ పోలింగ్ జరగనుంది.

పీక్‌కు ప్రచారం..

తెలంగాణాలో పార్టీలు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము మ్యానిఫెస్టోలో పెట్టిన ఆరు హామీల్లో కొన్నింటిని అమలు చేశామని, మిగతావాటినీ అమలుపరుస్తామన్నది కాంగ్రెస్ ప్రధాన ప్రచారంగా ఉంది. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ పాల్గొంటున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రచారానికి నాయకత్వం వహిస్తున్నారు. కాగా, బిఆర్ఎస్, బిజెపిలు రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని ప్రచారం సాగిస్తున్నాయి. మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కె చంద్రశేఖరరావు మొత్తం 17 నియోజకవర్గాలనూ కవర్ చేసేలా బస్సు చేస్తున్నారు. మరోవైపు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఇమేజ్ తోపాటు 'అబ్‌కీ బార్, 400 పార్' నినాదంతో బిజెపి నేతలు ప్రచారం చేస్తున్నారు. మోడీ, అమిత్‌షా ఇప్పటికే అరడజనుకు పైగా జరిగిన సభల్లో పాల్గొన్నారు. ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తామంటూ కొత్త వివాదానికి తెరలేపి ఉద్రిక్తతలు, విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు.

గత ఎన్నికల ఫలితాలు

రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలుండగా 2019 ఎన్నికల్లో బిజెపి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, సికింద్రాబాద్ స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో బిజెపి విస్తరణకు పునాది ఏర్పడినట్టైంది. అప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన కాంగ్రెస్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో మూడు స్థానాలనే గెలుచుకుంది. హైదరాబాద్‌లో ఎంఐఎం తన సీటును నిలుపుకుంది.



జంపింగ్‌లకు టిక్కెట్లు

ప్రస్తుతం జరుగుతున్న ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఈ మూడు పార్టీలకు చెందిన అభ్యర్థుల జాబితాలను పరిశీలిస్తే.. ఇటీవల పార్టీలు మారిన పలువురు సిట్టింగ్ ఎంపీలు, సీనియర్ నాయకులు ఇప్పుడు.. మునుపటి పార్టీలకు వ్యతిరేకంగా పోటీ చేయడం విశేషం. తెలంగాణ నుంచి పార్లమెంట్‌కు ఎక్కువ మంది ఎంపీలను పంపాలని భావిస్తున్న బిజెపి, తగ్గట్టుగానే రిజర్వేషన్ల విషయంలో బిజెపి నేతలు తమ చర్యలను సమర్థించుకుంటున్నారు. కాంగ్రెస్ సైతం ఎక్కువ సంఖ్యలో లోక్‌సభ స్థానాల్లో గెలవాలని ప్రయత్నిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ప్రజాదరణ లోక్‌సభ ఎన్నికల్లో కూడా కొనసాగుతుందని భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓడివడంతో.. ఆ పార్టీ ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. అయితే ఇది తాత్కాలికమేనని ఆ పార్టీ అధినేత కెసిఆర్ కార్యకర్తల్లో విశ్వాసాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీని విడిచి వెళ్లిన కీలక నేతల నుంచి బిఆర్ఎస్ సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రధానంగా కెసిఆర్ కుమార్తె కవిత ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టయి జైలుకెళ్లడం. ఫోన్ ట్యాపింగ్ కేసులో కొందరు పోలీసులు, అధికారులు, బిఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందన్న ఆరోపణలు ఆ పార్టీని ఇబ్బంది పెడుతున్నాయి. కాళేశ్వరం, మేడిగడ్డ విషయంలో కూడా ఆ పార్టీ ఇబ్బంది పడుతోంది. వర్షాభావం వలన రైతుల పంటలు దెబ్బతిన్నాయంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని బిఆర్ఎస్ విమర్శిస్తోంది. రైతులకు రెండు లక్షల రుణ మాఫీని అమలు చేయడంలో విఫలమైందని బిఆర్ఎస్ కాంగ్రెస్‌పై విరుచుకుపడుతోంది. దీనికి కాంగ్రెస్ నేతలు ఆగస్టు 15 లోపు హామీలు నెరవేరుస్తామని కౌంటర్ ఇస్తున్నారు.





సీట్లు 17	
మొత్తం ఓటర్లు	3.3 కోట్లు
పురుషులు	1.64 కోట్లు
మహిళలు	1.66 కోట్లు
థర్డ్‌జెండర్స్	2,736.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బిజెపి



ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని బిజెపి మతపరమైన భావాలను రెచ్చగొడుతోంది. అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని కూడా మారుస్తామని చెబుతోంది. మొత్తంగా చూసుకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్‌కి బిజెపినే గట్టి పోటీ ఇస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే కాంగ్రెస్‌కి బిఆర్ఎస్ పోటీ ఇవ్వనుంది. ఉత్తర తెలంగాణాలో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గాల్లో కులాల వారీగా ఓటర్ల పోలరైజేషన్ కనిపిస్తోంది. ఇక హైదరాబాద్ నియోజకవర్గంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై.. మాధవీ లతను బిజెపి పోటీకి నిలబెట్టి సెంటిమెంట్‌ను రాజేస్తోంది. ముస్లింలు గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నారని స్పష్టంగా తెలుస్తోంది. ఈ పరిణామం కాంగ్రెస్‌కు కలిసొచ్చే అంశం. ముస్లింలు గణనీయమైన సంఖ్యలో ఉన్న అరడజనుకు పైగా నియోజకవర్గాల్లో ఇది కాంగ్రెస్‌కు బలం చేకూరుస్తుంది. మొత్తంగా తెలంగాణాలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. అత్యధిక స్థానాల్లో గెలిచేందుకు అవకాశం ఉంది. ఇక బిజెపి పాత సీట్లను సాధించేందుకు ప్రయత్నిస్తోంది. బిఆర్ఎస్ మాత్రం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది.

2019 ఎన్నికల్లో


పార్టీ	గెలిచిన సీట్లు	పోలైన ఓట్లు	ఓటు శాతం
బిఆర్ఎస్	9	76.9 లక్షలు	41.7
బిజెపి	4	36.3 లక్షలు	19.6
కాంగ్రెస్	3	54.9 లక్షలు	29.8
ఎఐఎంఐఎం	1	5.17 లక్షలు	2.8

దశలు మారిన గుర్తులు


- కాంగ్రెస్- జోడెద్దుల నుంచి హస్తానికి
- బిజెపి- దీపం నుంచి కమలానికి
- 75 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం

పటౌడి

ప్రస్తుతం ఒకటి అధికార పక్షం... ఇంకొకటి ప్రతిపక్షం... అవే భారతీయ జనతాపార్టీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్. ఎన్నికల్లో తమతమ గుర్తులను జనంలోకి తీసుకెళ్లేందుకు అనునిత్యం ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అయితే ఆ పార్టీల ఎన్నికల చిహ్నాల వెనుక పెద్ద చరిత్రే ఉంది. 75 ఏళ్ల భారతదేశ రాజకీయ చరిత్రలో ఈ రెండు పార్టీల గుర్తుల్లో పెను మార్పులు చేసుకున్నాయి. అఖిల భారత జనసంఘ్ తొలుత దీపం గుర్తుతో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించగా, కాంగ్రెస్ పార్టీ జోడెద్దులు-నాగలి గుర్తుతో ఎన్నికల ప్రయాణానికి అంకురార్పణ కావించింది.



1952 - 1969 మధ్య కాంగ్రెస్ గుర్తు



1971 - 1977 మధ్య కాంగ్రెస్ గుర్తు



1978 నుంచి కాంగ్రెస్ గుర్తు

కాంగ్రెస్

కాంగ్రెస్ విషయానికి వస్తే 1952 సంవత్సరం నుంచి నాగలితో కూడిన జోడెద్దుల గుర్తును తమ పార్టీ సింబల్‌గా చేసుకుని ఎన్నికల్లో నిలిచింది. అయితే ఇందిరాగాంధీ నేతృత్వంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్–ఆర్ (రిక్విజిషనలిస్ట్)గా మారింది. దీనినే కొద్దికాలం ఐఎన్‌సి–ఓ (ఆర్గనైజేషన్)గా కూడా పిలిచారు. పాత పార్టీలో మిగిలిపోయిన కొంతమంది జోడెద్దులను గుర్తుగా కొనసాగించుకోగా, ఇందిరా గాంధీ కాంగ్రెస్ ఆవు–దూడను గుర్తుగా మార్చుకుంది. 1971 ఎన్నికల్లో ఇందిర అధ్వర్యంలో ఏకంగా 352 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించింది. అలాగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీలలో కూడా ఆ పార్టీ జెండా రెపరెపలాడింది. ఆ తరువాత తన పార్టీని కాంగ్రెస్ (ఐ)గా మార్చుకుని 1977 ఎన్నికల బరిలోకి దిగారు. కాలక్రమేణా ఇదే పార్టీ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సి)గా రూపాంతరం చెంది హస్తం గుర్తుకి మారింది. ఇలా 1952 నుంచి 72 సంవత్సరాల ప్రయాణంలో మూడు గుర్తులను మార్చుకుంది.



1951 - 1977 మధ్య అఖిల భారత జనసంఘ్



1980 తర్వాత బిజెపి గుర్తు

అఖిల భారత జనసంఘ్.. బిజెపి..

తొలుత అఖిల భారత జనసంఘ్ ఆ తరువాత బిజెపిగా మారింది. ఈ పార్టీల విషయానికి వస్తే తన రాజకీయ గమనంలో రెండు సార్లు గుర్తులను మార్చుకుంది. 1951లో భారతీయ జనసంఘ్ పేరుతో ఉన్న ఆ పార్టీ వెలుగుతున్న నూనె దీపం గుర్తును కలిగి ఉంది. 1977 వరకు ఇదే గుర్తు కొనసాగగా, 1977లో ఇతర పార్టీలతో కలిపి జనతా పార్టీగా పోటీ చేసింది. మూడేళ్ల అనంతరం జనతాపార్టీని రద్దు చేయడంతో బిజెపి ఏర్పాటైంది. అప్పటి నుంచే ఆ పార్టీ కమలం సింబల్‌తో ఎన్నికల్లో పోటీ చేస్తోంది. రెండు జాతీయ పార్టీలు తమ గుర్తుల ప్రస్తానంలో పలు మార్పులు చేసుకొని కాంగ్రెస్ హస్తం, బిజెపి కమలం సింబల్‌పై 2024 సార్వత్రిక ఎన్నికల బరిలోకి దిగాయి.


పోలింగ్ బూత్‌లలో లూటీ : అఖిలేష్ యాదవ్



లక్నో : సమాజ్‌వాదీ పార్టీ కంచుకోట మెయిన్‌పురిలో ఈ తడవ మాజీ సిఎం, ఎస్‌పి చీఫ్ అఖిలేష్ యాదవ్ భార్య డింపుల్ యాదవ్ పోటీ చేస్తున్నారు. తన భర్త అఖిలేష్ యాదవ్‌తో కలిసి తన నియోజకవర్గంలోని ఎటావాలో మంగళవారం డింపుల్ ఓటు వేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ.. 'బిజెపి మద్దతుదారులు పోలింగ్ బూత్‌లను లూటీ చేశారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వలేకపోయింది. మోడీ ప్రభుత్వం తెచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి వందలాది మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. 2021లో కేంద్ర మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా దారుణంగా రైతులను కారుతో తొక్కించి హత్య చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. బిజెపిలో అధికార దాహం ఎక్కువగా ఉంది. అందుకే ఆ పార్టీ నేతలు తమకు నచ్చిన విధంగా ఆత్మసంతృప్తి ప్రకటనలు చేస్తున్నారు.' అని అన్నారు.

కలం బాణాలు

కార్పొరేట్ల కోసమే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ : 'ఇండియా' నేతలు



కార్పొరేటు కోసం కద
లాండ్ టైటిల్ యాక్టు
ఎన్డీయే బహుమానం
జగన్ చేసె ఫ్యాక్టు

బిజెపి వైసీపీ
టిడిపి పాత్ర
కప్పిపుచ్చి జనంముందు
రాజకీయ మాత్ర

జూన్ 4తో బిజెడి ప్రభుత్వ గడువు ముగుస్తుంది : మోడీ

ఒడిస్సాలో నవీన్ పైన
సూటిగ నే దాడి
ఎపిలో జగనంటే
పేరెత్తని గారడీ

మోడీజీ డబుల్ గేమ్
గోదారికి నవ్వు
బాబు పవనులకేమో
అంతులేని లవ్వు



'మా ఇంట్లో ఓట్లు అమ్మబడవు'



ఓట్లు అమ్మబోమంటూ
ప్రతి ఇంటికి బోర్డు
అతికిస్తే మాయదారి
బేహారులు క్లీనుబౌల్డు

డబ్బుతోటి అధికారం
కారుచౌక వ్యవహారం
గద్దెక్కిన మరుక్షణం
దేశ సంపదల వేలం

- తె.ర



విశాఖలో ఆసక్తికర పోరు !

- టిడిపి కూటమిలో బుజ్జగింపులు కొలిక్కి
- సంక్షేమమే ప్రధాన అస్త్రంగా వైసిపి
- ఉక్కు పరిరక్షణ ధ్యేయంగా ఇండియా బ్లాక్



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో కీలక నగరంగా ఉన్న విశాఖ జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల మధ్య ఆసక్తికర పోరు నెలకొంది. వైసిపి, టిడిపి - జనసేన - బిజెపి కూటమి, ఇండియా బ్లాక్‌లు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. విశాఖ పార్లమెంట్ పరిధిలో భీమునిపట్నం, గాజువాక, విశాఖ ఉత్తరం, దక్షిణం, పశ్చిమం, తూర్పు, ఎస్.కోట నియోజకవర్గాలున్నాయి. ఎంపి అభ్యర్థులుగా వైసిపీ తరపున బొత్స ఝాన్సీ, టిడిపి తరపున ఎం.శ్రీభరత్, ఇండియా బ్లాక్ తరుపున కాంగ్రెస్ అభ్యర్థి పి.సత్యారెడ్డి మధ్య ప్రధాన పోటీ నెలకొంది. సంక్షేమమే ప్రధాన అస్త్రంగా వైసిపి ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ప్రచారం చేపట్టింది. . ప్రభుత్వ వైఫల్యాలు, చంద్రబాబు ప్రకటించిన మ్యానిఫెస్టో తనను గెలిపిస్తాయన్న ధీమాలో శ్రీభరత్ ఉన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ నినాదంతో సిపిఎం., సిపిఐ మద్దతుతో పి.సత్యారెడ్డి ప్రచారం సాగిస్తున్నారు.

రాష్ట్ర పరిపాలనా రాజధానిగా విశాఖను వైసిపి ప్రతిపాదించిన నేపథ్యంలో ఇక్కడ నుండి అత్యధిక అసెంబ్లీ సీట్లు సాధించాలన్న తలంపుతో వైసిపి అధినేత వైఎస్.జగన్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. తెలుగుదేశం పార్టీ 2019 ఎన్నికల్లో గెలిచిన మొత్తం స్థానాల్లో దాదాపు ఐదో వంతు విశాఖ నగరంలోనివే. అయితే 2024 ఎన్నికలకొచ్చేసరికి పార్లమెంట్ మొదలుకొని అసెంబ్లీ స్థానాల వరకూ వైసిపికి ధీటైన అభ్యర్థులను బరిలోకి దించడం కనాకష్టంగా మారింది. విశాఖ ఉత్తర నియోజకవర్గాన్ని బిజెపికి, దక్షిణ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించడంతో తలనొప్పులు ఎక్కువయ్యాయి. భీమిలి అసెంబ్లీ స్థానాన్ని అప్పటి వరకూ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న కోరాడ రాజబాబును కాదని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు కేటాయించడంపైనా అసంతృప్తులు వెల్లువెత్తాయి. పరిస్థితిని గమనించిన చంద్రబాబు రంగంలోకి దిగి అసంతృప్తివాదులను బుజ్జగించడంలో సఫలీకృతులయ్యారు.

పలుచోట్ల పోటీ ఇలా..

విశాఖ తూర్పులో టిడిపి సిట్టింగ్ ఎంఎల్ఎ వెలగపూడి రామకృష్ణబాబు... నాలుగోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. వైసిపి నుంచి ఎంపీ ఎంవివి.సత్యనారాయణ ఈసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. ఇక్కడ మత్స్యకారులు, యాదవులు, మధ్యతరగతి ఓట్లే కీలకం. దక్షిణంలో వైసిపి అభ్యర్థిగా వి గణేష్ కుమార్, జనసేన అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్ బరిలో ఉన్నారు. వంశీకృష్ణ గతంలో వైసిపి ఎమ్మెల్సీగా పనిచేసి ఎమ్మెల్యే టికెట్ దక్కదన్న ఆలోచనతో, జనసేనలోకి వచ్చి టికెట్ దక్కించుకున్నారు. ఆయన రాకతో అప్పటికే టికెట్ ఆశిస్తున్న నేతలంతా భగ్గుమన్నారు. అధిష్టానం అభ్యర్థిని మార్చకపోవడంతో మూగి శ్రీనివాసరావు, గంపల గిరిధర్ వంటి జనసేన నేతలు పార్టీని వీడారు. ఇక్కడి నుంచి టికెట్ ఆశించిన వైసిపి నేత సీతంరాజు సుధాకర్ కొద్ది రోజుల క్రితం టిడిపిలో చేరారు. ఇలా జంపింగ్ జంపాంగ్‌లతో ఇక్కడ ఆసక్తికర పోటీ నెలకొంది. పశ్చిమలో టిడిపి అభ్యర్థి పి.గణబాబు, వైసిపి అభ్యర్థి ఆడారి ఆనందకుమార్‌ల మధ్య గట్టిపోటీ నెలకొంది. ఇండియా బ్లాక్ తరపున సిపిఐ అభ్యర్థిగా అత్తిలి విమల పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఆమె జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. ఉత్తరంలో వైసిపి నుంచి కెకె.రాజు, బిజెపి అభ్యర్థి విష్ణుకుమార్ రాజు,. జై భారత్ నేషనల్ పార్టీ నుంచి సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో కొద్ది ఓట్ల తేడాతోనే ఓడిపోయిన కెకె.రాజు నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని పనిచేయడం వంటి అంశాలు ఆయనకు కలిసొస్తాయని పలువురు భావిస్తున్నారు. వి వి లక్ష్మీనారాయణ ప్రభావం కూడా గణనీయంగానే ఉండే అవకాశం ఉంది.

గాజువాకలో వైసిపి తరపున మంత్రి గుడివాడ అమర్‌నాథ్, టిడిపి అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు, ఇండియా బ్లాక్ బలపరిచిన సిపిఎం అభ్యర్థిగా ఎం జగ్గునాయుడు బరిలో ఉన్నారు. ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొంది. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ఓట్లు వైసిపి, కూటమి అభ్యర్థుల ఇరువురినీ కలవరపెడుతున్నాయి. ప్లాంట్ పరిరక్షణ కోసం సిపిఎం నిబద్ధతతో పోరాడుతోందన్న అభిప్రాయం ఇక్కడి ప్రజల్లో ఉంది. సిపిఐ, కాంగ్రెస్ బలం తోడవ్వడంతో ధీటైన పోటీనే సిపిఎం ఇస్తుందని పలువురు భావిస్తున్నారు. ఇక కాంగ్రెస్ భీమిలి అభ్యర్థి వర్మ, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు... ఇండియా బ్లాక్ శ్రేణులను కలుపుకుని ప్రచారంలో ముందున్నారు.

ఆల్ రౌండర్ పాత్రలో బొత్స

విజయనగరం జిల్లా చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణ పోటీలో ఉన్నా...భార్య విశాఖ ఎంపిగా పోటీచేస్తుండడంతో ఇక్కడే ఉండి ప్రచార వ్యవహారాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కొన్ని అసెంబ్లీ స్థానాల్లో ఎంఎల్ఎ అభ్యర్థులకు ఓట్లు తగ్గినా పార్లమెంట్‌కు తగ్గడానికి వీల్లేదన్న సంకేతాలు కూడా బొత్స ఇచ్చారన్నది స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలోనే భీమిలి, గాజువాక, ఎస్.కోట వంటి చోట్ల టిడిపికి చెందిన 'కాపు' సామాజిక తరగతి నేతలతో కొన్ని సర్దుబాట్లు కూడా చేసుకున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి.

పల్లెకు పయనం

- గెలుపోటములను నిర్ణయించడంలో వలస ఓటర్ల కీలకపాత్ర



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించడంలో వలస ఓటర్లు కీలకపాత్ర పోషించనున్నారు. దీంతో సుదూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు తమ సొంత నిధులతో గ్రామాల బాట పడుతున్నారు. స్థానిక సంస్థల తరహాలో ప్రతి ఓటునూ పోల్ చేయించుకునేందుకు రాజకీయ పార్టీలు కూడా తమ వ్యూహాలకు పదునుపెట్టాయి. ఈ దఫా ఎన్నికల్లో ప్రతి ఓటూ తమ విజయావకాశాలపై ప్రభావం చూపుతుందనే అభిప్రాయంలో పోటీలో ఉండే అభ్యర్థులు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్లతో గెలుపోటములు శాసించిన నియోజకవర్గాలు అత్యధికంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఇంటివద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకునే వృద్ధులు, వికలాంగులపై దృష్టి సారించిన పార్టీలు, తాజాగా ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌ను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు తమ శక్తి యుక్తులన్నింటినీ ఉపయోగించుకుంటున్నాయి. ఆయా ప్రాంతాల్లో పోటీలో ఉండే అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్యోగులపై తీవ్ర ఒత్తిళ్లు తీసుకొచ్చిన సంఘటనలు అనేకం కనిపిస్తున్నాయి.

ఫోన్ల ద్వారా సంప్రదింపులు

బతుకు తెరువు కోసం సుదూర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఓటర్లను ఓటింగుకు వచ్చేందుకు వీలుగా వారి సన్నిహితులు, బంధువుల ద్వారా నాయకులు ఫోన్లు చేయించి సంప్రదింపులు మొదలుపెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకాకుళం, విజయనగరం, అనంతపురం, కడప, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు ఉమ్మడి జిల్లాల నుంచి వలసలు అధికంగా ఉన్నాయి. వీరంతా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై ప్రాంతాల్లో చిన్నా చితకా పనులు చేసుకుంటూ బతుకులీడుస్తున్న వారు అధికంగా ఉన్నారు. యువత అత్యధికంగా పట్టణ ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 13న పోలింగు సందర్భంగా సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు ఇప్పటికే కొంతమంది పల్లెలకు చేరుకున్నారు. మరికొందరు ఆర్‌టిసి బస్సుల్లో రిజర్వేషన్లు కష్టమవడంతో సొంతంగా డబ్బులు పెట్టి ప్రైవేటు వాహనాల్లో పయనించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే తెలంగాణ నుంచి రాష్ట్రానికి వచ్చే ఓటర్ల కోసం తెలంగాణ ఆర్‌టిసి, ఎపిఎస్‌ఆర్‌టిసి ప్రధాన పట్టణాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఇప్పటికే ప్రకటించాయి. ఏదేమైనప్పటికీ వలస ఓటర్లు పోలింగుకు స్వగ్రామాలకు రావడం ఆర్థిక భారంగా మారిందనే అభిప్రాయం సామాన్యుల్లో వ్యక్తమవుతోంది.



ఒకే నియోజకవర్గం.. 2 జిల్లాలు

- పాణ్యంలో త్రిముఖ పోటీ
- జోరుగా సిపిఎం అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

ఒకే నియోజకవర్గం రెండు జిల్లాల్లోనూ భాగాలుగా విడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజనలో పాణ్యం నియోజకవర్గం సగం కర్నూలు జిల్లా, సగం నంద్యాల జిల్లా పరిధిలోకి వెళ్లింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా కర్నూలు జిల్లాలోకి కల్లూరు, ఓర్వకల్లు మండలాలు, నంద్యాల జిల్లాలోకి పాణ్యం, గడివేముల మండలాలు చేరాయి. పాణ్యం నియోజకవర్గంలో ఈ సారి త్రిముఖ పోటీ నెలకొంది. వైసిపి, టిడిపితోపాటు సిపిఎం అభ్యర్థి జోరుగా ప్రచారం సాగిస్తున్నారు..

ఈసారి ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గం నుంచి 14 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. టిడిపి, వైసిపి, సిపిఎం మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వైసిపి తరపున కాటసాని రాంభూపాల్ రెడ్డి, టిడిపి తరపున గౌరు చరితా రెడ్డి, సిపిఎం తరపున డి గౌస్ దేశాయ్ పోటీలో ఉన్నారు. సిపిఎం అభ్యర్థి డి గౌస్ దేశాయ్ జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటా ప్రజల సమస్యలు వింటూ ముందుకు సాగుతున్నారు. అడుగడుగునా ప్రజలు ఆయనకు నీరాజనం పడుతున్నారు. తనను గెలిపిస్తే పాణ్యం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, ప్రధానంగా ప్రజలు ఎదుర్కొనే నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, కర్నూలు నగరానికి రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం కోసం కృషి చేస్తామని చెబుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పోటీలో ఉన్న వారిలో వైసిపి అభ్యర్థి కాటసాని రాంభూపాల్ రెడ్డి పాణ్యం నుంచి ఆరుసార్లు, టిడిపి అభ్యర్థి గౌరు చరితా రెడ్డి ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

కోట్ల విజయభాస్కర్ రెడ్డి అక్కడి నుంచే..


1993లో ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కోసం కాటసాని రాంభూపాల్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఆ తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో కోట్ల గెలుపొందారు. కోట్ల రెండు సార్లు ఎమ్మిగనూరులో, ఒకసారి డోన్‌లో గెలిచారు. ముఖ్యమంత్రిగా, రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. పాణ్యం నియోజకవర్గంలో అయ్యపురెడ్డి రెండు సార్లు గెలిచారు. ఆయన మరోసారి నందికొట్కూరు, ఇంకోసారి మిడుతూరులో నెగ్గారు. పాణ్యంలో ఒకసారి కాంగ్రెస్ తరపున అయ్యపురెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒకసారి ఎంపిగా గెలిచారు. ప్రతిపక్ష నేతగా, మంత్రిగా కూడా పని చేశారు. 1983లో పాణ్యంలో టిడిపి తరపున గెలిచిన చల్లా రామకృష్ణారెడ్డి, 1999, 2004లో కాంగ్రెస్ తరపున కోయిలకుంట్లలో గెలుపొందారు.

వైసిపి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, టిడిపి అభ్యర్థి అభివృద్ధి కోసం పెద్దగా పట్టించుకోకపోవడం వంటి కారణాలతో ఇండియా వేదిక అభ్యర్థి తరపున గతంలో చేసిన పోరాటాలే పాణ్యం నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థి గౌస్ దేశాయిని గెలిపిస్తారని స్థానికులు చెబుతున్నారు.



సిపిఎం పోరాటాలు

పాణ్యం నియోజకవర్గంలో సిపిఎం అనేక పోరాటాలు నిర్వహించింది. పాణ్యం మండలం పిన్నాపురంలో పవన, సోలార్ పేరుతో గ్రీన్‌కో పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. పేదలు దగ్గర భూములు తీసుకుని పట్టాలు లేవనే పేరుతో వారికి పరిహారం ఇవ్వడం లేదు. కొండజూటూరు వద్ద నానో కెమికల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని చూస్తే గ్రామస్తులు అడ్డుకోవడం, పోరాటాల వల్ల వెనక్కి తగ్గారు. సోలార్ బాధితులకు పరిహారం ఇవ్వాలని సిపిఎం అగ్రనాయకులు ప్రకాష్‌కరత్, బివి రాఘవులు, పి మధు, ఎంఎ గఫూర్ పోరాటం చేసేందుకు వస్తే వారిపై 42 కేసులు నమోదు చేశారు. చెన్నై, సూరత్ భూ నిర్వాసితుల కోసం తీవ్ర పోరాటం చేశారు. పాణ్యం నుంచి కల్లూరు మండలం పెద్దపాడు వరకూ 150 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. కల్లూరు మండలంలో భూములు అక్రమ రిజిస్ట్రేషన్లు చేసిన సమయంలో తీవ్ర ఆందోళనలు చేపట్టారు. కల్లూరు ఐటిసి వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాలని ఆందోళనలు చేశారు. కల్లూరు అర్బన్ వీకర్ సెక్షన్ కాలనీలో 40 వేల జనాభా ఉండగా శ్మశానం లేదు. ఈ సమస్యను పరిష్కరించాలని, శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని పోరాటం నిర్వహించారు.





విజయవాడలోని ఓ హోటల్‌లో సీతారాం ఏచూరికి స్వాగతం పలుకుతున్న సిపిఎం సెంట్రల్ అభ్యర్థి సిహెచ్ బాబూరావు తదితరులు

నేటి నుండి 3 రోజుల పాటు సీతారాం ఏచూరి పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలోని మతోన్మాద బిజెపిని, దాన్ని బలపరిచే టిడిపి, జనసేన పార్టీలను, నిరంకుశ వైసిపిని ఓడించాలని, లౌకికవాదాన్ని బలపరిచే ఇండియా వేదికను గెలిపించాలని కోరుతూ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మూడు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు. 8వ తేదీ ఉదయం 9:30 గంటలకు కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో దావాజీగూడెం పామర్తినగర్ ఎస్‌విఆర్ ఫంక్షన్ హాల్లో జరిగే సభలో పాల్గొననున్నారు. సాయంత్రం 5 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని కృష్ణుడిగుడి సెంటర్లో జరిగే సభలో మాట్లాడతారు. 9వ తేదీ అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం పోలీసు గ్రౌండ్లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. 10వ తేదీన ఉదయం పది గంటలకు గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభలో మాట్లాడతారు. సాయంత్రం ఆరు గంటలకు ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో జరిగే సభలో పాల్గొంటారు.



రమణ

కురుపాంలో పుంజుకుంటున్న సిపిఎం

బృందా కరత్ పర్యటనతో నూతనోత్తేజం

- ఆశల పల్లకిలో టిడిపి
- వైసిపికి ఎదురీత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గంలో సిపిఎం పుంజుకుంటోంది. రెండు దశాబ్దాలుగా కురుపాంలో ఓటమి చవిచూసిన టిడిపి ప్రస్తుత ఎన్నికల్లో తీవ్ర పోటీనిస్తోంది. విజయావకాశాలపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశగా వున్నారు. రెండుసార్లు వరుసగా విజయం సాధించిన వైసిపికి ఈసారి ఓటమి తప్పదనే ఊహాగానాలు, విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. జనం ఎర్రజెండా వైపు చూస్తుండటంతో సిపిఎం గట్టి పోటీనిస్తోంది. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ కురుపాంలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి.

అభివృద్ధికి ఆమడ దూరం

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి డిప్యూటీ సిఎంగా పనిచేసినప్పటికీ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయారనే వాదన బలంగా వినిపిస్తోంది. దీనికితోడు గడిచిన ఐదేళ్లలో పార్టీలో ఆమె ఏకపక్ష వైఖరి వల్ల సీనియర్లలో చురుకుదనం తగ్గింది. సుదీర్ఘకాలం అన్నీ తానై శ్రీవాణి వ్యవహరించడంతో సీనియర్లు, క్రియాశీలక కార్యకర్తలకు కూడా గ్రామాల్లో పట్టుసడలింది. అలాగే నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా వున్న సమస్యలను పరిష్కరించడంలో ఆమె పూర్తిగా విఫలమయ్యారు. ఏనుగుల సమస్య, సుమారు 45 గిరిజన గ్రామాలకు దూరం తగ్గించే పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం, పోడుపట్టాల పంపిణీ తదితర విషయాల్లో ఆమె ఏమాత్రం చొరవ చూపలేదు. పైగా చేతులు తడిపితే తప్ప పనులు ముందుకు సాగనివ్వలేదనే విమర్శలు కూడా ఉన్నాయి. లాబేసు వంతెన పనులను సంబంధిత కాంట్రాక్టరు అందుకే నిలిపివేశారంటూ ఆ ప్రాంతంలోని సామాన్య ప్రజానీకం సైతం చర్చించుకుంటున్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యత చేపట్టిన కొన్ని నెలల్లోనే గిరిజన గ్రామాలన్నీ షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చుతామంటూ ప్రకటించిన శ్రీవాణి, ఆ తరువాత గిరిజనేతర పెత్తందారుల ఒత్తిళ్లకు తలొగ్గి వెనక్కి తగ్గిపోయారు. వీటికితోడు ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, వైద్యం తదితర రంగాలపై నిర్లక్ష్యం, సొంత పార్టీ నాయకులపై ఆధిపత్య ధోరణి వైసిపి బలాన్ని తగ్గించాయి. దీంతో, వైసిపికి ఎదురుగాలి వీస్తోందంటూ పలువురు విశ్లేషిస్తున్నారు.

బిజెపితో పొత్తు వల్ల టిడిపికి ప్రతికూల పవనాలు



వైసిపి బలహీనతలను తనకు అనుకూలంగా మలుచుకునే పరిస్థితిలో టిడిపి లేదు. నెలరోజుల క్రితం వరకు టిడిపి కూడా గ్రూపుల పోరుతో సతమతమయింది. గ్రూపులను ఎట్టకేలకు ఏకతాటిపైకి తీసుకొచ్చి ఐక్యం చేసినప్పటికీ, బిజెపితో పొత్తు వల్ల ప్రతికూల పవనాలు వీస్తున్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి స్థానిక గిరిజనురాలైనప్పటికీ, గెలిచాక అధికారం ఆమె చేతుల్లో ఉండే పరిస్థితి లేదనే చర్చ నడుస్తోంది. వైసిపితో పొత్తు లేకుండానే రాష్ట్రంపై పెత్తనం చెలాయించిన బిజెపి, నేడు టిడిపి పొత్తుతో ఎన్నికల్లో గట్టెక్కితే, మరిత ఆధిపత్యం చెలాయిస్తుందని జనం చర్చించుకుంటున్నారు. అదే జరిగితే కొండకోనల్లో నిక్షిప్తమైన బాక్సైట్, గ్రానైట్ తదితర గనుల కోసం గిరిజనులను అడవి నుంచి దూరం చేస్తారన్న భావన వ్యక్తమౌతోంది. ఇప్పటికే ఏజెన్సీలోని బొడికొండ, తామరకొండ, బడిదేవర కొండల్లోని గనులను కేంద్రంలోని బిజెపి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిన సంగతి తెలిసిందే. అరకు పార్లమెంటు స్థానానికి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి గీతపై ఉన్న అవినీతి, కుల వివాద కేసులు కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పలువురు అంటున్నారు.

ఉత్సాహంగా సిపిఎం కార్యకర్తలు

ఇప్పటికే పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు రెండేసి రోజుల చొప్పున నియోజకవర్గంలో పర్యటించారు. కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతి గత నాలుగు రోజులుగా వివిధ గ్రామాల్లో పర్యటిస్తున్నారు. దీంతో, పార్టీ కార్యకర్తలు నూతనుత్తేజం ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే మాజీ మంత్రి కిశోర్ చంద్రదేవ్ సిపిఎం ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు పి అప్పలనర్స, మండంగి రమణను గెలిపించాలని కోరుతూ ప్రజలకు చేసిన విజ్ఞప్తి సానుకూల ఫలితాలను ఇస్తోంది. మరో ఆరు రోజుల్లో ఎన్నికలు ఉన్నప్పటికీ వైసిపి, టిడిపి ముఖ్యనేతలెవరూ రాకపోవడంతో ఆయా పార్టీ శ్రేణుల బేలచూపులు చేస్తున్నాయి. సిపిఎం రాష్ట్ర, జాతీయ నాయకులకు ప్రజలు ఘన స్వాగతం పలికిన తీరుతెన్నులు, సభలకు కదిలివచ్చిన జనం 2004 నాటి పరిస్థితులను గుర్తుచేస్తున్నాయి. సిపిఎం కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ సర్పంచుగా, ఎంపిటిసి సభ్యుడిగా, వీటన్నింటికీ మించి గిరిజన సంఘం, సిపిఎం నాయకుడిగా నియోజకవర్గ వాసులకు సుపరిచితుడు. అన్యాయం జరిగిన ప్రతిచోటా నిలదీసే ధైర్యం, తెగువ ఉన్న నాయకుడిగా ముద్రవేసుకున్నారు. వీటన్నింటికి ఈ ప్రాంతంలో సిపిఎం పునాదులు తోడవుతున్నాయి. ఈ త్రిముఖ పోటీలో ప్రజలు ఎవరికి పట్టం కడతారో? అందుకు ఏయే అంశాలు ప్రభావితం చేస్తాయో వేచి చూడాల్సిందే.

సంపాదకీయం

సిగ్గుచేటు!

నారీ శక్తి, బేటీ బచావో – బేటీ పఢావో... లాంటి నినాదాలు ప్రధాని నుంచి కమలం పార్టీ చిన్నా చితకా నేత వరకూ అలవోకగా జాలువారుతూనే ఉంటాయి. భారత మాత పుత్రికల కన్నీళ్లను తుడవడంలో, వారి మాన ప్రాణాలనూ, గౌరవాన్ని కాపాడటంలో మోడీ సర్కారు ఎక్కడుంది? ప్రజ్వల్ రేవణ్ణ ఉదంతం నుంచి, బ్రిజ్‌భూషణ్ సింగ్, కులదీప్‌సింగ్ సెంగార్, బిల్కిస్ బానో అత్యాచార కేసులో నిందితుల వరకూ... అన్నింటా బిజెపి సర్కారు బరితెగించి మరీ నిందితులకు కొమ్ముకాసిన ఘటనలే మనముందున్నాయి. ప్రజ్వల్ రేవణ్ణ హసన్ సిట్టింగ్ ఎంపి. ఈ ఎన్నికల్లో బిజెపి, ఎన్‌డిఎ బలపరిచిన జెడిఎస్ అభ్యర్థి. ప్రజ్వల్ అత్యాచారాలు, అకృత్యాలపై దాదాపు ఐదు నెలల క్రితమే ప్రధానికి, హోం మంత్రికి లేఖ రాశానని స్వయంగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు దేవరాజ గౌడ చెబుతున్నాడు. జెడిఎస్ పార్టీతో పొత్తు పెట్టుకోవద్దని, ప్రజ్వల్ రేవణ్ణ స్త్రీ లోలుడని, వందలమందిపై అత్యాచారాలు, అఘాయిత్యాలు చేసి, వాటిని వీడియోలు తీసి, పెన్ డ్రైవ్‌లో దాచుకున్నాడని, ఆ పెన్ డ్రైవ్ ఒకటి తన దగ్గరకు, మరొకటి కాంగ్రెస్ దగ్గరకు వచ్చాయని, ప్రధానికి, హోం మంత్రికి 2023 డిసెంబర్‌లోనే లేఖ రాశాడు. అయినా... ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, ఆ పార్టీతో పొత్తు పెట్టుకుని.. స్వయంగా ప్రధాని మోడీ ప్రజ్వల్‌ను గెలిపించాలంటూ ఊరూవాడా ప్రచారం చేయడం, ఏప్రిల్ 26న హసన్ ఎంపి స్థానానికి ఎన్నిక పూర్తవడం జరిగిపోయాయి. ఆ తరువాత ప్రజ్వల్ పెన్‌డ్రైవ్‌లోని 2,976 వీడియోలు వెలుగుచూసిన అనంతరం కొద్ది గంటల్లోనే... ఆయన విదేశాలకు పారిపోయాడు. ఎట్టకేలకు ఫిర్యాదు చేసిన మహిళ కిడ్నాప్ కేసులో హెచ్‌డి రేవణ్ణను సిట్ అరెస్టు చేసింది. ఇలాంటి సమయాల్లో తక్షణం స్పందించాల్సిన కేంద్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ, హోం శాఖ, మహిళా కమిషన్ ఉలుకుపలుకూ లేదు. అన్ని సందర్భాల్లోనూ అలానే ఉన్నాయా? లేదే? పశ్చిమ బెంగాల్‌లో జరిగిన సందేశ్‌ఖలి ఘటనపై ప్రధాని స్వయంగా స్పందించారే! ఈ శాఖలన్నీ కట్టకట్టుకుని చర్యలు చేపట్టాయి కదా? ఐదు నెలల క్రితమే తెలిసినా కేంద్ర హోం శాఖ ఎందుకు చర్యలు తీసుకోలేదు? రేవణ్ణ విదేశాలకు వెళ్లిపోయేందుకు ఎందుకు సహకరించారు? ప్రతిపక్ష పార్టీల నేతలో, మైనారిటీలో... అయితే ఇలానే స్పందిస్తారా? అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్, న్యూ ఎలక్షన్ వాచ్ సంస్థల నివేదిక ప్రకారం మహిళలపై నేరాలకు సంబంధించి 133 మంది సిట్టింగ్ ఎంపి, ఎమ్మెల్యేలపై కేసులుంటే... వారిలో 44 మంది భారతీయ... జనతా పార్టీ వారే! 2014–22 మధ్య మహిళలపై నేరాలు 31 శాతం పెరిగాయని జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) లెక్కలే చెబుతున్నాయి.

లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని తమ కెరీర్లను పణంగా పెట్టి 40 రోజులకుపైగా మహిళా రెజ్లర్లు ఢిల్లీలో ఆందోళన చేసినా కేంద్రం పట్టించుకోలేదు. సుప్రీంకోర్టు ఆదేశించిన తరువాతే ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. నేటికీ అరెస్టు చేయలేదు. బ్రిజ్‌భూషణ్ కొడుకుకు ఎంపి సీటిచ్చి బిజెపి గౌరవించింది. ఇప్పటికే మరో కొడుకు ఎమ్మెల్యే. దేశంలోని కోట్లాది మంది కుమార్తెల మనోధైర్యాన్ని దెబ్బతీశారన్న ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ వ్యాఖ్య అక్షర సత్యం. ఉత్తర ప్రదేశ్‌లోని ఉన్నావోలో 17 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం, ఆమె తండ్రి మరణానికి కారకులయ్యారన్న కేసులో దోషి కులదీప్‌సింగ్ సెంగార్‌కు మద్దతు పలకడం, అదే రాష్ట్రంలోని హత్రాస్‌లో దళిత యువతిపై అత్యాచారం చేసి, నిప్పంటించడం, ఆమె మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చి మరణించినా, నిందితులు నిర్దోషులుగా బయటపడటం... ఇలా ఎన్నో ఘటనలు. బిల్కిస్ బానో కేసులో నిందితులను గుజరాత్ ప్రభుత్వం పెరోల్‌పై విడుదల చేయడం, వారిని కమలం పార్టీ శ్రేణులు పూలమాలలతో సత్కరించడం.. కాశ్మీర్‌లో సంచార జాతి బాలికపై అత్యాచారం, హత్య కేసులో నిందితులను విడుదల చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడే ఆందోళన చేయడం, మణిపూర్ మారణహోమంలో నగ్న కవాతులు, తాజాగా పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆనంద్‌బోస్‌పై లైంగిక వేధింపుల కేసు... ఇలా ఎన్నో దురాగతాలు మోడీ పాలనలో సాగిపోతున్నాయి. ఈ సిగ్గుమాలిన రాజకీయాలకు ముగింపు పలకాల్సింది ఓటు తోనే!

మహనీయుల మాట



ఉద్యోగం మనిషి లక్షణం.
ప్రతి మనిషికీ పని, పనికి తగ్గ వేతనం వుండాలి.
స్త్రీలకు పని గ్యారంటీ చెయ్యాలి.
పురుషులతో సమానంగా మహిళలకూ వేతనం ఇవ్వాలి.
- వి.ఐ. లెనిన్

అంతర్జాతీయం

పాలస్తీనియన్లపై మారణకాండ

ఆపితే నెతన్యాహు, కొనసాగిస్తే జో బైడెన్ పతనం!



ఏదో ఒక ఒప్పందం చేసుకొని హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారిని విడిపించాలని నెతన్యాహు మీద రోజు రోజుకూ ఒత్తిడి పెరుగుతోంది. మరోవైపు హమాస్‌ను తుడిచిపెట్టకుండా వెనుదిరిగితే మీ సంగతి చూస్తామనే దురహంకారులు. మారణకాండకు మద్దతు ఇవ్వటాన్ని ఏమాత్రం సహించం అంటున్న విద్యార్థులపై జో బైడెన్ సర్కార్ కాల్పులకూ పాల్పడింది. గాజా దక్షిణ ప్రాంతంలోని రాఫా నగరం మీద దాడులకు దిగితే అక్కడ ఉన్న పిల్లలు పెద్ద సంఖ్యలో మరణించే అవకాశం ఉన్నందున హమాస్ ఒక అడుగు వెనక్కు తగ్గేందుకు నిర్ణయించినట్లు కనిపిస్తోంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే మారణకాండను కొనసాగించకపోతే నెతన్యాహు, ముందుకు పోతే ఎన్నికల్లో జో బైడెన్ పతనం ఖాయంగా కనిపిస్తోందన్న వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. మారణకాండను అంతర్జాతీయ న్యాయ స్థానం కూడా అడ్డుకోలేకపోయింది. తన ఆదేశాన్ని ధిక్కరించిన ఇజ్రాయిల్‌ను ఏమీ చేయలేని అశక్తురాలిగా మారింది.

పాలస్తీనాలోని గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ మారణకాండ మంగళవారం నాటికి 214వ రోజుకు చేరుకుంది. కాల్పుల విరమణ ఒప్పందం గురించి చర్చలు సాగుతున్నాయి. తమకు అంగీకారమే అని హమాస్ చెప్పింది. ఎటూ తేల్చకపోగా రఫా నగరం మీద సైనిక చర్యకు ముందుకు పోవాలని ఇజ్రాయిల్ యుద్ధ మంత్రివర్గం ఏకగ్రీవంగా నిర్ణయించింది. మరొకవైపు చర్చలకు తమ ప్రతినిధులను పంపుతామని చెబుతూనే సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారే వరకు వైమానిక దాడులు జరుపుతూ రాఫా–ఈజిప్టు సరిహద్దు ద్వారం దగ్గర పాలస్తీనా వైపు ప్రాంతాన్ని ఇజ్రాయిల్ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. గాజాలోని పౌరులకు ఐరాస అందిస్తున్న సహాయాన్ని కూడా అడ్డుకుంటున్నాయి. దాడుల్లో అనేక మంది మరణించారు. మధ్యవర్తులు ముందుకు తెచ్చిన ప్రతిపాదనలను హమాస్ ఆమోదించినప్పటికీ తమకు అంగీకారం కాదని, తమ డిమాండ్లకు చాలా దూరంగా ఉందని నెతన్యాహు కార్యాలయం చెప్పింది. సోమవారం నాటికి గాజాలో 34,735 మందిని ఇజ్రాయిల్ చంపివేసినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గాయపడిన వారు 78,108 మంది, గత 24 గంటల్లో మరణాలు 52, క్షతగాత్రులు 90 మంది అని వెల్లడించింది. రాఫాను ఖాళీ చేయాలని పౌరులను ఇజ్రాయిల్ ఆదేశించింది. ఇతర దేశాలకు ప్రత్యేకించి పక్కనే ఉన్న ఈజిప్టుకు వెళ్లకుండా దిగ్బంధనం గావించింది. ఇది రాసిన సమయానికి ఏం జరగనుందో తెలియని స్థితి. జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే ఒకటి స్పష్టం. ఏదో ఒక ఒప్పందం చేసుకొని హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారిని విడిపించాలని నెతన్యాహు మీద రోజు రోజుకూ ఒత్తిడి పెరుగుతోంది. మరోవైపు హమాస్‌ను తుడిచిపెట్టకుండా వెనుదిరిగితే మీ సంగతి చూస్తామనే దురహంకారులు. మారణకాండకు మద్దతు ఇవ్వటాన్ని ఏమాత్రం సహించం అంటున్న విద్యార్థులపై జో బైడెన్ సర్కార్ కాల్పులకూ పాల్పడింది. గాజా దక్షిణ ప్రాంతంలోని రాఫా నగరం మీద దాడులకు దిగితే అక్కడ ఉన్న పిల్లలు పెద్ద సంఖ్యలో మరణించే అవకాశం ఉన్నందున హమాస్ ఒక అడుగు వెనక్కు తగ్గేందుకు నిర్ణయించినట్లు కనిపిస్తోంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే మారణకాండను కొనసాగించకపోతే నెతన్యాహు, ముందుకు పోతే ఎన్నికల్లో జో బైడెన్ పతనం ఖాయంగా కనిపిస్తోందన్న వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. మారణకాండను అంతర్జాతీయ న్యాయ స్థానం కూడా అడ్డుకోలేకపోయింది. తన ఆదేశాన్ని ధిక్కరించిన ఇజ్రాయిల్‌ను ఏమీ చేయలేని అశక్తురాలిగా మారింది. పాలస్తీనా పౌరులకు సంఘీభావం తెలుపుతున్న విద్యార్థులు యూదు వ్యతిరేకలంటూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నిందించి మరింతగా రెచ్చగొట్టారు.

మంగళవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో అనేక మంది మరణించినట్లు వార్తలు. వైమానిక దళం జరిపిన దాడుల్లో అనేక భవనాలు నేలమట్టం కాగా అనేక మంది శిథిలాల్లో చిక్కుకు పోయారు. ఎందరు గాయపడింది, మరణించిందీ ఇంకా స్పష్టం కాలేదు. తమ ఆసుపత్రికి పదకొండు మృతదేహాలు వచ్చినట్లు రాఫాలోని కువైట్ ఆసుపత్రి వెల్లడించింది. హమాస్ దగ్గర ఉన్న తమ బందీలను విడిపించే వరకు దాడులు కొనసాగిస్తూనే ఉంటామని మరోవైపు చర్చలకు తమ ప్రతినిధి బృందాన్ని పంపుతామని ఇజ్రాయిల్ ప్రకటించింది. ఇరవై లక్షల మందికి పైగా పాలస్తీనియన్లు గాజాలో వున్నారు. వారిని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఇజ్రాయిల్ మిలిటరీ తరలిస్తున్నది. ఈ క్రమంలో 64 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న రాఫా నగరం, పరిసరాల్లో లక్షల మంది తలదాచుకుంటున్నారు. హమాస్ సాయుధులు జనంలో కలసిపోయినందున వారిని పట్టుకోవాలంటే పెద్ద ఎత్తున దాడులు చేయకతప్పదని ఇజ్రాయిల్ చెబుతున్నది. అసలు ఆ సాకుతోనే ఏడు నెలలుగా దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. రాఫా నుంచి వెళ్లిపోవాలని ఆదేశించటం ఏ మాత్రం సహించరాదని ఐరాస ప్రధాన కార్యదర్శి చెప్పారు. ఈ దాడులను వ్యతిరేకిస్తున్నట్లు అమెరికా కబుర్లు చెబుతున్నది. బందీల విడుదలకు తాత్కాలిక కాల్పుల విరమణ అని ఇజ్రాయిల్ చెబుతుండగా పూర్తిగా గాజా నుంచి వైదొలగాలని హమాస్ పట్టుబట్టటంతో ఈజిప్టు రాజధాని కైరోలో జరుగుతున్న చర్చలు నిలిచిపోయాయి. సంప్రదింపుల ప్రక్రియ వెంటిలేటర్ మీద ఉంది, అందుకే ఒక మధ్యవర్తిగా ఉన్న కతార్‌తో చర్చలు జరిపేందుకు సిఐఏ డైరెక్టర్ బిల్ బరన్స్ వెళ్లినట్లు ఇజ్రాయిల్ మీడియా పేర్కొన్నది. మూడు దశల్లో ఒప్పందం అమలు జరుగుతుందని, తన వద్ద బందీలుగా ఉన్న 132 మందిలో 33 మందిని 42 రోజుల వ్యవధిలో విడుదల చేస్తుందని దీనికి ఇరు పక్షాలూ అంగీకరించినప్పటికీ తదుపరి రెండు దశల గురించి వివాదం ఏర్పడిందని తొలుత వార్తలు వచ్చాయి. కొత్త ప్రతిపాదనలను అంగీకరిస్తున్నట్లు సోమవారం హమాస్ ప్రతినిధి ఈజిప్టు, కతార్ మంత్రులకు ఫోన్ ద్వారా తెలిపినట్లు వార్తలు. ఇజ్రాయిల్ వైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోగా రాఫా ప్రాంతం నుంచి పాలస్తీనియన్లు వెళ్లిపోవాలని విమానాల నుంచి వెదజల్లిన కరపత్రాల్లో ఆదేశించటమేగాక, రాత్రి నుంచి దాడులను కూడా ప్రారంభించింది. ఒప్పందం కుదిరినా కుదరకున్నా దాడులు చేసి తీరుతామని నెతన్యాహు చెబుతున్నాడు.

కైరో చర్చలు సఫలమౌతాయని, తక్షణ, శాశ్వత కాల్పుల విరణమకు దారితీస్తాయని కతార్ విదేశాంగశాఖ ప్రతినిధి మహమ్మద్ అల్ అన్సారీ చెప్పారు.వ్యవధి కోసం హమాస్ నాటకమాడుతున్నదని, దాడులను నిలిపివేసేందుకు, చర్చల వైఫల్య నెపం తమపై నెట్టేందుకు చూస్తున్నదని ఇజ్రాయిల్ ఆరోపిస్తున్నది. రాఫా ఇప్పుడు బాలల నగరంగా మారిందని, దాడులు జరిగితే పెద్ద ఎత్తున ప్రాణనష్టం ఉంటుందని యునిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసిందని, రక్షణ కోసం పిల్లలు ఎక్కడకు వెళ్లాలో తెలియని స్థితిలో ఉన్నారని సంస్థ డైరెక్టర్ కాథరీన్ రసెల్ చెప్పారు. ఇప్పటికే అక్కడి పిల్లలు భౌతికంగా, మానసికంగా ఎంతో బలహీనపడ్డారని, పిల్లలతో పాటు మొత్తం జనాన్ని రక్షించాల్సి ఉందన్నారు. ఇజ్రాయిల్ దాడులకు ముందు నగరం, పరిసరాల జనాభా రెండున్నర లక్షలు కాగా ప్రస్తుతం అక్కడ పన్నెండు లక్షల మంది తల దాచుకుంటున్నారని, వారిలో దాదాపు ఆరు లక్షల మంది పిల్లలే ఉంటారని చెబుతున్నారు. హమాస్ ఒక మెట్టు దిగిరావటానికి ఇది కూడా ఒక కారణం అని చెప్పవచ్చు. దాడుల ప్రభావం పెద్దల మీద కంటే పిల్లల మీద ఎక్కువగా ఉంటుందని యునిసెఫ్ హెచ్చరించింది. రాఫా మీద దాడి అంటే ఏదో విహారయాత్ర అని భావిస్తే పొరపాటు తమ వారిని రక్షించేందుకు పూర్తి సన్నద్ధంగా ఉన్నామని హమాస్ ప్రకటించింది. దాడులకు పాల్పడవద్దని సౌదీ అరేబియా విదేశాంగశాఖ ఇజ్రాయిల్‌ను హెచ్చరించింది.

తమ నేత జో బైడెన్‌కు గాజా మరో వియత్నాంగా మారుతున్నదని, అయితే డోనాల్డ్ ట్రంప్‌ను వెనక్కు కొట్టేందుకు తాను బైడెన్‌కు మద్దతు ఇస్తున్నట్లు డెమొక్రటిక్ సోషలిస్టు నేత బెర్నీ శాండర్స్ ప్రకటించాడు. గాజాలో మారణకాండను ఖండిస్తూ అమెరికా విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగటంతో ఎన్నికలలో పోటీ చేస్తున్న అధ్యక్షుడు జో బైడెన్ ఇరకాటంలో పడ్డాడు. ఉద్యమాన్ని అణచివేసేందుకు పూనుకోవటంతో పాటు ప్రపంచాన్ని నమ్మించేందుకు ఇజ్రాయిల్ మీద ఒత్తిడి తెస్తున్నట్లు నాటకం ప్రారంభించాడు. రాఫాపై దాడులను వ్యతిరేకిస్తున్నట్లు బైడెన్ స్పష్టం చేసినట్లు జాతీయ భద్రతా మీడియా సలహాదారు జాన్ కిర్బీ చెప్పాడు. అర్ధగంటపాటు నెతన్యాహు–జో బైడెన్ ప్రైవేటుగా నిర్మాణాత్మకంగా మాట్లాడుకున్నారని అన్నాడు. నెతన్యాహుతో మాట్లాడిన తరువాత జో బైడెన్ వైట్‌హౌస్‌లో జోర్డాన్ రాజు రెండవ అబ్దుల్లాకు అనధికారిక మధ్యాహ్న విందు ఏర్పాటు చేశాడు. ఇజ్రాయిల్ గనుక రాఫాపై దాడులకు దిగితే పెద్ద ఎత్తున మారణకాండ జరిగే అవకాశముందని అబ్దుల్లా హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. ఏడు నెలల దాడుల తరువాత గాజాలో తీవ్రమైన కరవు పరిస్థితి ఏర్పడిందని ఐరాస ప్రపంచ ఆహార కార్యక్రమ అధిపతి సిండీ మెకెయిన్ చెప్పాడు. తన మీద ప్రపంచ నేతలెవరూ ఏమాత్రం ఒత్తిడి తేలేరని, ఏ అంతర్జాతీయ సంస్థా ఇజ్రాయిల్ తనను తాను కాపాడుకోవటాన్ని అడ్డుకోజాలదని నెతన్యాహు ఆదివారం నాడు చెప్పాడు.

కొలంబియా విశ్వవిద్యాలయాన్ని అదుపులోకి తీసుకున్న న్యూయార్క్ పోలీసుల్లో ఒకడు విద్యార్థుల మీద కాల్పులు జరిపినట్లు వార్తలు వచ్చాయి. వారి వెనుక బయటి శక్తుల హస్తం వుందనే సాకుతో ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నది. దీనికి కార్పొరేట్ మీడియా మరింతగా ఆజ్యం పోస్తున్నది. ప్రభుత్వ యంత్రాంగం ఎంతగా రెచ్చగొడుతుంటే అంత ఎక్కువగా విద్యార్థులు ఆందోళనలకు దిగుతున్నారు. గుడారాలను పీకివేస్తే వెంటనే కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నారు. దొంగే దొంగని అరచినట్లుగా విద్యార్థుల నిరసనలను తప్పుదారి పట్టించేందుకు ఇజ్రాయిల్ అనుకూలురను రెచ్చగొట్టి పోటీ ప్రదర్శనలను చేయించటం, ఆ ముసుగులో పౌరదుస్తుల్లో ఉన్న పోలీసులు, బయటివారిని రప్పిస్తున్నట్లు అనేక చోట్ల స్పష్టమైంది. వారు విద్యా ప్రాంగణాల్లో ప్రవేశించి దాడులు చేస్తున్నారు. యూదు వ్యతిరేక నినాదాలు చేస్తూ విద్యార్థుల ఆందోళనను తప్పుదారి పట్టించేందుకు చూస్తున్నారు. ఇలాంటి వారి చర్యలను చూపి మీడియా దాడులకు దిగుతున్నది. మీడియాకు జరుగుతున్నదేమిటో తెలిసినప్పటికీ ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నది కనుక దాని ప్రాపకం కోసం కట్టుకథలు రాస్తున్నది పిట్టకతలు చెబుతున్నది. పార్లమెంటు సభ్యుల కమిటీల పేరుతో విద్యా సంస్థల చాన్సలర్లు, అధ్యక్షులు, ఇతర అధికారులతో సమావేశాలను ఏర్పాటు చేసి ఆందోళనను అదుపు చేసేందుకు తీసుకుంటున్న చర్యలేమిటని అడ్డదిడ్డంగా ప్రశ్నిస్తున్నారు. గట్టిగా వ్యవహరించకపోతే రాజీనామా చేసి ఇంటికి పోండని ఒత్తిడి తెస్తున్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచి వేయకపోతే తాము ఇచ్చిన విరాళాలను స్తంభింప చేస్తామని బెదిరించేందుకు దాతలను రంగంలోకి దించారు. నిజానికి వీరంతా బయటివారు తప్ప ఆందోళన చేస్తున్న వారు లేదా వారికి మద్దతు ఇస్తున్నవారు కాదు. ఇలాంటి వారిని చూసి ఆందోళనలకు దూరంగా ఉన్నవారు తొలి రోజుల్లో పొరపాటు పడిన అనేక మంది ఇప్పుడు తోటి విద్యార్థులతో చేతులు కలుపుతున్నారు. తమ ఆందోళన ద్వారా విద్యార్థులు అనేక మంది కళ్లు తెరిపిస్తున్నారు. దిగంబర అమెరికా పాలకుల నైజాన్ని బయటపెడుతున్నారు. ★



ఎం. కోటేశ్వరరావు

బేతాళం–3

మా ఇంటికి రావొద్దు!

పట్టువదలని విక్రమార్కుడు యథావిధిగా చెట్టు వద్దకు వెళ్ళి చెట్టు పైనుంచి శవాన్ని తీసి భుజాన వేసుకున్నాడు. శవంలోని బేతాళుడికి ఏమాత్రం ఆటంకం కలిగించకుండా నిశబ్దంగా నడుస్తున్నాడు. ఎందుకైనా మంచిదని భుజంమీద శవాన్ని గట్టిగా పట్టుకుని ఒకింత వేగంగా స్మశానం వైపు నడవసాగాడు. విక్రమార్కుడు గట్టిగా పట్టుకోవడంతో ఊపిరాడని బేతాళుడు...ఒక్కసారిగా ఒళ్లు విరుచుకుని చుట్టూ తేరిపారజూశాడు. విక్రమార్కుడు ఇంతకు ముందుకంటే వేగంగా నడుస్తున్నట్టనిపించింది. 'రాజా, నీ అంకితభావం చూస్తుంటే నాకెంతో ముచ్చటగా వుంది. ఒక్కసారి అధికార మత్తు తలకెక్కి, కళ్ళు పచ్చబారిన వారిని అసలు తమ గుమ్మం కూడా తొక్కొద్దని బోర్డులు పెట్టిన వైనం నీకు తెలుసా? గతంలో సినిమాల్లో, కథలో చూశాను. కానీ ఇప్పుడు వాస్తవంగానే 'మీరు రావొద్దు' అంటూ బోర్డులు పెడుతున్నారు. ఆ కథేంటో చెప్తా...జాగ్రత్తగా విను' అంటూ మొదలు పెట్టాడు.



'రాజా... సింధియా దేశంలో కొన్నేళ్ల క్రితం ఎవరి నోట విన్నా ఎక్కడ చూసినా 'ఓ స్త్రీ రేపు రా...' అనే మాట వినిపిస్తుండేది. ప్రతి ఇంటి డోర్ మీద ఇలా రాసిన రాతలు అప్పట్లో పెద్ద సంచలనం కలిగించాయనే చెప్పాలి. ఎవరో ఒకావిడ అడుక్కోవడానికి వస్తుందని, ఆమెకు పొరపాటున బిక్షమేస్తే... వెంటనే చనిపోతారనే పుకార్లు రేపారు. ఈ పుకారు ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసింది. ఆ వచ్చినావిడ... 'ఓ స్త్రీ రేపు రా' అని రాసివున్న బోర్డు చూసి వెళ్లిపోతుందని ప్రజలు నమ్మారు' అని అనర్గళంగా చెప్పిన బేతాళుడు...ఊపిరి తీసుకోడానికి ఓ నిమిషం ఆగాడు. బేతాళుడు చెప్పింది కాకమ్మ కథ అన్నట్టు వెటకారంగా పెదవి విరిచాడు విక్రమార్కుడు.

'రాజా...నీ నవ్వులోని మర్మం నాకు అర్థమైంది. కచ్చితంగా ఇది మూఢనమ్మకమే. అయితే, ఇప్పుడో సినిమా కథ చెప్తాను. అప్పుడేమంటావో చూస్తా..! చాలా కాలం కిందట 'ఆలీబాబా 40 దొంగలు' అనే సినిమా వచ్చింది. ఆ సినిమాలో దొంగలను తమ ఇళ్లకు రాకుండా చెయ్యడానికి ప్రతి గుమ్మం తలుపు మీద స్వస్తిక్ మార్కును గీస్తారు. తద్వారా దొంగల రాకను ఆ గ్రామస్తులు అడ్డుకుంటారు' అని ఇంకో కథ చెప్పాడు బేతాళుడు. ఇది కూడా కథేగా...అన్నట్టుగా చూశాడు విక్రమారుడు. దీంతో విక్రమార్కుడిని ఎలాగైనా ఓడించి....మళ్లీ చెట్టెక్కి కూర్చోవాలన్న పంతం పెరిగింది బేతాళుడిలో.

'రాజా...ఇదైతే కచ్చితంగా నమ్మి తీరాల్సిందే. ఎందుకంటే ఇది నిజ్జంగా జరిగిన వాస్తవం గనుక. సింధియా దేశంలోని ఓ మలయాళ రాష్ట్రంలో ఇటీవల ఓ సంఘటన జరిగింది. 'మా ఇంట్లో ఆడపిల్లలు ఉన్నారు. కాషాయం పార్టీ సభ్యులను లోపలికి అనుమతించం' ఓ అపార్ట్‌మెంట్ గోడపై రాసి వున్న సైన్‌బోర్డు ఇప్పుడు ఆ దేశంలోని సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. రాజా...దీనిపై నువ్వేమనుకుంటున్నావు? ఆ మలయాళీలు అలా ఎందుకు బోర్డుపై రాశారో తెలిసి కూడా చెప్పకపోయావో నీ తల వెయ్యి ముక్కలవుతుంది' అన్నాడు బేతాళుడు.

'బేతాళా...ఇందులో తెలియక పోవడమేముంది. ఆ కాషాయం పార్టీ గూండాయిజం అందరికీ తెలిసిందే కదా. గోమాంసం వుందనే పేరుతో ఇంట్లో వున్నవారిని బయటికి లాగి కొట్టారు. మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి అత్యాచారానికి పాల్పడ్డారు. జమ్ము కాశ్మీర్‌లోని కతువాలో ఓ గుడిలోనే చిన్నారి బాలికపై అత్యాచారం చేసి చంపేశారు. యూపిలో హత్రాస్‌లో ఓ యువతిపై అత్యాచారం చేసి, నిర్దోషులుగా తిరుగుతున్నారు. ఇలాంటి ఘటనలు సింధియా దేశంలో కాషాయం పార్టీ సేనలు అనేకం చేస్తున్నాయి. మలయాళీలు కాస్త తెలివైన వారు కనుక ముందు జాగ్రత్తగా... కాషాయం పార్టీ వాళ్లను ఇళ్లలోకి అనుమతించం అని బోర్డు పెట్టారు. నిజానికి దేశంలోని ప్రతి ఇంటి ముందు ఇలాంటి బోర్డులు పెట్టి, వారిని తరిమేయాలి' అని బదులిచ్చాడు విక్రమార్కుడు.

'రాజా...నువ్వు చెప్పిన సమాధానం కరెక్టే. కానీ... సింధియా ప్రజలు ఆ పార్టీని తరిమేస్తారో లేదో కొద్దిరోజుల్లో తెలుస్తుంది. అందాక బై...బై..' అంటూ విక్రమార్కుడి భుజమ్మీద నుంచి మాయమై మళ్ళీ చెట్టెక్కాడు బేతాళుడు.

- రాజాబాబు కంచర్ల
9490099231

వ్యాఖ్య

భారత్ వెలిగిపోతోందా ? లేదే !

ప్రధాని మోడీ, బిజెపి నాయకులు చెబుతున్నట్లుగా భారతదేశం ఈరోజు మునుపెన్నడూ లేనంతగా వెలిగిపోతున్న మాట నిజమేనా? ప్రపంచ దేశాలకు భారత్ ఒక రోల్ మోడల్‌గా ఉన్నదా? భారత దేశాన్ని అలాంటి ఉన్నత స్థితిలో నిలపడం ద్వారానే మోడీ విశ్వగురు అయ్యారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే, వివిధ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థలు, వివిధ అంశాలలో తయారు చేసే వివిధ రకాల సూచీలను, ర్యాంకులను పరిశీలించాలి.

దేశమంటే మట్టి కాదు మనుషులు అన్న గురజాడ సూక్తి ప్రకారం, ఒక దేశపు సమగ్ర అభివృద్ధి అంటే ఆ దేశ ప్రజల జీవన ప్రమాణాలలో, వారి స్థితిగతుల్లో, వారు అనుభవించే స్వేచ్ఛలో, సామాజిక గణాంకాల్లో, ఆర్థిక పరిస్థితుల్లో, వారు పొందే సుపరిపాలనలో అభివృద్ధిగా ఉంటుంది.

మరి అటువంటి అంశాల్లో మన దేశం పరిస్థితి, మన దేశ ప్రజల పరిస్థితి ఎలా ఉందో ఒక పరిశీలన చేద్దాం.

ఇటీవల మన ప్రధాని, మంత్రిగణం నోట్లోంచి తరచుగా వినిపిస్తున్న మాట "భారతదేశం ప్రపంచపు మూడవ అతి పెద్ద ఆర్థిక శక్తి కాబోతోంది".

అవును జిడిపి పరంగా 189 దేశాల్లో మనది 3వ స్థానం. కానీ జిడిపి పరంగా తలసరి ఆదాయంలో మన దేశం ఈ 189 దేశాల్లో 140వ స్థానంలో ఉంది. ఇది అత్యంత తీవ్రంగా పెరుగుతున్న ఆర్థిక అసమానతలను సూచిస్తోంది. ఈదేశపు బడా కార్పొరేట్లను ప్రపంచ కుబేరులుగానూ, ఈ దేశ పేద, మధ్య తరగతి ప్రజనీకాన్ని కటిక దారిద్ర్యంలోకి నెట్టే విధంగానూ పాలకుల విధానాలున్నాయి అన్నమాట. ఆర్థిక స్వాతంత్ర్యంలో 178 దేశాల్లో 123వ స్థానం, మానవ వనరుల వినియోగ సూచీలో 152 దేశాలకు గాను 115వ స్థానంలో ఉండడం, ఉద్యోగ కల్పనలో 47 దేశాల్లో 42వ స్థానంలోను, ప్రజలపై ఉన్న అప్పుల భారంలో 189 దేశాలకుగాను 82వ స్థానంలోను, కనీస వేతనాల అమలులో 156 దేశాలలో 64వ స్థానంలోను, మరీ ముఖ్యంగా ఆధునిక బానిసత్వ సూచీలో 167 దేశాల్లో నాల్గవ స్థానంలో వుండడంపై విషయాన్నే ధ్రువీకరిస్తున్నాయి.

పాలకుల స్వభావం ఆ ప్రభుత్వ ప్రాధమ్యాలలో స్పష్టంగా కనిపిస్తుంది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 107 దేశాలకుగాను 94వ స్థానంలోనూ, తలసరి ఆరోగ్య వ్యయంలో 190 దేశాలకు గాను 141వ స్థానంలోనూ, ఎడ్యుకేషన్ ఇండెక్స్‌లో 191 దేశాలకు గాను 145వ స్థానంలో ఉండగా మిలిటరీ వ్యయంలో 186 దేశాలకు గాను మూడవ స్థానంలో ఉండడం ఈ పాలకుల విధానాల్లో డొల్లతనాన్ని, సామ్రాజ్యవాద దేశాల ఆయుధ తయారీ కంపెనీలకు లొంగుబాటును, పొరుగు సరిహద్దు దేశాలతో చెడిపోతున్న సత్సంబంధాలను సూచిస్తోంది.

పాలకుల విధానాలే ప్రజల జీవన ప్రమాణాలను నిర్ధారిస్తాయి. ప్రపంచ ఆయుష్షు సూచీలో195 దేశాలకు గాను 125 వ స్థానంలో ఉండగా, ప్రపంచ మానవాభివృద్ధి సూచిలో 189 దేశాలకు గాను 131వ స్థానంలో ఉండడం, సాంఘికాభివృద్ధి సూచీలో 128 దేశాలకు గాను 117వ స్థానంలో ఉండడం, గ్లోబల్ యూత్ డెవలప్మెంట్ ఇండెక్స్‌లో 183 దేశాలకు గాను 134వ స్థానంలో ఉండడం, నవజాత శిశుమరణాల్లో 223 దేశాలకుగాను 113వ స్థానంలో ఉండడం, లింగ తారతమ్యంలో 144 దేశాలకు గాను 108వ స్థానంలో ఉండగా, లింగ వివక్షలో 188 దేశాలకు గాను 76వ స్థానంలో ఉండడం, ఇళ్ళు లేని వారి విషయంలో 52 దేశాలకు గాను 8వ స్థానంలో ఉండగా, పట్టణీకరణలో 199 దేశాలకు గాను 161వ స్థానంలో ఉండడం, క్వాలిటీ ఆఫ్ లైఫ్ ఇండెక్స్‌లో 56 దేశాలకుగాను 43వ స్థానంలో ఉండడం, క్వాలిటీ ఆఫ్ ఎయిర్ ఇండెక్స్‌లో 92 దేశాలకు గాను 84వ స్థానంలో ఉండడం పాలకుల వినాశకర విధానాలను సూచిస్తోంది. 5జి యుగంలోకి తీసుకెళ్తున్నాము, అందరికీ ఇంటర్నెట్ విస్తరించాము అని బాజాలు కొట్టుకుంటున్న మన దేశంలో, జనాభాలో ఇంటర్నెట్ వాడే వారి శాతం ప్రకారం ప్రపంచంలోగల 228 దేశాల్లో 141వ స్థానం లోనూ, అలాగే ఇంటర్నెట్ స్పీడ్‌లో 149 దేశాలకుగాను 89వ స్థానంలో ఉండడం దయనీయమైన వాస్తవాన్ని తెలియజేస్తోంది.

ప్రపంచ సంతోష సూచీలో 156 దేశాలకు గాను 137వ స్థానంలో ఉన్న మన దేశం, ప్రపంచ శాంతి సూచీలో 163 దేశాలకు గాను 139వ స్థానంలో ఉండగా, ఉద్దేశపూర్వక జనహనన కేసుల్లో 219 దేశాలకుగాను రెండవ స్థానంలో ఉండడం, ట్రాఫిక్ ప్రమాదాల వలన జరిగే మరణాల్లో 180 దేశాలకు గాను రెండవ స్థానంలో ఉండడం, ఆత్మహత్యల రేటులో 176 దేశాలకు గాను 19వ స్థానంలో ఉండడం ఆందోళనకరం. "ఎక్కడ పుడితే బావుంటుంది" అనే అంశం మీద 80 దేశాల పౌరులపై చేసిన విశ్లేషణలో మన దేశానికీ 72వ ప్రాధాన్యత లభించింది.

ప్రజా శ్రేయస్సు సూచికలో 149 దేశాలకు గాను 101వ స్థానంలో ఉండడం, ప్రజాస్వామ్య సూచికలో 112 దేశాలకు గాను 65వ స్థానంలో ఉండడం, చట్టబద్ధ పాలన సూచీలో 113 దేశాలకు గాను 68వ స్థానంలో ఉండడం, పత్రికా స్వేచ్ఛలో 180 దేశాలకు గాను 148వ స్థానంలో ఉండడం, పాలకుల ఫాసిస్టు పోకడలను, నిరంకుశ విధానాలను ప్రతిబింబిస్తోంది.

పై గణాంకాలన్నీ ఐక్యరాజ్యసమితి, దాని అనుబంధ సంస్థలు, వరల్డ్ బ్యాంక్ లాంటి అంతర్జాతీయ సంస్థలు ఎంతో శాస్త్రీయంగా తయారు చేసినవే.

వ్యవస్థీకృత సోషల్ మీడియా నెట్‌వర్క్, వాట్సాప్ యూనివర్సిటీ సహాయంతో ఫేక్ పోస్టుల ద్వారా, తమ లోప భూయిష్ట పాలనను అద్భుతమైన పాలనగా చిత్రీకరించు కుంటున్నారు కేంద్ర బిజెపి పాలకులు. తమకి తామే విశ్వగురు, 56 అంగుళాల ఛాతీ వంటి ప్రశంసలు ఇచ్చేసుకుంటున్నారు. దేశం వెలిగిపోతోందని నమ్మబలుకుతూ, ప్రజలకు వాస్తవాలు అర్థం కానివ్వకుండా వారిలో కులమతాల విద్వేషాలు నింపుతున్నారు. మరోసారి మందిరం ముసుగుతో అధికార పీఠం ఎక్కేస్తే, ఇక రానున్న ఐదేళ్లలో రాజ్యాంగ మౌలిక అంశాలను కూడా మార్చేసి, ఒకే దేశం, ఒకే పార్టీ, ఒకే మతం, ఒకడే రాజు–అన్న చందంలో అఖండ హిందూ సామ్రాజ్య స్థాపన వైపు దేశాన్ని తీసుకెళ్లే కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగిద్దామనుకుంటున్న వీరు ఒక్క విషయం మర్చి పోతున్నారు.



నిప్పుని పొట్లం కట్టి జేబులో దాచే ప్రయత్నం చేస్తే, అది జేబుని దహించుకుంటూ బయటికొచ్చి తన ఉనికిని చాటుతుంది. అలాగే మెజారిటీ ప్రజల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంటే, ఈ విషయాన్ని మరుగుపరిచి అంతా ఘనంగా ఉందంటూ నమ్మబలికే ప్రయత్నం ఎంత తీవ్రంగా చేసినా...పై గణాంకాలు వాస్తవాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరిస్తున్నాయి. వివిధ కీలక అంశాల్లో మన పాలకుల వైఫల్యాలను, నిర్లక్ష్యాన్ని, తప్పుడు ప్రాధాన్యతలను ఎత్తి చూపుతున్నాయి.

ఈ గణాంకాలు సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా వంటి సాధానాల ద్వారా విస్తృత జన బాహుళ్యానికి తక్షణం చేరాల్సిన అవసరం ఉంది.

ప్రజలు నిన్ను నీ మాటలను బట్టి కాక, నీ చేతలను బట్టి అంచనా వేస్తారనే స్పృహ లేని ఈ పాలకులకు...పై గణాంకాలను బట్టి జరుగుతున్న ఎన్నికల్లో తగిన శాస్తి తప్పకుండా జరుగుతుంది.

- భగత్

శ్రీసత్యసాయి జిల్లాలో విఆర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్ (శ్రీ సత్యసాయి జిల్లా)

ఎన్నికల విధుల సమయంలో వాదులాడుకున్న ఇద్దరు కానిస్టేబుళ్లపై శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి చర్యలు తీసుకున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా రొళ్ల మండల పిల్లిగుండ్ల చెక్‌పోస్టు వద్ద విధుల విషయంలో కానిస్టేబుళ్లు శివ, నారాయణ స్వామిలు సోమవారం ఉదయం తీవ్ర స్థాయిలో వాదులాడుకున్నారు. వీరు వాదులాడుకున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున వైరల్ అయ్యింది. దీనిని తీవ్రంగా పరగణించిన ఎస్పీ మాధవరెడ్డి ఇద్దరు కానిస్టేబుళ్లను విఆర్‌కు పంపుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంఘటనపై విచారణ అనంతరం పోలీస్ శాఖ పరంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలియజేశారు.

లైంగిక దాడుల నేరస్తులకు బిజెపి అండదండలు

మోడీ పాలనలో మహిళలపై పెరిగిన హింస

న్యూఢిల్లీ : బిజెపి పాలనలో మహిళలపై హింస మరింతగా పెరిగిపోయింది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్, నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థలు ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం మహిళలపై నేరాలకు సంబంధించిన 134 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు కేసులు ఎదుర్కొంటున్నారు. వీరిలో బిజెపి ప్రజాప్రతినిధుల సంఖ్యే అధికంగా (44) ఉంది. అత్యాచారాలు, వేధింపులు వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి రక్షణ కల్పించడంలో బిజెపి ఏ మాత్రం వెనుకంజ వేయడం లేదు. బిజెపి వెబ్‌సైట్ చూస్తే అందులో నారీశక్తి ప్రస్తావన పదేపదే కన్పిస్తుంది. మహిళలపై వివక్షను తొలగించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. బాలికలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉద్బోధిస్తుంది. కానీ ఇవి మాటలకే పరిమితం... బిజెపి నేతలు తరచుగా తమ మహిళా సహచరులను కించపరిచే వ్యాఖ్యలతో నొప్పిస్తుంటారు. ప్రతిపక్షంలో ఉన్న మహిళా నేతలను కూడా వారు వదిలిపెట్టరు.

ప్రధాని సైతం...

సాక్షాత్తూ ప్రధాని మోడీ 2018లో రాజ్యసభ ఎంపీ సోనియాగాంధీని ఉద్దేశించి 'వితంతువు' అని సంబోధించారు. రాజకీయ నాయకుల కుటుంబాలను కూడా ఆయన వదలలేదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్‌కు చెందిన త్రివేంద్రం ఎంపీ శశిథరూర్ భార్య సునందా పుష్కర్‌ను 'యాభై కోట్ల రూపాయల గర్ల్ ఫ్రెండ్' అంటూ కించపరిచారు.

దేశంలో మహిళలపై నేరాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. 2021లో 60 లక్షల నేరాలు నమోదు కాగా వాటిలో 4,28,278 కేసులు మహిళలపై నేరాలకు సంబంధించినవే. 2016లో ఈ తరహా నేరాలు 3,38,954 నమోదయ్యాయి. అంటే ఆరు సంవత్సరాల వ్యవధిలో మహిళలపై నేరాల కేసులు 26.35 శాతం పెరిగాయి. అదేవిధంగా జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) ప్రకారం





2015-2020 మధ్యకాలంలో దళిత మహిళలపై లైంగికదాడుల కేసుల సంఖ్య 45 శాతం పెరిగింది. దీనిని బట్టి చూస్తే ప్రతి రోజూ దేశంలో దళిత మహిళలు, బాలికలపై అత్యాచారాలకు సంబంధించి 10 కేసులు నమోదవుతున్నాయి. ఈ అకృత్యాలలో బిజెపి, దాని మిత్రపక్షాల నాయకుల పాత్ర ఎంత?

వీరంతా ఎన్‌డిఎ నాయకులే

ఇటీవల కర్నాటకలో రాజకీయ ప్రకంపనలు రేపిన ఉదంతాన్ని తీసుకుందాం. ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షమైన జెడిఎస్ సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దాడులకు సంబంధించి మూడు వేల వీడియో టేపులు బయటపడ్డాయి. ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో ఆయన దేశాన్ని విడిచి పారిపోయారు. ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ సహా పలువురు బిజెపి నేతలపై కూడా లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నాయి. ఆ పార్టీ నాయకులు కుల్దీప్ సింగ్ సెంగర్, రాందులార్ గోండ్ తదితరులు ప్రస్తుతం కారాగారంలో ఉన్నారు.

తలవంపులు తెచ్చిన హత్రాస్ ఘటన

మహిళలపై అఘాయిత్యాలు, లైంగికదాడులు జరుగుతున్నప్పటికీ బిజెపి స్పందన అంతంతమాత్రంగానే ఉంటోంది. ఉత్తరప్రదేశ్‌లో ఓ దళిత యువతిపై లైంగికదాడి, హత్యకు సంబంధించిన హత్రాస్ కేసులో ఆ పార్టీ వైఖరి దీనికి అద్దం పడుతోంది. 2020లో దళిత బాలికపై అగ్రకుల ఠాకూర్ వర్గానికి చెందిన నలుగురు కామాంధులు దాడి చేసి చిత్రహింసలు పెట్టారు. ఈ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత ఆ బాలిక కుటుంబసభ్యులకు బెదిరింపులు అధికమయ్యాయి. చివరికి ఆమె మృతదేహాన్ని దహనం చేసేందుకు కూడా కుటుంబసభ్యులను అనుమతించలేదు. రాత్రికి రాత్రే ఆ మృతదేహాన్ని పోలీసులు బలవంతంగా దహనం చేశారు. కేసు విచారణ సమయంలో సాక్షులను కూడా బెదిరించారు. భయపెట్టారు. చివరికి కేసులో ఒకే ఒక వ్యక్తికి శిక్ష పడింది. నలుగురు నిర్దోషులుగా బయటపడ్డారు. చనిపోవడానికి ముందు ఆ బాలిక మెజిస్ట్రేట్ ఎదుట నలుగురు కామాంధులకు వ్యతిరేకంగా మరణవాంగ్మూలం ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. హత్రాస్ ఘటనపై వార్తలు అందించేందుకు ఇద్దరు పాత్రికేయులు, ఒక ట్యాక్సీ డ్రైవర్ సహా ముగ్గురు ముస్లింలు ప్రయత్నించగా వారిని అరెస్ట్ చేసి మూడు సంవత్సరాల పాటు జైలులో ఉంచారు. పైగా ఈ ఉదంతాన్ని మసిపూసి మారేడుకాయ చేసేందుకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రయత్నించింది. అసలు దళిత బాలికపై అత్యాచారమే జరగలేదని విదేశీ మీడియాలో కథనాలు వచ్చేలా ప్రజాసంబంధాల సంస్థలను ఉపయోగించుకుంది. మొత్తంమీద హత్రాస్ ఘటన దేశానికే తలవంపులు తెచ్చింది.

కామాంధులకు అండ..దండ

2002లో గుజరాత్‌లో జరిగిన మారణహోమం సందర్భంగా జరిగిన బిల్కిస్ బానో కేసును గుర్తుకు తెచ్చుకుందాం. బిల్కిస్‌పై పైశాచికంగా అత్యాచారం జరిపిన కామాంధులకు న్యాయస్థానం జైలుశిక్ష విధించగా, గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వం వారికి క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేసింది. అయితే సుప్రీంకోర్టు ఈ నిర్ణయాన్ని కొట్టివేసింది. దీనికి ముందు జైలు నుండి విడుదలైన రేపిస్టులకు వీహెచ్‌పీ పూలదండలు, మిఠాయిలతో స్వాగతం పలికింది. గత సంవత్సరం గుజరాత్‌లో ఈ దుండగులు బిజెపి ఎంపీ, ఎమ్మెల్యేతో కలిసి ఒకే వేదికను పంచుకున్నారు. గర్భవతిగా ఉన్నప్పుడు బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం జరిపారు. మూడు సంవత్సరాల కుమార్తె సహా ఆమె కుటుంబంలోని ఏడుగురు సభ్యులను హతమార్చారు. బిల్కిస్ బానో ఉదంతాన్ని పరిశీలిస్తే అత్యాచారాలకు పాల్పడిన వారికి బిజెపి, సంఘ్ పరివార్ ఏ విధంగా కొమ్ము కాస్తున్నాయో అర్థమవుతుంది.

మసకబారుతున్న మోడీ ప్రాభవం

- ఉత్తరాది రాష్ట్రాల్లోనూ తగ్గిపోయిన ఛరిష్మా
- ప్రజా సమస్యల ముందు వెనక్కి పోయిన హిందూత్వ
- కాలం చెల్లిన మెజారిటీవాద రాజకీయాలు

న్యూఢిల్లీ : దేశంలో సార్వత్రిక ఎన్నికల పోరు కీలక దశకు చేరుకుంది. ఇప్పటికే మూడు దశల పోలింగ్ ముగిసింది. మరో నాలుగు విడతల పోలింగ్ జరగాల్సి ఉంది. ఎన్‌డిఎ నేతలు కలలు కంటున్నట్లు 400కు పైగా స్థానాలు వచ్చే అవకాశాల్లేవని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. సాధారణ మెజారిటీకి అవసరమైన 272 స్థానాలను దక్కించుకునే స్థితిలో కూడా ప్రస్తుతం ఎన్‌డిఎ లేదన్నారు. మోడీ మానియా క్రమేపీ అదృశ్యమవుతోంది. అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. మోడీ ఛరిష్మాకు



కాలం చెల్లిందనివిశ్లేషకులు అంటున్నారు.

2014, 2019 ఎన్నికల్లో మోడీ ప్రభంజనం స్పష్టంగా కన్పించింది. అయితే ఇప్పుడది ఎక్కడా కానరావడం లేదు. మోడీ, ఇతర బిజెపి నేతల్లో ఆత్మవిశ్వాసం సన్నగిల్లిపోతోంది. రెండో దశ పోలింగ్ ప్రచారం సందర్భంగా ప్రధానిలో అసహనం కన్పించింది. ఆయన తన ఎన్నికల ప్రసంగాల్లో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని దాడి చేస్తున్నారు. మైనారిటీలకు కాంగ్రెస్ కొమ్ము కాస్తోందని, హిందువుల సంపదను గుంజుకొని వారికి ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు. ఓటర్ల మనోగతాన్ని పసిగట్టేందుకు పలువురు విశ్లేషకులు హిందీ రాష్ట్రాల్లో పర్యటించారు. 2019తో పోలిస్తే బిజెపి బలం తగ్గుతుందని వారు తేల్చి చెప్పారు. 2019లో హిందీ బెల్ట్‌లో బిజెపి గరిష్ట సంఖ్యలో స్థానాలు సాధించింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో మెజారిటీవాద రాజకీయాలు నడిపి ఓట్లు దండుకుంది. అయితే ఇప్పుడు ఆ వాతావరణం కన్పించడం లేదు. ఆయా రాష్ట్రాల్లో మోడీ ప్రాభవం ఇప్పుడు మసకబారింది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి ప్రజా సమస్యలు ఒక్కసారిగా ముందుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో హిందూత్వ వాదం వెనక్కి పోయింది. మోడీకి కంచుకోటలుగా ఉన్న హిందీ రాష్ట్రాల్లో బిజెపి ఎన్ని స్థానాలు కోల్పోతుందో చూడాల్సి ఉన్నదని రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ చెప్పారు. అయితే సాధారణ మెజారిటీకి అవసరమైన 272 స్థానాలను గెలుచుకునే స్థితిలో అయితే ఎన్‌డిఎ లేదని పేర్కొన్నారు.

క్రికెటర్ల ప్రతిభను గుర్తించేందుకు ఎసిఎ చర్యలు

ప్రజాశక్తి -పిఎం పాలెం (విశాఖ)

అట్టడుగు స్థాయి క్రికెటర్లలో ప్రతిభను గుర్తించేందుకు వీలుగా రైజింగ్ స్టార్స్ పేరిట ఎసిఎ ఒక వేదికను అందిస్తోందని, వీటిని ప్లేయర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్ రెడ్డి సూచించారు. ఈ నెల 10వ తేదీన మూడు ప్రాంతాల్లో ట్రయల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వైజాగ్‌లోని-డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ - వీడీసీఏ క్రికెట్ స్టేడియం "బి" గ్రౌండ్, గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ స్టేడియం, కడప నగరంలోని వైఎస్ఆర్ఆర్ ఏసీఏ స్టేడియంలలో ట్రయల్స్ జరగనున్నాయని వివరించారు. 10వ తేదీన ట్రయల్స్ కోసం ప్లేయర్‌లు రెండు వేర్వేరు సమయాల్లో స్లాట్‌లను ఎంచుకోవచ్చని తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు ఉంటాయని వివరించారు. 18 నుంచి 28 మధ్య వయసున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. గత ఏడాది ఏ ఇతర రాష్ట్రానికీ ప్రాతినిధ్యం వహించి ఉండకూడదదని వివరించారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 9 నుంచి 9వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ప్లేయర్ ఈ లింక్ http://15.206.63.242/AC/playerOpenRegistration/form ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

వ్యవసాయ పరిశోధనలో క్షీణిస్తున్న వ్యయం : సర్వే

న్యూఢిల్లీ : 2011-2022 మధ్య కాలంలో వ్యవసాయ పరిశోధనా వ్యయం క్షీణించింది.వాస్తవానికి వ్యవసాయ పరిశోధనలో ఖర్చు చేసిన వ్యయానికి ప్రతి రూపాయికి సుమారు రూ.13.85 పైసలు రాబడి వస్తుందని సర్వేలో వెల్లడైంది. పైగా వ్యవసాయానికి సంబంధించిన అన్ని ఇతర కార్యకలాపాల నుండి వచ్చే రాబడిని ఇది అధిగమించడం గమనార్హం. రాబడి అధికంగా ఉన్నప్పటికీ.. ప్రభుత్వం వ్యసాయ పరిశోధనల్లో వ్యయాన్ని పెంచడం లేదని సర్వే స్పష్టం చేసింది.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసిఎఆర్) కింద పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎకనామిక్స్ అండ్ పాలసీ రీసెర్చ్ (ఎన్ఐఎపి) గత నెలలో ఈ వర్కింగ్ పేపర్‌ను ప్రచురించింది. ఆహారంతో పాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా తక్కువ వ్యవసాయ విస్తరణ మధ్య వాటి ఉత్పత్తికి భవిష్యత్తులో సవాళ్లను ఎదుర్కొనేందుకు మరింత పెట్టుబడులు అత్యవసరం. ఆర్థిక, సామాజిక, పర్యావరణ ప్రయోజనాలను పెంచడానికి వ్యవసాయంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) విభాగాలు, వాటి అనుబంధ విభాగాలు ప్రాధాన్యత ప్రధానమైనది. వ్యవసాయ విస్తరణ కార్యకలాపాలను పెంచిన తర్వాత పెట్టుబడి పెట్టిన ప్రతిరూపాయికి రూ.7.40 రెండవ అత్యుత్తమ రాబడిని ఇస్తుందని పరిశోధనల్లో తేలింది.

సర్వేలో వెల్లడైన కీలక అంశాలు

- విస్తృతమైన వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాల్లో, సబ్‌సెక్టార్ స్థాయిలో చెల్లింపుల్లో స్పష్టమైన తేడాలున్నట్లు సర్వే గుర్తించింది. జంతు శాస్త్ర పరిశోధనల్లో వ్యయంపై ఆదాయం ప్రతి రూపాయికి రూ.20.81 గణనీయంగా అధికంగా ఉంది. అదే క్రాప్ సైన్స్ సెక్టార్‌పై రూ.11.69గా ఉంది.
- వ్యవసాయ పరిశోధలపై పెట్టుబడుల్లో ప్రాంతాల వారీగా కూడా గణనీయమైన తేడా ఉంది. 2011-2020 మధ్య ఒడిశా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లలో దేశంలోని నికర విత్తన విస్తీర్ణంలో 43 శాతంగా ఉంది. వాటిలో వ్యవసాయ పరిశోధనపై జిడిపిలో 0.25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసింది. మరోవైపు జమ్ముకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, బీహార్, కేరళ మరియు అస్సాంలలో వ్యవసాయ పరిశోధన, అభివృద్ధికి జిడిపిలో కేవలం 0.80 శాతం మాత్రమే ఖర్చు చేసింది. పశువులు, సహజవన రులపై గణనీయంగా తక్కువ వ్యయం చేస్తున్నట్లు స్పష్టమైంది. కానీ, దక్షిణాది రాష్ట్రాల్లో ఈ వ్యయం మరింత సమతుల్యంగా ఉందని సర్వే తెలిపింది. 2011-2020 మధ్య కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వరుసగా 33.8 శాతం సహకారం అందించాయి. వ్యవసాయ ఆర్‌అండ్ డిలో మొత్తం పెట్టుబడిలో ప్రభుత్వాల వాటా 58.5 శాతంగా ఉంది. అయితే ప్రైవేట్ రంగం పెట్టుబడులు 8 శాతానికి పెరిగినప్పటికీ... ప్రపంచ సగటు కన్నా తక్కువగానే ఉంది.

2011-2020 వరకు, భారత్ తన వ్యవసాయ జిడిపిలో 0.61 శాతం పరిశోధన కోసం ఖర్చు చేసింది. ప్రపంచ సగటు 0.93 శాతంలో మూడింట రెండు వంతులుగా ఉన్నట్లు సర్వే తేల్చింది. వ్యవసాయ జిడిపిలో విస్తరణ సేవలపై ఖర్చు చేసింది 0.16 శాతం. 2020-21మధ్య భారత్ వ్యవసాయ జిడిపిలో పరిశోధన కోసం 0.54 శాతం ఖర్చు చేయగా, విస్తరణ సేవల కోసం 0.11 శాతం ఖర్చు చేసింది.


పరిశోధన వ్యయంలో వార్షిక వృద్ధి 1981-1990లో 6.4 శాతం నుండి 2011-2020లో 4.4 శాతానికి క్షీణించింది. ప్రధానంగా ప్రభుత్వ వ్యయంలో మందకొడిగా సాగుతున్న వృద్ధి, ప్రైవేట్ వ్యయం వృద్ధిలో గణనీయమైన క్షీణత కారణమని సర్వే తేల్చింది.

డబుల్ ఇంజిన్ సర్కారొస్తే ప్రతి గ్రామం మణిపూరే!

(మొదటి పేజీ తరువాయి)

కల్పించని మోడీ ప్రభుత్వం తన అధికారం నిలబెట్టుకోవడానికి ప్రజల మధ్య చిచ్చుపెట్టే కుట్రలు చేస్తోందని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ.. ఏజెన్సీలో హైడల్ పవర్ ప్రాజెక్టులను అదానీకి అప్పగించి, గిరిజనులకు అన్యాయం చేసేందుకు ఎంపి అభ్యర్థిగా కొత్తపల్లి గీతను బిజెపి నిలబెట్టిందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ.. ఆదివాసీలకు ఇండియా వేదిక ద్వారానే రక్షణ అని తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. అటవీ చట్ట సవరణ తరువాత ఛత్తీస్‌గఢ్‌లో ప్రాజెక్టుల పేరుతో బొగ్గు గనులను అక్రమించుకుంటున్నట్లే, ఏజెన్సీలో మైనింగ్‌ను దోపిడీ చేయడానికి అనకాపల్లి, అరకు ఎంపీ స్థానాల నుంచి సిఎం.రమేష్, కొత్తపల్లి గీతలను బిజెపి పోటీలో నిలబెట్టిందన్నారు. కాంగ్రెస్ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర్ స్వామి మాట్లాడుతూ.. ఏజెన్సీలో బిజెపి, వైసిపి, టిడిపిలు గెలిస్తే ఆదివాసీ ప్రాంతం సర్వనాశనమవుతుందన్నారు. ఆయా సభల్లో సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్స, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, అనంతగిరి సిపిఎం జడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతగిరి, అరకు, ముంచంగిపుట్టుల్లో సాగిన రోడ్‌షో ఆకట్టుకుంది.





హాయ్ ఫ్రెండ్స్,



నా పేరు మోనన్ వేదాన్ష్. అమ్మానాన్న ముద్దుగా టింకూ అని పిలుస్తారు. నాకు అల్లరి చేయడం బాగా ఇష్టం. మొన్న మార్చి నెలలోనే నా మొదటి పుట్టినరోజు జరిగింది. ఈ ఫొటోలు అప్పుడు తీసినవే. రకరకాల బట్టలు వేసి, అమ్మానాన్న నన్ను ఎంతో అందంగా ముస్తాబు చేశారు. ఫొటోలు తీశారు. నేను ఫోజులు ఇస్తుంటే భలే సంతోషపడ్డారు. అమ్మ అయితే ఎన్ని ముద్దులు పెట్టిందో లెక్కే లేదు. మరి నా ఫొటోలు మీక్కూడా నచ్చాయా!

– మోనన్ వేదాన్ష్ సూర్యభట్ల,
విశాఖపట్నం.





గురువు


అక్షరాలు దిద్దిస్తున్నప్పుడు తెలియలేదు
నా జీవితాన్ని మలుపు తిప్పుతున్నారని
కోపగించుకున్నప్పుడు తెలియలేదు
నాపై బాధ్యతను పెంచుతున్నారని
చేతి మీద కొట్టినప్పుడు తెలియలేదు
నా చేతికి భయం పెడుతున్నారని
ప్రశ్నలడిగినప్పుడు తెలియలేదు
ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నారని ...
పరీక్ష పెడుతున్నప్పుడు తెలియలేదు
నా ఆత్మవిశ్వాసాన్ని పరీక్షిస్తున్నారని
మార్కులొస్తున్నప్పుడు తెలియలేదు
నాలో సామర్థ్యాన్ని నింపుతున్నారని
ఈ క్షణం తెలుస్తోంది
నాలో.. ఒక విశాల ప్రపంచాన్ని సృష్టిస్తున్నారని!

– జి.సుహాసిని,
అల్లినగరం, ఎం.తిమ్మాపురం,
ఏపీ మోడల్ స్కూలు,
నంద్యాల





కేశవ హర్ష,
6వ తరగతి,
నెల్లూరు జిల్లా.





మురాల నిహారిక,
6వ తరగతి,
సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్,
గుణదల.





గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా 'చిన్నారి', 'వేసవి విడిది'గా ముస్తాబవుతుంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా
వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.
మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com

– ఎడిటర్

జీవన సౌరభం

ధైర్యంగా వేసే ప్రతి అడుగులోనూ భయపెట్టే విమర్శలే వస్తుంటాయి. వింటూ ఆగిపోవడమా, సరిదిద్దుకొని సాగిపోవడమా అనేది మీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

అవసరార్థులకు రాత హస్తం ..!

చదువుకుంటున్న ప్రతి ఒక్కరూ పరీక్షలు రాయాలి. ఇది అందరికీ తెలిసిందే. ప్రస్తుతం మారిన పరిస్థితుల్లో వికలాంగులు, అంధత్వంతో బాధపడేవారు, ఆటిజం బాధిత వ్యక్తుల్లో ఎంతోమంది తమ ప్రతిభతో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. వారు కూడా పరీక్షలు రాయాల్సిందే. మరి ఇది వారికెలా సాధ్యమౌతుంది? వైకల్య బాధితులకు ముఖ్యంగా ఆటిజం విద్యార్థులు సంజ్ఞలు మాత్రమే చేయగలరు. వారు ఎలా పరీక్షలు రాస్తారు? బ్రెయిలీ లిపిలో రాసే సౌలభ్యం లేనప్పుడు అంధ విద్యార్థులు కూడా పరీక్షలు రాయడానికి చాలా కష్టపడాలి. వైకల్యం వెక్కిరించినా విద్యతో తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని, ఎంతో కష్టపడిన వారికి పరీక్షలు రాసే అవకాశం లేనప్పుడు ఎంత నిరుత్సాహం ఆవహిస్తుంది? ఈ పరిస్థితుల్లోనే వారికి కొండంత అండగా నిలబడుతున్నారు కోయంబత్తూర్‌కి చెందిన 51 ఏళ్ల రమా పద్మనాభన్. తనవి కానీ పరీక్షలు రాస్తూ వారి బంగారు భవిష్యత్తుకు మార్గం సుగమం చేస్తోంది.



సైకాలజీలో గ్రాడ్యుయేట్, గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లోమా చేసిన రమ లక్ష్యం కోసం పనిచేయాలన్న కోరిక బలంగా ఉన్న ఓ సాధారణ గృహిణి. ఇంటికే పరిమితమైన ఈ ఉన్నత విద్యావంతురాలు తన జీవితంలో ఎప్పుడూ ఊహించని ప్రయాణాన్ని చేస్తున్నారు. 11 ఏళ్లుగా స్క్రైబ్ (పరీక్షలు రాయలేని వ్యక్తుల తరపున వరి సమక్షంలోనే ఎంతో కొంత రుసుము తీసుకుని లేదా స్వచ్ఛందంగా పరీక్షలు రాసే వ్యక్తులను స్క్రైబ్ అని పిలుస్తారు)గా సేవలు అందిస్తున్నారు. ఏవిధమైన లాభాపేక్ష లేకుండా ఆమె ఈ నిస్వార్థ సేవను చేస్తున్నారు. మొదట్లో ఒక అభిరుచిగా ప్రారంభమైన ఈ సేవా మార్గం ఇప్పుడామె దైనందిన జీవితంలో భాగమై పోయింది. కాలేజీ ప్రతి సెమిస్టర్‌లో తనవి కాని 50 పరీక్షలకు హాజరై పరీక్షలు రాస్తున్నారు. రోజు మొత్తం మీద ఒకటి లేదా రెండు సార్లు కంటే ఎక్కువ పరీక్షలు రాయడం అంత ఆషామాషీ కాదు. కానీ రమ ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తున్నారు.


'ఒక అభిరుచిగా ఈ ప్రయాణం మొదలుపెట్టాను. కానీ ఇప్పుడిదే సీరియస్ జాబ్‌గా మారిపోయింది. నా భర్త విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నారు. ఆర్థికంగా బాగానే ఉన్నాం. ఇద్దరు బిడ్డల ఆలనా పాలనా చూసుకుంటూ నేను ఇంటికే పరిమితమయ్యాను. 2013లో ఒకసారి నా స్నేహితురాలు ఫోను చేసింది. తనకు తెలిసిన ఒక అంధ పిల్లవాడికి పరీక్ష రాయాలని అభ్యర్థించింది. అతను రాసే పరీక్ష హాలు మా ఇంటికి చాలా దగ్గరగా ఉండడం వల్ల నేను వెంటనే ఒప్పుకున్నాను' అంటున్న రమ ఇప్పుడు 25 కిలోమీటర్లు దూరం ప్రయాణించి కూడా పరీక్షలు రాస్తున్నారు. 'ఒకసారి నా కొడుకును ఇంట్లో వదిలిపెట్టి పరీక్ష రాయడానికి వెళ్లాను. ఉదయం వెళితే మళ్లీ సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. కొన్ని గంటల పాటు పిల్లవాడు అలాగే ఒంటరిగా ఉన్నాడు' అంటూ తన ప్రయాణపు ఓ జ్ఞాపకాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు.

ఇంత వ్యయప్రయాసలు పడి పరీక్షలు రాస్తున్న రమ, ఏ రోజూ ప్రతిఫలం ఆశించలేదు. ఏదైనా సంస్థ తరపున పరీక్షలకు హాజరైనప్పుడు, వారు డిజిటల్ వేదికగా రుసుము చెల్లించినా ఆ సొమ్మును ఇంటికి తీసుకువచ్చిన దాఖలా లేదు. దారిలోనే ఆ సొమ్మును సేవాసంస్థలకు ఇచ్చేసి వస్తారు. లేదా, పేద సాదలకు ఆహారం, దుస్తుల రూపంలో పంపిణీ చేస్తారు. 'నా భర్త సహకారం లేకుండా నేను ఇది సాధించలేదు. ఏరోజూ ఆయన నన్ను ప్రశ్నించలేదు. నా స్వేచ్ఛను గౌరవించారు. నేను చేస్తున్న పనిని అభినందించారు. భర్త, కుటుంబ సహకారం ఉండబట్టే నేను ఇది సాధించాను' అంటూ తన గొప్పతనాన్ని తగ్గించుకుంటారు రమ.

'స్క్రైబ్ సేవ వికలాంగ విద్యార్థుల భవిష్యత్తును ముందుకు తీసుకెళ్లే గొప్ప సాధనం. అయితే దీర్ఘకాలం స్క్రైబ్‌గా ఉండడం సాధ్యం కాని పని. ఇది కేవలం పరీక్ష రాయడం ఒక్కటే కాదు, అంతకుమించిన బాధ్యత. రమ దశాబ్దం కాలానికి పైగా ఈ సేవలో నిమగ్నమవ్వడం, అదీ ఉచితంగా అందించడం గొప్ప విషయం' అంటున్నారు రమ గురించి బాగా తెలిసిన లూయిస్ బ్రెయిలీ అకాడెమీ కోఆర్డినేటర్ గణేష్.

రమ పరీక్షలు రాసిన విద్యార్థుల్లో పదిమందికి పైగా అంధ విద్యార్థులు ఇప్పుడు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తమ ఉన్నతికి సహాయపడ్డ రమని ఇప్పటికీ వారు గుర్తుంచుకుని గౌరవిస్తారు. 'ఎప్పుడో నేను చేసిన చిన్న సహాయాన్ని గుర్తుంచుకుని ఇప్పటికీ గౌరవించడం వారి మంచితనమే. ఇందులో నేను చేసిందేమీ లేదు. ఎంతోమంది విద్యార్థులకు పరీక్షలు రాశాను. ముఖ్యంగా ఆటిజం పిల్లలకు రాసేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. సంజ్ఞల భాషలో వారు చెప్పే సమాధానాన్ని పేపరు మీద పెట్టడం పెద్ద సవాలు. వాళ్లకి పరీక్షలు రాసిన చాలా సేపటి వరకు నేను సాధారణ స్థితికి వచ్చేదాన్ని కాదు. అంతలా వారితో మమేకమైతే గానీ పరీక్షలు రాయడం కుదరని పని' అంటున్న రమ లాంటి నిస్వార్థ సేవకులు చాలా అరుదుగా కనిపిస్తారు.

సాయి కార్తీక్ నిర్మాతగా '100 క్రోర్స్'



సంగీత దర్శకుడు సాయి కార్తీక్ నిర్మాతగా మారి ఓ సినిమా రూపొందిస్తున్నారు. దివిజా కార్తీక్, ఎస్.ఎస్.స్టూడియోస్ బ్యానర్ మీద 2016లో జరిగిన ఓ నిజ జీవిత సంఘటనల ఆధారంగా '100 క్రోర్స్' అనే సినిమాను సాయి కార్తీక్ నిర్మించారు. విరాట్ చక్రవర్తి కథ అందించి, దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాహుల్, చేతన్, యమీ, సాక్షి చౌదరి, లహరి, అన్నపూర్ణమ్మ, ఐశ్వర్య, భద్రం, ఇంటూరి వాసు, సమీర్ తదితరులు కీలక పాత్రలను పోషించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. దర్శకులు వీర శంకర్, మల్లిక్ రామ్, నిర్మాత హర్షిత్ రెడ్డి, నిర్మాత దామోదర ప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అనంతరం చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

'సెలబ్రిటీలు కూడా మనుషులే'




సిద్ధార్థ్ వల్లే తనకు ప్రేమపై నమ్మకం పెరిగిందని నటి అదితిరావ్ అన్నారు. గత నెలలో సిద్ధార్థ్– అదితిల నిశ్చితార్థం జరిగింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె తమ అనుబంధంపై మాట్లాడారు. 'సిద్ధార్థ్ నన్నెంతో మార్చాడు. అతడు పరిచయమయ్యాకే ప్రేమపై నమ్మకం మరింత పెరిగింది. ఎన్నో విషయాల్లో నా నమ్మకం నిజమైంది. మా ఇద్దరిది చిన్నపిల్లల స్వభావం. ప్రేమ ఉన్న చోట గౌరవం తప్పనిసరిగా ఉంటుంది. మేమిద్దరం ఒకరినొకరం ఎంతో గౌరవించుకుంటాం. నేను ప్రతి విషయాన్ని పాజిటివ్‌గా తీసుకుంటాను. నటీనటులపై రూమర్స్ రావడం సహజమే. మా ఇద్దరిపై గాసిప్స్ వచ్చాయి. వాటికి చెక్ పెట్టేందుకే నిశ్చితార్థం విషయాన్ని మీడియాకు వెల్లడించాం. విషయాన్ని తెలుసుకున్న వారు సంతోషించి శుభాకాంక్షలు తెలిపారు. వాళ్లందరికీ ధన్యవాదాలు. వాళ్ల అభిమానం ఎంతో విలువైనది' అని చెప్పారు. సోషల్ మీడియా గురించి మాట్లాడుతూ.. 'సెలబ్రిటీలు కూడా మనుషులే అని ప్రజలు గ్రహించాలి. వాళ్ల చుట్టూ తిరిగి వాళ్ల వ్యక్తిగత జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనుకోవడం తప్పని తెలుసుకోవాలి. వారి గోప్యతకు భంగం కలిగించకూడదని నెటిజన్లు భావించాలి. అందరికీ చెప్పే విషయమైతే నటీనటులు స్వయంగా వెల్లడిస్తారు' అని చెప్పారు.

'దేవర' టీమ్‌పై తేనెటీగల దాడి



అల్లూరి జిల్లా మోదకొండమ్మ పాదాల వద్ద 'దేవర' సినిమా షూటింగ్ జరుగుతుండగా చిత్ర బృందంపై తేనెటీగలు దాడిచేశాయి. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా, జాన్వీకపూర్ హీరోయిన్‌గా 'దేవర' సినిమా నిర్మాణం జరుగుతున్న విషయం తెలిసిందే. షూటింగ్ ప్రదేశంలో ఉన్న తేనెతుట్టెపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా వచ్చి అక్కడ ఉన్న జూనియర్ ఆర్టిస్టులపై దాడి చేశాయి. వారు పరుగులు పెడుతున్న క్రమంలో కొందరు గాయపడ్డారు. దాదాపు 20 మంది ఈ తేనెటీగల దాడిలో గాయపడినట్లుగా సమాచారం. వారిని దగ్గరిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

'స్వయంభు' వార్ సీక్వెన్స్



నిఖిల్ సిద్ధార్థ నటిస్తున్న తాజా చిత్రం 'స్వయంభు'. భరత్ కృష్ణమాచారి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. నిఖిల్ 20 వ సినిమాగా ఈ మూవీ తెరకెక్కుతుంది. మలయాళ నటి సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మేకర్స్ ఓ ఆసక్తికర అప్‌డేట్‌ను అందించారు. 'స్వయంభు టీం.. ఒక పురాతన కాలం బ్యాక్‌డ్రాప్‌లో సాగే యుద్ధ ఎపిసోడ్‌ను భారీ స్థాయిలో చిత్రీకరిస్తోంది. 12 రోజులపాటు జరగనున్న ఈ షెడ్యూల్‌ను రూ.8 కోట్ల బడ్జెట్‌తో షూట్ చేస్తున్నాము. నిఖిల్ యాక్షన్, స్టంట్స్‌తో సాగే ఈ భారీ వార్ సీక్వెన్స్ అద్భుతంగా ఉండబోతుంద'ని మేకర్స్ ట్వీట్ చేశారు.

సల్మాన్‌ఖాన్‌కు జోడీగా త్రిష?



సీనియర్ నటి త్రిష తమిళం, తెలుగు, మలయాళం, కన్నడంలో ఏక కాలంలో పలు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. మరోసారి బాలీవుడ్‌లోకి ఆమె రీ ఎంట్రీకి సిద్ధమైనట్లుగా సమాచారం. 2010లో ప్రియదర్శన్ దర్శకత్వంలో వచ్చిన 'కట్టా మీఠా' చిత్రంలో అక్షయ్‌కుమార్‌కు జంటగా త్రిష నటించారు. ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోవటంతో ఆమె ఇక అటు వైపు దృష్టి సారించలేదు. సుమారు 15 ఏళ్ల తరువాత మరోసారి నటుడు సల్మాన్‌ఖాన్ సరసన నటించడానికి అవకాశం వచ్చినట్లుగా సమాచారం.

9న 'రాయన్'లో పాట విడుదల



ధనుష్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న 'రాయన్' చిత్రం జూన్‌లో విడుదలకు సిద్ధం అవుతోంది. సన్ పిక్చర్స్‌పై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో దుషారా విజయన్, అపర్ణా బాలమురళి, విష్ణు విశాల్, సందీప్ కిషన్, కాళిదాస్ జయరాం, ఎస్‌జే సూర్య, సెల్వ రాఘవన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని జూన్‌లో విడుదల చేయనున్నట్లు ప్రకటించడంతో పాటు ఈ సినిమా నుంచి తొలి పాటని ఈ నెల 9న రిలీజ్ చేస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా ధనుష్ తెలిపారు. 'మటన్ కొట్టు రాయన్‌గా' ధనుష్ ఫస్ట్ లుక్‌ని ఇటీవల విడుదల చేశారు.

అటు ఫ్రేజర్.. ఇటు అభిషేక్

రాజస్తాన్‌పై 20 పరుగుల తేడాతో ఢిల్లీ గెలుపు



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్–17లో ప్లే ఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉంచుకోవాలంటే తప్పక రాణించాల్సిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. అభిషేక్ పొరెల్(65), జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్(50) అర్ధసెంచరీలతో చెలరేగడంతో ఢిల్లీ జట్టు 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. ఛేదనలో రాజస్తాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 201పరుగులే చేసింది. దీంతో ఢిల్లీ జట్టు 20 పరుగుల తేడాతో గెలిచి పాయింట్ల పట్టికలో 5వ స్థానానికి ఎగబాకింది. ఛేదనలో భాగంగా రాజస్తాన్ ఓపెనర్లు జైస్వాల్(4), బట్లర్(19) నిరాశపరిచినా.. సంజు(86; 46బంతుల్లో 8ఫోర్లు, 6సిక్సర్లు) ఒంటరి పోరాటం చేసి ముఖేష్ కుమార్ బౌలింగ్‌లో వివాదాస్పద క్యాచ్‌కు ఔటయ్యాడు. రియాన్ పరాగ్(27), దూబే(25), బట్లర్(19) ఫర్వాలేదనిపించినా.. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు నిరాశపరిచారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కుల్దీప్‌కు దక్కింది. ఢిల్లీ బౌలర్లు ఖలీల్ అహ్మద్, ముఖేశ్‌కుమార్, కుల్దీప్ యాదవ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు తొలి వికెట్‌కు ఫ్రేసర్, అభిషేక్ 4.1ఓవర్లలో 60పరుగులు చేసి గట్టి పునాది వేశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి శుభారంభం దక్కింది. ఆసీస్ యువ ఓపెనర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్(50; 20బంతుల్లో 7ఫోర్లు, 3సిక్సర్లు) క్రీజ్‌లో ఉన్నంత సేపు విధ్వంసం సృష్టించాడు. బౌల్ట్ వేసిన తొలి ఓవర్లో ఒకటే ఫోర్ కొట్టినా.. ఆ తర్వాత సందీప్ శర్మ, అవేశ్ ఖాన్‌లను ఉతికేశాడు. ఆవేశ్ వేసిన నాలుగో ఓవర్లో రెచ్చిపోయిన మెక్‌గుర్క్ వరుసగా.. 4, 4, 4, 6, 4, 6 బాది అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఫ్రెజర్ కేవలం 20 బంతుల్లోనే అర్ధసెంచరీని కొట్టాడు. దీంతో ఈ సీజన్‌లో మరోదఫా ఫ్రెజర్ 20బంతుల్లోనే అర్ధసెంచరీని నమోదు చేశాడు. అశ్విన్ ఓవర్లో మెక్‌గుర్క్ కవర్ డ్రైవ్ ఆడి ఫెరారీ చేతికి చిక్కాడు. దాంతో 60పరుగుల వద్ద ఢిల్లీ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన షాయ్ హోప్(1) రనౌట్ కాగా.. అక్షర్ పటేల్(15)ను అశ్విన్ బోల్తా కొట్టించాడు. ఆ దశలో మరో ఓపెనర్ అభిషేక్ పొరెల్(65) ధాటిగా ఆడుతూ బౌండరీలతో చెలరేగాడు. కెప్టెన్ రిషభ్ పంత్(15)తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించాడు. చివర్లో ట్రిస్టన్ స్టబ్స్(41; 20 బంతుల్లో 3ఫోర్లు, 3సిక్సర్లు) వీరవిహారం చేశాడు. చాహల్ వేసిన 18వ ఓవర్లో స్వీప్ షాట్లతో మూడు ఫోర్లు, ఆఖరి బంతికి సిక్సర్ బాది 21పరుగులు పిండుకున్నాడు. గుల్బదిన్(19)తో కలిసి 45పరుగులు జోడించారు. సందీప్ వేసిన 20వ ఓవర్లో సిక్స్ బాది ఢిల్లీకి భారీ స్కోర్ అందించాడు. టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్‌కు ఎంపికైన ఉత్సాహంలో చాహల్ మరో ఫీట్ సాధించాడు. చాహల్ ఈ ఫార్మాట్‌లో 350 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఢిల్లీ సారథి రిషభ్ పంత్ వికెట్ తీసి చాహల్ ఈ మైలురాయికి చేరుకున్నాడు. రాజస్తాన్ బౌలర్లలో అశ్విన్‌కు మూడు, చాహల్, సందీప్ శర్మ, బౌల్ట్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

ప్రి క్వార్టర్స్‌లో సుతీర్థ, మానవ్‌కు నిరాశ

పారిస్ ఒలింపిక్స్ ఆశలు గల్లంతు

చెన్నై: ఆసియా క్రీడల్లో కాంస్య పతకం నెగ్గిన భారత మహిళా టేబుల్ టెన్నిస్ బృందం పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ ప్రి క్వార్టర్స్ పోటీలో అహికా ముఖర్జీ–సుతీర్థ ముఖర్జీ జంట కొరియా జంట చేతిలో ఓటమిపాలైంది. హోరాహోరీ సాగిన ఈ మ్యాచ్‌లో సుతీర్థ జంట 2–3(11–6, 9–11, 12–10, 6–11, 8–11) కొరియాకు చెందిన నగసాకి–నయోనేంగ్ చేతిలో పోరాడి ఓడారు. ఈ మ్యాచ్ సుమారు 43 నిమిషాలసేపు సాగింది. ఇక పురుషుల డబుల్స్‌లోనూ మనుష్ షా–మానవ్ ఠక్కర్ జంట కూడా ప్రి క్వార్టర్స్‌లో 2–3(20–18, 4–11, 6–11, 11–9, 7–11)తో స్లొవేకియా జంట లుబోమిర్–చాన్ బాల్డ్‌విన్ చేతిలో పోరాడి ఓడారు. భారత మిక్స్‌డ్ టిటి జంట హర్మీత్ దేశాయ్–యశస్విని ఘోర్పండే 3–2(11–7, 9–11, 11–4, 4–11, 11–5తో చిలీకి చెందిన నికోలస్–పౌలీనాను చిత్తు చేసి క్వార్టర్స్‌కు చేరారు.

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
కోల్‌కతా	11	8	3	16	1.45
రాజస్తాన్	11	8	3	16	0.47
చెన్నై	11	6	5	12	0.70
సన్‌రైజర్స్	11	6	5	12	-0.06
ఢిల్లీ క్యాపిటల్స్	12	6	6	12	-0.31
లక్నో	11	6	5	12	-0.37
బెంగళూరు	11	4	7	8	-0.04
పంజాబ్‌కింగ్స్	11	4	7	8	-0.18
ముంబయి	12	4	8	8	-0.21
గుజరాత్	11	4	7	8	-1.32

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్


ఐపిఎల్‌లో నేడు

సన్‌రైజర్స్ × లక్నో
వేదిక: హైదరాబాద్;
రా.7.30గం॥లకు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68



విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న బాబూరావు



అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక రోడ్డుషోలో మాట్లాడుతున్న లోతా రామారావు

రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీలను ఓడించండి

సిపిఎం అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి -యంత్రాంగం

వారం రోజుల్లో పోలింగ్ జరగనుండడంతో సిపిఎం అభ్యర్థులు మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బిజెపి, వైసిపి, టిడిపి, జనసేన వైఫల్యాల గురించి గడపగడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తూనే... మరోవైపు ఆత్మీయ సమావేశాలు, రోడ్ షోలు, పాదయాత్రలు నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై పోరాడే వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని, దాని తొత్తు, పొత్తు పార్టీలను చిత్తుగా ఓడించాలని కోరారు.

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ, సీతానగరం మండలాల్లో అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్స, కురుపాం అసెంబ్లీ అభ్యర్థి మండంగి రమణను గెలిపించాలని కోరుతూ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసగించేందుకు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి, టిడిపి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాల డబ్బులు ప్రజల నుండి వసూలు చేస్తున్నవే తప్ప వారి సొంత డబ్బులు కాదని, దీన్ని ప్రజలు గమనించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల భారాలను మోపి ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలు, కార్మికులు, రైతాంగానికి నష్టదాయకమైన జిఒలు తెచ్చి వారి బతుకులను ఛిద్రం చేస్తున్నాయని అన్నారు. ఇలాంటి సమయంలో ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

గుంటూరు జిల్లా మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుంచనపల్లిలో మంగళగిరి అభ్యర్థి జొన్న శివశంకరరావు విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని తెలిపారు. ప్రజలు ఆదరించాలని కోరారు. ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌కె సలీమ్ పాల్గొని మద్దతు తెలిపారు.

విజయవాడ 33వ డివిజన్ సత్యనారాయణపురంలో సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు.. కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీల నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విజయవాడ సెంట్రల్‌ను సమస్యాత్మక నియోజకవర్గంగా చేసిన పాపం వైసిపి, టిడిపిలదేనంటూ విమర్శించారు.

నగరంలో ప్రశాంత వాతావరణానికి తనను గెలిపించాలని కోరారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు విస్తృత ప్రచారం నిర్వహించారు. తనను గెలిపిస్తే నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అసెంబ్లీలో ప్రజావాణి వినిపిస్తానని అన్నారు.

విశాఖ 69వ వార్డులోని శీలానగర్ పరిసర ప్రాంతాల్లో గాజువాక అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ప్రచారం చేపట్టారు. తాను గెలిస్తే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో రంపచోడవరం అభ్యర్థి లోతా రామారావు పర్యటించారు. తొలుత ఎటపాక మండలంలో రోడ్ షో నిర్వహించారు. లక్ష్మీపురం నుంచి ప్రారంభమైన రోడ్ షో గన్నవరం, తోటపల్లి, నెల్లిపాక, చోడవరం, కొండపల్లి, గుండాల కాలనీ మీదుగా ఎటపాక వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

అప్పలనర్స, లోతా రామారావు లను గెలిపించాలంటూ అడ్డతీగల మండల కేంద్రంలోని వారపు సంతలో కళాజాతాలతో ప్రచారం చేపట్టారు.

నెల్లూరులోని 10, 11 డివిజన్ల పరిధిలో నియోజకవర్గ అభ్యర్థి మూలం రమేష్ ప్రచారం నిర్వహించారు. ప్రజలపై అనేక రూపాల్లో పన్నులు వసూలు చేస్తూ ఆర్థిక భారాలు మోపుతున్న పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాని కోరారు..

కర్నూలు జిల్లా కల్లూరు అర్బన్ 21వ వార్డు పరిధిలో ఉన్న మిల్ట్రీ క్యాంటీన్, ఎల్‌ఐజి, సాయిబాబా దేవాలయం, శ్యామల నగర్, సోమప్ప కాలనీ ప్రాంతాల్లో పాణ్యం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్ ఎన్నికల ప్రచారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర రెడ్డి, ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలపై అసెంబ్లీలో పోరాడుతానని హామీ ఇచ్చారు.

కడప స్టీల్‌ప్లాంటూ ముఖ్యమే

- దీనిపై అవినాష్ ఎప్పుడైనా మాట్లాడాడా!
- పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల



ఉపాధి పనుల వద్ద పలుగుపట్టిన వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-కమలాపురం (వైఎస్ఆర్ జిల్లా)

విశాఖకు స్టీల్ ఎంత ముఖ్యమో మనకూ కడప స్టీల్ అంత ముఖ్యమని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. కడప స్టీల్ ప్లాంట్ వచ్చి ఉంటే లక్ష ఉద్యోగాలు అయినా యువతకు వచ్చేవని తెలిపారు. కడప ఎంపి అవినాష్‌రెడ్డి స్టీల్ ప్లాంట్ కోసం ఒక్క ఉద్యమమూ చేయలేదన్నారు. వైఎస్ఆర్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో షర్మిల మాట్లాడుతూ రాష్ట్రమంతటా మాఫియా మయంగా మారిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా లిక్కర్, డ్రగ్స్, గంజాయి, ఇసుక, మట్టి మాఫియా రాజ్యమేలుతోందని అన్నారు. పదేళ్లలో మన రాష్ట్రానికి కనీసం రాజధాని కూడా లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి ఐదేళ్లు చంద్రబాబు అమరావతి అని భ్రమరావతి కట్టారని, ఒక్క శాశ్వత భవనాన్ని కూడా కట్టలేదని తెలిపారు. సింగపూర్ అంటూ అరచేతిలో స్వర్గం చూపించారు తప్పిస్తే రాజధాని లేదని చెప్పారు. తరువాత ఐదేళ్లు వాషింగ్టన్ డిసి కడతా అంటూ సిఎం జగన్ మోసం చేశారని తెలిపారు. ఒక రాజధాని కాదు.. మూడు రాజధానులు అంటూ ఒక్కటి కూడా లేకుండా చేశారని విమర్శిం చారు. 23 వేల ఉద్యోగాలకు మెగా డిఎస్‌సి వేస్తామని చెప్పి దగా చేశారన్నారు. ఒక్క ఉద్యోగం ఇప్పటి వరకు భర్తీ కాలేదని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2.35 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేసిన జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఏ శాఖలోనూ ఒక్క ఉద్యోగం భర్తి చేయాలేదని విమర్శించారు.

సర్వారాయ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు ఏమో కానీ... కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి చేపల చెరువుకి, రొయ్యల చెరువుకి నీళ్ల వస్తున్నాయని తెలిపారు. అధికారం ఉన్నది మీ చెరువులు నింపుకోడానికా? అని ప్రశ్నించారు. యోగి వేమన యూనివర్సిటీ సమీపంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ చట్టం పనులు చేస్తున్న కార్మికులతో మాటా మంతీ కలిపారు. సిపిఐ కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి చంద్ర పారపట్టి మట్టిని పారబోశారు.

బద్వేలులో షర్మిలపై కేసు నమోదు

పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిలపై బద్వేల్‌లో మంగళవారం కేసు నమోదైంది. కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా బద్వేల్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై మాట్లాడారు. దీంతో ఆమెపై బద్వేల్ ఆర్‌డిఒ కేసు పెట్టారు. వివేకా హత్య కేసుకు సంబంధించిన ప్రస్తావన ఎన్నికల ప్రచారంలో చేయరాదని కడప కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన నేపథ్యంలో ఈ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి కల్పనకు ప్రాధాన్యం : లోకేష్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. విజయనగరం అయోధ్యా మైదానంలో నిర్వహించిన యువగళం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కూటమి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని, మెగా డిఎస్‌సిపై తొలిసంతకం చేస్తామన్నారు. ఉద్యోగాలు వచ్చేలోపు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని, యువతీ, యువకుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వంలో ఒక్క ఐటి కంపెనీని ఏర్పాటు కాలేదన్నారు. యువత ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలసపోవాల్సిన పరిస్థితులు కల్పించారని విమర్శించారు. విశాఖపట్నం కేంద్రంగా ఐటి కంపెనీలు ఏర్పాటు చేసి ఎపిని ఐటి హబ్‌గా మారుస్తామని అన్నారు. గిరిజనుల రిజర్వేషన్ల కోసం జిఒ నెంబర్ 3 పునరుద్ధరణకు న్యాయ పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక పంచాయతీలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. దేశం గర్వించదగ్గ రీతిలో రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి పి అదితి విజయలక్ష్మి గజపతిరాజు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలపై హత్యాయత్నం

- నలుగురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ఆలూరు

కర్నూలు జిల్లా ఆలూరు మండలం అంగస్కల్ గ్రామంలో టిడిపి కార్యకర్తలపై వైసిపి నాయకులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు... మనేకుర్తి పంచాయతీలో మజరా గ్రామమైన అంగస్కల్ గ్రామానికి టిడిపి నాయకులు మనేకుర్తి రాజశేఖర్ ప్రచారానికి రాకూడదని వైసిపి నాయకులు ఆంక్షలు విధించారు. గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పుండుకూర దేవేంద్ర అండతోనే రాజశేఖర్ వస్తున్నారని వైసిపి నాయకులు ఆగ్రహించారు. మంగళవారం ఉదయం దేవేంద్ర ఇంటికి వైసిపి కార్యకర్తలు దూదేకొండ యంకన్న, నాగరాజు, శీనప్ప, రమేష్, ముసానహళ్లి ఉలిగప్ప, అశోక్, వినోద్, రవి, లెంకన్న, గుడిసిలి శీనప్ప వచ్చారు. ఇంటి దగ్గర మట్టి పని చేస్తున్న దేవేంద్రపై గొడ్డలి, రాడ్లు, కర్రలతో మూకుమ్మడిగా దాడి చేశారు. అక్కడే ఉన్న దేవేంద్ర తమ్ముడు రామాంజిపైన, అడ్డంగా వచ్చిన స్థానికులు భీమలింగ, రమేష్, చంద్రపైన కూడా దాడికి పాల్పడ్డారు. దేవేంద్ర స్పృహ తప్పి పడిపోవడంతో మృతి చెందారని వదిలేసి వెళ్లిపోయారు. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబసభ్యులు ఆలూరు ప్రభుత్వాస్పత్రికి వారిని తరలించారు. దాడి చేసిన వారిలో ముగ్గురిపై గతంలో గ్రామంలో ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటనలో కేసులు ఉన్నాయని స్థానికులు తెలిపారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పికెట్ ఏర్పాటు చేశారు.



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బనగానపల్లెలో ఉద్రిక్తత

- టిడిపి - వైసిపి ఘర్షణ



బనగానపల్లె కూరగాయల మార్కెట్‌లో ఘర్షణ పడుతున్న టిడిపి , వైసిపి కార్యకర్తలు

ప్రజాశక్తి -బనగానపల్లె (నంద్యాల)

నంద్యాల జిల్లా బనగానపల్లెలో హై టెన్షన్ నెలకొంది. మంగళవారం ఉదయం కూరగాయల మార్కెట్‌లో టిడిపి, వైసిపిలు ప్రచారం చేసుకుంటూ ఇరు గ్రూపులు ఒకరికొకరు ఎదురుపడడంతో ఘర్షణ నెలకొంది. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిసి జనార్ధన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరారెడ్డి, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రామిరెడ్డి కోడలు మేధా శ్రీరెడ్డి, కుమారుడు ఓబుల్‌రెడ్డి ఒకేసారి కూరగాయల మార్కెట్ లో ప్రచారానికి వచ్చారు. ఇరు గ్రూపులు కవ్వింపు చర్యలకు పాల్పడడంతో ఘర్షణ వాతావర ణం నెలకొంది. మార్కెట్‌లోని కర్రలు, కూరగాయల డబ్బాలు, కూరగాయలు, రాళ్లతో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. దాడుల్లో వైసిపికి చెందిన నలుగురికి, టిడిపికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసం వద్ద, మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి నివాసం వద్ద బిఎస్ఎఫ్ పోలీసు బలగాలను మోహరించారు. ఘర్షణ పడ్డ వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ గంటా సుబ్బారావు తెలిపారు.

మహిళపై దాడి అమానుషం: జనార్ధన్‌రెడ్డి

ఇందిర, టిడిపి కార్యకర్తలపై ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు ఓబుల్ రెడ్డి దాడులకు పాల్పడడం దారుణమని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి అన్నారు. కాటసాని ఓబుల్ రెడ్డి, వైసిపి కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కఠిన చర్యలు తీసుకోవాలి: కాటసాని ఓబుల్ రెడ్డి

కూరగాయల మార్కెట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాటసాని మేధా శ్రీ రెడ్డి, వైసిపి కార్యకర్తలపై దాడులకు పాల్పడిన టిడిపి కార్యకర్తలు, నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇంటి ముందు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

ఎయుఇఇటి పరీక్షా ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కోర్సుల్లో సెల్ఫ్‌సపోర్ట్ విధానంలో ప్రవేశాలకు నిర్వహించిన ఎయుఇఇటి 2024 ప్రవేశ పరీక్షా ఫలితాలను మంగళవారం ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాద్‌రెడ్డి విడుదల చేశారు. మే ఐదున రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది ప్రాంతీయ కేంద్రాల పరిధిలో 14 కేంద్రాలలో ఈ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షకు 4349 మంది దరఖాస్తు చేయగా 3952 మంది హాజరయ్యారు. పరీక్షా ఫలితాలను ఎయు వెబ్‌సైట్‌లో ఉంచామని, త్వరలో కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తామని ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రవేశాల సంచాలకులు ఆచార్య డిఎ.నాయుడు పాల్గొన్నారు. ఈ ఫలితాలలో పెందుర్తికి చెందిన యు.సాయి ఈశ్వర్ మొదటి ర్యాంకు, చంద్రంపాలెంనకు చెందిన కె.సాయి ప్రణీత్ రెండో ర్యాంకు, తగరపువలసకు చెందిన జి.మోహన్ సాయి సంపత్ మూడో ర్యాంకును, రాజమండ్రికి చెందిన ఎస్‌డివి.సంకల్ప్ నాలుగో ర్యాంకు, పాలకొల్లుకు చెందిన డిజె.నాగమంజుల ఐదో ర్యాంకు సాధించారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

- డిజిపిని కలిసి వినతిపత్రం అందజేసిన సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటట్లు చూడాలని, నిజాయతీతో ప్రజాస్వామ్యహితంగా పోలీస్ యంత్రాంగాన్ని నడిపించాలని డిజిపి హరీష్ కుమార్ గుప్తాను సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి కోరారు. మంగళవారం డిజిపిని కలిసిన వారు వివిధ అంశాలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్రంలోని పెనమలూరు, మచిలీపట్నంలో దళితులపై జరిగిన దాడులను డిజిపి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ రిటైర్డ్ అధికారులు 13 ఉమ్మడి జిల్లాల్లో ఎన్నికల నిఘా వేదికగా ఏర్పడి, సమన్వయకర్తలుగా ఉండి క్షేత్రస్థాయిలో ఎన్నికల అక్రమాలను నివారించటానికి కృషి చేస్తున్నామన్నారు. ఎన్నికల నిఘా వేదిక 'ఎపిఎలక్షన్స్.కమ్' అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించామని తెలిపారు. ప్రజాస్వామ్యవాదులందరూ ఈ వెబ్‌సైట్‌ను వినియోగించుకుని ఎన్నికలు సక్రమంగా జరిగేటట్లు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మాజీ మేయర్ జంధ్యాల రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబు బెయిల్ రద్దు కేసు విచారణను సర్వోన్నత న్యాయస్థానం పది వారాలకు వాయిదా వేసింది. 17ఎ అంశంపై ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం నిర్ణయం తరువాత బెయిల్ రద్దు పిటిషన్ పరిశీలిస్తామని జస్టిస్ బేలా త్రివేది అన్నారు. చంద్రబాబుకు హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సవాల్ చేస్తూ ఎపి సిఐడి దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. 17ఎ అంశంపై ముగ్గురు న్యాయమూర్తల ధర్మాసనం ఏర్పాటుపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు ప్రస్తావించాలని అనుకుంటున్నట్లు ధర్మాసనానికి సిఐడి తరపున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ తెలిపారు. దీనికి స్పందించిన జస్టిస్ బేలా త్రివేది అది మీ ఇష్టం అని పేర్కొన్నారు. వేసవి సెలవుల తరువాత సిజెఐ ముందు ప్రస్తావించనున్నట్లు సిఐడి తరపున న్యాయవాది తెలిపారు. అయితే 17ఎ అంశంతో సంబంధం లేకుండానే రాష్ట్ర హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని ధర్మాసనానికి చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేశారని, ట్రయల్ కోర్టు ఇంకా పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొన్నారు. 17ఎ కింద అనుమతి తీసుకోలేదన్న కారణంగా చార్జ్‌షీట్ ఇంకా పరిగణనలోకి తీసుకోలేదని చెప్పిందన్నారు. కేసులో మెరిట్స్ ఆధారంగానే హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని, దానికి 17ఎకు ఎందుకు లింక్ పెడుతున్నారని ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం కేసును పది వారాల పాటు వాయిదా వేసింది.

టెక్కలి పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్

- హైకోర్టుకు తెలిపిన ఇసి

ప్రజాశక్తి-అమరావతి

టెక్కలి నియోజకవర్గంలోని మొత్తం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుకు అన్ని చర్యలూ తీసుకున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలిపింది. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రతాపర చర్యలు తీసుకున్నామని మంగళవారం ఇసి నివేదించింది. ఈ వివరాల్ని నమోదు చేసిన న్యాయమూర్తి జస్టిస్ బి కృష్ణమోహన్.. వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్ పరిష్కారమైనట్లు ప్రకటించారు. టెక్కలిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల బయట, లోపల సిసి కెమెరాల ఏర్పాటుకు, కట్టుదిట్టమైన భద్రతా చర్యలను ఇసి తీసుకోవడం లేదంటూ శ్రీనివాస్ హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఎన్నికలు సక్రమంగా జరగాలంటే సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని న్యాయవాది ఎల్ సాయి మనోజ్ రెడ్డి చెప్పారు. ఇసి తరపున న్యాయవాది శివదర్శన్ వాదిస్తూ, పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీంతో పిటిషన్‌పై విచారణను హైకోర్టు ముగించింది.

ప్రయివేటు పెట్టుబడులు డీలా

- 2022-23లో 36 శాతానికి పతనం
- కోవిడ్ నాటి కనిష్ట స్థాయికి క్షీణత
- నేషనల్ అకౌంట్స్ స్టాటిస్టిక్స్ గణంకాల వెల్లడి



న్యూఢిల్లీ : మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు దూసుకుపోతున్నాయని.. మరోమారు మోడీ సర్కార్ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధిని చూపెడుతామని ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో బిజెపి చేస్తున్న విస్తృత ప్రచారానికి వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోయింది. మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు కోవిడ్ నాటి స్థాయికి పడిపోవడమే ఇందుకు నిదర్శనం. ఆర్థిక సంవత్సరం 2022-23లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో ప్రయివేటు పెట్టుబడుల వాటా 36.2 శాతానికి క్షీణించిందని నేషనల్ అకౌంట్స్ స్టాటిస్టిక్స్ గణంకాల్లో తేలింది. ఇంతక్రితం ఏడాది 2021-22లోనూ 36.3 శాతంగా ఉంది. ఏడాదికేడాదితో పోల్చితే 2022-23లో ప్రయివేటు ఫైనాన్సీయల్ కార్పొరేషన్స్ పెట్టుబడుల్లోనూ 0.7 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. ప్రభుత్వ ఫైనాన్స్‌యేతర లేదా ప్రభుత్వ రంగ కంపెనీల పెట్టుబడుల వాటా 9.4 శాతానికి తగ్గింది. ఇంతక్రితం 2021-22లో పిఎస్‌యుల పెట్టుబడులు 9.5 శాతంతో పోల్చితే స్వల్ప తగ్గుదల చోటు చేసుకుంది. ఉత్పత్తి రంగంలో పిఎస్‌యుల పెట్టుబడుల్లో పెరుగుదల చోటు చేసుకుంది. ఈ విభాగంలో పిఎస్‌యుల వాటా వరుసగా 2018-19, 2019-20, 2020-21లో వరుసగా 9.7 శాతం, 10.2 శాతం, 11.6 శాతం చొప్పున పెరుగుతూ వచ్చింది. 2022-23లోనూ రియల్ ఎస్టేట్‌లో ప్రభుత్వ వాటా 13 శాతానికి పెరిగింది. ఇంతక్రితం 2021-22లో 12 శాతంగా ఉంది. 2023-24లోనూ ప్రయివేటు రంగ పెట్టుబడులు 15.3 శాతం క్షీణించాయని ఇటీవల ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకింగ్ సంస్థ ప్రాజెక్ట్స్ టుడే ఓ రిపోర్ట్‌లో తెలిపింది. విదేశీ పెట్టుబడిదారులు కూడా దాదాపు మూడింట ఒక వంతు కొత్త ఖర్చులను తగ్గించారని తెలిపింది. దీని ఫలితంగా 2022-23లో నమోదైన దాదాపు రూ.37 లక్షల కోట్లతో పోలిస్తే కొత్త పెట్టుబడుల ప్రకటనల విలువ దాదాపు 5 శాతం తగ్గింది. తయారీ రంగంలో ప్రయివేటు రంగ పెట్టుబడి ప్రణాళికలలో భారీ తగ్గుదల చోటు చేసుకుంది. ఇందులో ప్రతిపాదిత వ్యయాలు 2022-23లో రూ.19.85 లక్షల కోట్లతో పోల్చితే.. 2023-24 నాటికి రూ.11.9 లక్షల కోట్లకు పడిపోయాయని 'ది హిందూ' పత్రిక ఓ కథనంలో వెల్లడించింది. 2022-23లో తయారీ రంగంలో కొత్త పెట్టుబడులు దాదాపు 54 శాతం మేర తగ్గాయి. నీటిపారుదల, మైనింగ్‌లో పెట్టుబడులు వరుసగా 48.7 శాతం, 19.25 శాతం చొప్పున క్షీణించాయి. పెట్టుబడుల ద్వారానే కొత్త ఉద్యోగాలు సృష్టించబడుతాయి. దేశంలో ప్రజల ఆదాయాలు తగ్గడంతో సరుకులకు డిమాండ్ పడిపోవడంతో కంపెనీలు తమ విస్తరణ కార్యకలాపాలను తగ్గించుకుంటున్నాయి. దీంతో దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది. ఓ వైపు పెట్టుబడుల్లో పతనం, మరోవైపు నిరుద్యోగం ఎగిసిపడుతోన్నప్పటికీ.. దేశం దూసుకుపోతోందని మోడీ సర్కార్ చేస్తున్న ప్రచారం విమర్శలకు దారి తీస్తోంది.

భారత్ పే నుంచి ఆల్ ఇన్ వన్ చెల్లింపు పరికరం

ముంబయి : ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ భారత్‌పే కొత్తగా ఆల్ ఇన్ వన్ చెల్లింపు పరికరాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. పిఒఎస్, క్యూఆర్ కోడ్, స్పీకర్‌లను ఒకే పరికరంలోకి అనుసంధానించేలా దీన్ని డిజైన్ చేసినట్లు పేర్కొంది. ఈ వినూత్న ఉత్పత్తి వ్యాపారుల కోసం లావాదేవీలను క్రమబద్ధీకరించడానికి రూపొందించబడిందని భారత్ పే సిఇఒ నలిన్ నేగి తెలిపారు.

సెన్సెక్స్ 384 పాయింట్ల పతనం

ముంబయి : అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ భారత స్టాక్ మార్కెట్లు ప్రతికూలతలో ముగిశాయి. మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో బిఎస్ఇ సెన్సెక్స్ 382.69 పాయింట్లు కోల్పోయి 73,511.85 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 600 పాయింట్ల మేర కోల్పోయినప్పటికీ చివరి దశలో కొంత పుంజుకున్నాయి. ఎన్ఎస్ఇ నిఫ్టీ 141 పాయింట్ల నష్టంతో 22,303 వద్ద నమోదయ్యింది. ముఖ్యంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసిఐసిఐ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఇండుస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్ సూచీలు అమ్మకాల ఒత్తిడికి గురి కావడంతో మార్కెట్లు పతనాన్ని చవి చూశాయి.

డాక్టర్ రెడ్డీస్‌కు రూ.1,307 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ డాక్టర్ రెడ్డీస్ గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో రూ.1,307 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లోని రూ.959.2 కోట్ల లాభాలతో పోల్చితే 36 శాతం వృద్ధిని సాధించింది. క్రితం క్యూ4లో డాక్టర్ రెడ్డీస్ రెవెన్యూ 12 శాతం పెరిగి రూ.7,083 కోట్లుగా నమోదయ్యింది. అమెరికా, యూరపియన్ మార్కెట్లలో బలమైన అమ్మకాలు మెరుగైన ఫలితాలకు దోహదం చేశాయని ఆ కంపెనీ తెలిపింది. యూరప్‌లో అమ్మకాలు 5 శాతం, యుఎస్‌లో రికార్డ్ స్థాయిలో 29 శాతం చొప్పున పెరిగాయి. మొత్తం ఆర్థిక సంవత్సరం 2023-24లో డాక్టర్ రెడ్డీస్ నికర లాభాలు 23.6 శాతం పెరిగి రూ.5,568 కోట్లుగా చోటు చేసుకున్నాయి. రెవెన్యూ 13.5 శాతం వృద్ధితో రూ.27,916.4 కోట్లుగా నమోదయ్యింది. 2023-24గాను ప్రతీ రూ.5 ఈక్విటీ షేర్‌పై రూ.40 తుది డివిడెండ్‌ను చెల్లించడానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.

లక్నో ప్లాంట్‌లో 9 లక్షల యూనిట్ల తయారీ

- టాటా మోటార్స్ వెల్లడి



లక్నో : దేశంలోనే అతిపెద్ద వాణిజ్య వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ తన అత్యాధునిక లక్నో ఫెసిలిటీ నుండి 9లక్షల యూనిట్లను తయారు చేసి.. నూతన మైలురాయిని నమోదు చేసినట్లు తెలిపింది. 600 ఎకరాల విస్తీర్ణంలోని ఈ లక్నో ప్లాంట్‌ను 1992లో ఏర్పాటు చేసింది. ఇక్కడ తేలికపాటి, మధ్యతరహా, మధ్యస్థ, భారీ వాణిజ్య వాహనాలు, అలాగే ఎలక్ట్రిక్, ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ బస్సులతో సహా అనేక రకాల కార్గో, ప్రయాణీకుల వాణిజ్య వాహనాలను ఉత్పత్తి చేస్తోంది.


గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత సిరా గుర్తు చూపుతున్న ప్రధాని మోడీ


కర్ణాటకలోని కల్బుర్గిలో ఓటు వేసిన కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే దంపతులు


గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా


ఉత్తరప్రదేశ్‌లోని సయిఫాయిలో భార్య, కుమార్తెతో కలిసి ఓటరు గుర్తింపు కార్డులు చూపిస్తున్న అఖిలేశ్ యాదవ్

కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి జ్యుడీషియల్ కస్టడీ పొడిగించింది. మనీలాండరింగ్ కేసుకు సంబంధించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కేసులో ఈ నెల 14 వరకు కస్టడీని పొడిగించిన కోర్టు, సిబిఐ కేసులో ఈ నెల 20 వరకు కస్టడీ పొడిగిస్తున్నట్లు తెలిపింది. ఇడి, సిబిఐ కేసులో గతంలో కవితకు విధించిన జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో... మంగళవారం మధ్యాహ్నం కవితను జైలు సిబ్బంది స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా ముందు హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో సిబిఐ కేసులో కస్టడిపై అరగంట తరువాత వాదనలు జరిగాయి. దీంతో మరోసారి కవితను కోర్టు ముందు ప్రవేశపెట్టారు. కాగా ఢిల్లీ మద్యం కేసులో కవిత పాత్రపై వచ్చే వారం రోజుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్లు ఇడి తరపున న్యాయవాది ఎన్‌కె మట్ట కోర్టుకు తెలియజేశారు. ఇందుకు సంబంధించిన ఫైలింగ్ సైతం తుది దశకు చేరినట్లు ఆయన మీడియాకు తెలిపారు.

రేవణ్ణను దేశం దాటించి..

ప్రజ్వల్ రేవణ్ణను దేశం దాటించి, తనలాంటి వాళ్లను అరెస్ట్ చేయడం అన్యాయమని కవిత అన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని ఆమె కోరారు. కోర్టు హాల్‌లోకి వెళ్లే ముందు కేవలం జై తెలంగాణ, జై భారత్ అనే నినాదాలు చేశారు. కాగా ఇడి, సిబిఐ కేసుల్లో రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ నిరాకరించడంతో బుధవారం కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించనున్నారు. ఈ మేరకు కవిత అరెస్టును చాలెంజ్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు ఆమె భర్త అనిల్ తెలిపారు.

భారత్‌లో చైనా కొత్త రాయబారి షూ ఫెయిహాంగ్



బీజింగ్ : సీనియర్ దౌత్యవేత్త షూ ఫెయిహాంగ్‌ను భారత్‌కు కొత్త రాయబారిగా చైనా అధ్యక్షులు జిన్‌పింగ్ నియమించారు. తూర్పు లడఖ్‌పై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు స్తంభించడంతో దాదాపు 18 మాసాల సుదీర్ఘ జాప్యం అనంతరం ఈ చర్య తీసుకున్నారు. చైనా విదేశాంగ శాఖ పిటిఐకి ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఫెయిహాంగ్ గతంలో ఆఫ్ఘనిస్తాన్, రొమేనియాలకు రాయబారిగా పనిచేశారు. తన కొత్త పోస్టింగ్ బాధ్యతలు స్వీకరించడానికి ఆయన త్వరలో ఢిల్లీ వెళతారని భావిస్తున్నారు. 2022 అక్టోబరులో తన పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న చైనా దౌత్యవేత్త సున్ వెడాంగ్ స్థానంలో ఈయన బాధ్యతలు చేపడతారు. సైనిక ప్రతిష్టంభన పరిష్కరించుకోవడానికి ఇరు దేశాల మధ్య సుదీర్ఘంగా సాగుతున్న సైనిక, దౌత్య చర్చలు, సంప్రదింపుల నేపథ్యంలో ఈ నియామకం జరిగింది.

రేవణ్ణ కేసును సిబిఐకి అప్పగించాలి

- కుమారస్వామి డిమాండ్

బెంగళూరు : హసన్ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపుల కేసును సిబిఐ విచారించాలని జెడి(ఎస్) నాయకులు, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈ కేసు విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఆదేశాల మేరకే పని చేస్తుందని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని, అయితే ప్రజ్వల్ రేవణ్ణను రక్షించే ప్రయత్నం చేయబోమని తెలిపారు.

తృణమూల్ దాదాగిరి.. తిప్పికొట్టిన ప్రజలు

- చాలా చోట్ల ఏడేళ్ల తరువాత ఓటు వేసే అవకాశం లభించింది.
- మహ్మద్ సలీం




కొల్‌కతా: దేశంలో, అలాగే బెంగాల్‌లో శాంతి, సామరస్యాలకు ముప్పుగా పరిణమించిన శక్తులను ఓడించాలన్న తమ పిలుపునకు ప్రజలు సరిగానే స్పందించారని ముర్షిదాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం అన్నారు. మూడో విడత పోలింగ్ ముగిసిన అనంతరం సలీం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, మేము కమిషన్ నుండి స్వేచ్ఛా, శాంతియుత, నిష్పక్షపాత ఎన్నికలను కోరుకున్నాము. తణమూల్ కాంగ్రెస్ వారు చాలా చోట్ల మా పోలింగ్ ఏజెంట్లను బెదిరించారు. గందరగోళం సృష్టించేందుకు యత్నించారు. తనను కూడా అడ్డుకునే ప్రయత్నం చేశారు. కొన్ని చోట్ల తణమూల్ దుండగులను ప్రజలే ప్రతిఘటించారు. ఏడేళ్ల తర్వాత చాలా చోట్లప్రజలు ఓటు వేయగలిగారు. నాలుగు లోక్‌సభ నియోజకవర్గాల్లో సగటు 73.93 శాతం ఓట్లు పోలైనట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలిసింది. పోలింగ్ శాతం ఇంకా పెరిగే అవకాశముందని ఆయన అన్నారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం, పోలీసులు పంచాయతీ ఎన్నికల్లో పక్షపాతంగా వ్యవహరించడం, తృణమూల్ కాంగ్రెస్ అక్రమాలు పెద్దయెత్తున చోటుచేసుకున్నాయి. తృణమూల్ హింసకు చాలా మంది బలయ్యారు అని సలీం గుర్తు చేశారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించే శక్తులకు, వాటిని నాశనం చేయాలని చూసే శక్తులకు మధ్య పోరాటంగా ఈ ఎన్నికలను చూడాలని మేము ప్రజలను కోరాము. కరీంపూర్ సాయుధులైన తృణమూల్ గూండాలను తిప్పికొట్టిన ప్రజలను సలీం అభినందించారు. ఇవిఎంలను సరిగ్గా సీల్ చేసి, , స్ట్రాంగ్ రూమ్‌లో భద్రంగా ఉండేలా చూడాలని ఆయన కోరారు. ఓట్ల లెక్కింపునకు ఇంకా చాలా సమయం ఉన్నందున ఇవిఎంల భద్రతకు గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. "ప్రధాని ముఖ్యమంత్రుల నకిలీ డిగ్రీలు, నకిలీ టీకాలు, నకిలీ అధికారులను చూశాం. ఈ ఎన్నికల్లో నకిలీ పోలింగ్ ఏజెంట్లను కూడా చూశాము. చాలా చోట్ల నకిలీ ఏజెంట్లను తాను స్వయంగా పట్టుకుని పోలీసులకు అప్పగించానని అన్నారు..

అధికారంలోకి రాగానే 'అగ్నివీర్' రద్దు చేస్తాం

- అమరవీరుల విభజన సరికాదు : రాహుల్ గాంధీ



గుమ్లా (జార్ఖండ్) : లోక్‌సభ ఎన్నికల తరువాత ఇండియా వేదిక అధికారంలోకి వస్తే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ మంగళవారం ప్రకటించారు. జార్ఖండ్‌లోని గుమ్లా పట్టణంలో ఎన్నికల ర్యాలీలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. 'ఇండియా వేదిక అధికారంలోకి రాగానే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తాం. ఈ పథకాన్ని సైన్యం తీసుకుని రాలేదు, ప్రధానమంత్రి మోడీ తీసుకొని వచ్చారు. అలాగే అమరవీరుల మధ్య విభజనలు మాకు ఇష్టం లేదు. దేశం కోసం ప్రాణత్యాగం చేసినవారందరూ అమరవీరులే. వారికి పెన్షను ఇవ్వాలి' అని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. జిఎస్‌టిపై ఆయన మాట్లాడుతూ ఐదు ట్యాక్స్ శ్లాబులతో బిజెపి ప్రభుత్వం తప్పుడు విధానాలు అమల్జేస్తోంన్నారు. దీనిని సవరించి పేదలపై భారాలు పడనిరీతిలో పన్ను శ్లాబ్ విధానం తీసుకొస్తామన్నారు. గిరిజనలకు బిజెపి అడుగడుగునా ద్రోహం చేస్తోందని రాహుల్ విమర్శించారు. 'వనవాసీ' పేరుతో ఆదివాసీల అటవీ హక్కులను బిజెపి ప్రభుత్వం హరిస్తోందని, అడవి బిడ్డల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయోధ్యలో రామమందిరం ప్రతిష్టాపనకు, న్యూఢిల్లీలో నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి గిరిజన మహిళ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండా ప్రధాని మోడీ అవమానించారని ఆయన విమర్శించారు. మంగళవారం ముందుగా చైబాసాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ పాల్గొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, రైల్వేలు మొదలైన వాటిని బడా పారిశ్రామిక వేత్తలకు కాషాయ పార్టీ అప్పగిస్తుందని అన్నారు. అదానీ, అంబానీల కోసమే మోడీ పని చేస్తున్నారని విమర్శించారు.

ముస్లింలపై విద్వేషం రెచ్చగొట్టేలా

సోషల్ మీడియాలో బిజెపి వీడియో

- తక్షణమే తొలగించాలని 'ఎక్స్'కు ఇసి ఆదేశం

న్యూఢిల్లీ : బిజెపి సాగిస్తున్న విద్వేష ప్రచారంపై ఎట్టకేలకు ఎన్నికల సంఘం(ఇసి)లో కాస్తయినా కదలిక వచ్చింది. ముస్లింపై ప్రజల్లో విద్వేషం రెచ్చగొట్టేలా బిజెపి పోస్టు చేసిన వీడియోను తక్షణమే తొలగించాలని ప్రముఖ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' (ట్విట్టర్)ను ఎన్నికల సంఘం మంగళవారం ఆదేశించింది. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు అనుకూలమని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు కేటాయించించాల్సిన నిధులను కూడా ముస్లింలకే తరలిస్తుందని అర్థం వచ్చేలా ఆ వీడియోను బిజెపి రూపొందించింది. బిజెపి కర్ణాటక అధ్యక్షుడు బివై విజయేంద్ర తన అధికారిక ఖాతాలో ఈ వీడియోను పోస్టు చేశారు. ఈ వీడియోలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేని, సీనియర్ నేత రాహుల్ గాంధీని కించ పర్చేలా కూడా పలు వ్యంగ్య చిత్రాలున్నాయి. ఈ వీడియోపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రజల ఐక్యతను దెబ్బతీసేవిధంగా బిజెపి పోస్టు చేసిన ఈ వీడియోను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 5న ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఇసి చర్యలు చేపట్టింది. తక్షణమే వీడియోను తొలగించాలని 'ఎక్స్' నోడల్ అధికారికి ఇసి నోటీసులు పంపింది. గతంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆదేశించినప్పటికీ .. పార్టీ ఆ పోస్టును తొలగించలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అభ్యంతరకర పోస్ట్‌పై ఇప్పటికే ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. 'ఈ పోస్ట్‌పై ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. అయినా ఇప్పటికీ పోస్ట్‌ను తొలగించలేదు. తక్షణమే తొలగించాలి' అని ఇసి తన ఉత్వర్వుల్లో పేర్కొంది.

నెతన్యాహు యుద్ధోన్మాదంపై ఇంటా, బయట నిరసనలు

- హమాస్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలి
- ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి వర్సిటీలకు విస్తరించిన నిరసనలు

టెల్ అవీవ్: గాజాలోని రఫా నగరంలో చిక్కుకున్న నిస్సహాయులైన శరణార్థులను నిర్దాక్షిణ్యంగా ఊచకోత కోయడాన్ని ఆపాలని జాతీయంగా, అంతర్జాతీయంగా వస్తున్న విజ్ఞప్తులను మితవాద నెతన్యాహు ప్రభుత్వం బేఖాతరు చేస్తూ భూతల దాడుల ప్రణాళికతో మొండిగా ముందుకెళ్తోంది. రఫాలో లక్షమందిని ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ హుకుం జారీ చేయడంతో ఈజిప్టు సరిహద్దును ఆనుకుని వున్న ఈ నగరం నుంచి శరణార్థులు వలసపోతున్నారు. ఖతార్, ఈజిప్టు మధ్యవర్తిత్వంలో కైరోలో జరిగిన చర్చల్లో ఓ కొలిక్కి వచ్చిన కాల్పుల విరమణ , బందీల విడుదల ఒప్పందాలను మితవాద నెతన్యాహు ప్రభుత్వం బుల్డోజ్ చేయడాన్ని నిరసిస్తూ ఇజ్రాయిల్‌లోని టెల్ అవీవ్, హైపా, జెరూసలెం, బీర్షెవా తదితర పట్టణాల్లో వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు బలప్రయోగానికి పాల్పడ్డారు. బందీలను విడిపించుకోడానికి బదులు, హమాస్ చివరి రక్షణ దుర్గంగా ఉన్న రఫాను ఆక్రమించుకోవడానికి, పెద్దయెత్తున మారణకాండ సాగించడానికి మొగ్గుచూపుతున్న నెతన్యాహుపై ఇజ్రాయిలీయుల్లో మరీ ముఖ్యంగా 211 రోజులుగా తమవారి విడుదల కోసం ఎదురుచూస్తున్న బందీల కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నరహంతకుడు, యుద్ధోన్మాది నెతన్యాహు వెంటనే తప్పుకుని, ముందస్తు పార్లమెంటు ఎన్నికలు నిర్వహించాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. దురాక్రమణను అడ్డుకుందాం అన్న బ్యానర్‌పై టెల్ అవీవ్‌లో ఆదివారం టెల్ అవీవ్‌లోని ఆర్ట్ మ్యూజియం పక్కన హోస్టేజి ఫ్యామిలీ స్క్వేర్ వద్ద జరిగిన భారీ ర్యాలీలో గాజాపై దురాక్రమణను తక్షణమే ఆపాలని నినదించారు. బందీల కుటుంబ సభ్యులు ఇజ్రాయిల్ ఆర్మీ ప్రధాన కార్యాలయం దగ్గర నుంచి కవాతు నిర్వహించారు. బిగిన్ రోడ్డు వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బందీగా ఉన్న మటన్ జాన్ గౌకర్ తల్లి ఐనన్ మాట్లాడుతూ, " మా కుటుంబం 200 రోజులకు పైగా నరకయాతన అనుభవిస్తున్నాం. బందీలను విడుదలజేసే ఒప్పందం ఇప్పుడు టేబుల్ మీద సిద్ధంగా ఉంది. హమాస్ దానికి అంగీకరిస్తున్నట్టు సంకేతాలిచ్చింది. నెతన్యాహు మాత్రం ఈ ఒప్పందాన్ని బుల్డోజ్ జేయడానికి మరో ఎత్తుగడ పన్నాడు." అని ఆగ్రహం వ్యక్తం చేసింది. యుద్ధాన్ని ఆపండి, బందీలను విడింపించండి, హమాస్‌తో తక్షణం ఒప్పందం పై సంతకం చేయండి' అంటూ ప్రదర్శనకారులు నినదించారు. ఆదివారం నాడు నెతన్యాహు ఇజ్రాయిల్ నేషనల్ టీవీ చానెల్ ద్వారా జాతినుద్దేశించి మాట్లాడుతూ, బందీలుగా మిగిలి వున్న 150 మందిని హమాస్ విడుదలజేసిన తరువాత కూడా యుద్ధం కొనసాగుతుందని చెప్పాడు. మునుపటి కాల్పుల విరమణ సమయంలో సుమారు 100 మంది బందీలను హమాస్ విడిచిపెట్టింది. నెతన్యాహు రఫాపై దాడిని ఆపగల శక్తి అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి పశ్చిమ దేశాలకు ఉన్నప్పటికీ అవి ఆ పని చేయడం లేదు. బైడెన్, సునాక్, మోడీలు గాజాలో మారణహోమానికి మద్దతునిస్తూనే ఉన్నారు. మరోవైపు గాజాకు సంఘీభావంగా బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి యూనివర్సిటీ క్యాంపస్‌లలో నిరసన శిబిరాలు వెలిశాయి. ఇంకాయ ఎంతమంది పిల్లలు, అమాయకులైన పౌరులను బాంబులేసి, కాల్చి చంపుతారు. ఇంకా ఎంతమంది ఆకలితో చనిపోవాలి అని బ్రిటిష్ ఎంపి క్రిస్ స్టీఫెన్స్ ప్రశ్నించారు.


రఫా క్రాసింగ్ వద్ద పాలస్తీనా భూభాగంలోకి యుద్ధ ట్యాంకులతో చొరబడి ఆ మార్గాన్ని ఆక్రమించిన ఇజ్రాయిల్ సైన్యం

పదేళ్ల బ్యాంకింగ్ సంస్కరణలు- శ్రమదోపిడీకి పరాకాష్ట



ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు కేంద్రప్రభుత్వం చేసిన చట్టాల ద్వారా ఏర్పడ్డాయి. కాబట్టి కార్మిక చట్టాలను, మార్గదర్శకాలను అమలు చేయటం వాటి కనీస బాధ్యత. సమాన పనికి సమాన వేతనం చెల్లించటం చట్టరీత్య తప్పనిసరి. ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పులున్నాయి. బ్యాంకింగ్ రంగంలో గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులకు తక్కువ జీతాలు ఉన్న పరిస్థితికి వ్యతిరేకంగా బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆలిండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకత్వంలో పెద్ద ఉద్యమాలు జరిగాయి. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి ప్రభుత్వం 1987లో జస్టిస్ ఓబుల్ రెడ్డి కమిషన్ నియమించింది. మూడేళ్ల సుదీర్ఘ వాదనల తరవాత ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగులు చేసేపనే చేస్తున్న గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులకు కూడా ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగుల జీతాలనే చెల్లించాలని తీర్పునిచ్చింది. సమాన పనికి సమాన వేతనం బ్యాంకింగ్ రంగంలో అమల్లోకి వచ్చింది. కానీ గత పదేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన వినాశకర బ్యాంకింగ్ సంస్కరణలు సమాన పనికి సమాన వేతన నిబంధనలను తల్లకిందులు చేశాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులకు కూడా లాభాల సంపాదనే ప్రధాన లక్ష్యంగా మార్చిన దరిమిలా శ్రమదోపిడే బ్యాంకుల విధానంగా మారింది. డబ్బుతో వ్యాపారం చేసే సున్నిత రంగంలో ఖాతాదారులు భద్రతకోసం బ్యాంకులలో పర్మినెంట్ ఉద్యోగులే పనిచేయాలనే నియమం అమలయ్యేది. ఆ నియమాన్ని నీరుగారుస్తూ నిరుద్యోగులను, బ్యాంకు ఉద్యోగులను శ్రమ దోపిడీకి గురిచేస్తూ అనేక పథకాలు రూపొందాయి.

2021-2022 ఆర్థిక సంవత్సర ఫలితాలను ప్రకటిస్తూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్, ప్రయివేటు బ్యాంకులతో పోటీపడి లాభాలు సంపాదిస్తున్నా ఖర్చు - ఆదాయనిష్పత్తి (కాస్ట్ టు ఇన్కమ్ రేషియో) ఎక్కువగా ఉండటం వలన స్టేట్ బ్యాంక్ నికర లాభాలు తక్కువగా ఉన్నాయని పత్రికా సమావేశంలో చెప్పారు. అంటే ఖర్చు తగ్గించుకోవాలని ఆయన తాత్పర్యం. ఆరోజు తెలియదు అది నిరుద్యోగుల పాలిట శాపంగా మారుతుందని. మూడు నెల్ల తర్వాత 'స్టేట్ బ్యాంక్ ఆపరేషన్స్ సపోర్ట్ సర్వీసెస్' (ఎస్‌బిఓఎస్‌ఎస్) అనే అవుట్‌సోర్సింగ్ కంపెనీని స్వంతగా (రిజర్వ్ బ్యాంక్ అనుమతితో) స్థాపించింది. స్టేట్ బ్యాంక్ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న శాఖలు నడపటానికి కావలసిన కాంట్రాక్టు ఉద్యోగులను ఎంపిక చేయటం ఆ కంపెనీ ఉద్దేశ్యం. స్టేట్ బ్యాంక్‌లో పనిచేసే పర్మినెంట్ ఉద్యోగుల జీతాలు వారికి వర్తించవు.

అప్పటికే రిజర్వ్‌బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్లనే స్కీమ్ రూపొందించింది. ఖాతాదారుల నుంచి డబ్బు జమచేసు కోవటం, ఖాతా నుండి డబ్బు ఇవ్వటం, డిమాండ్ డ్రాఫ్టు ఇవ్వటం, చెక్కులు ఖాతాలో జమ చేయటం లాంటి పర్మినెంట్ ఉద్యోగులే చేసే అనేక పనులు వీళ్లు చేస్తారు. అన్ని బ్యాంకులు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఒక్కొక్క బ్యాంక్‌లో ఒక్కొక్క విధమైన జీతాలు. చేసిన వ్యాపారం మీద కమీషన్, లేక కొంత నిర్దిష్ట కమీషన్ కొంత జీతం. కొన్ని బ్యాంకులలో బ్యాంక్ శాఖల నుంచి, కొన్ని బ్యాంకులలో నిర్దిష్టమైన ప్రాంతాల నుంచి పనిచేస్తున్నారు. సెంట్రల్ బ్యాంకులో మన రాష్ట్రంలో నెల రోజులు పనిచేసి రూ.రెండు వేల అతి తక్కువ ఆదాయంతో, కొంతమంది రూ.6 వేలు, రూ.10 వేల లోపు సంపాదనతో బిజినెస్ కరస్పాండెంట్ గా పనిచేస్తున్నారు. కొన్ని బ్యాంకులలో మాత్రమే నిర్దిష్ట జీతాలు ఉన్నాయి. ఈవిధంగా అరకొర జీతాలతో బ్యాంకులలో 35 లక్షల మంది బిజినెస్ కరస్పాండెంట్లున్నారు. బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న మొత్తం ఉద్యోగులు 15 లక్షల మంది. అంటే ఉద్యోగుల సంఖ్య కంటే రెట్టింపు పైగా బిజినెస్ కరస్పాండెంట్లున్నారన్న మాట. ఇంతేనా? ఇంకా నిర్ఘాంత పోయే రూపాలలో శ్రమదోపిడీ బ్యాంకులను ఏలుతుంది. గత పదేండ్లకాలంలో బ్యాంకుల వ్యాపారం 270 శాతం పెరిగింది. పెరిగిన వ్యాపారానికి తగిన రిక్రూట్మెంట్ జరగలేదు సరికదా పదవీ విరమణ వలన, ఉద్యోగుల మరణం, పర్మినెంట్ ఉద్యోగాల్లో ఏర్పడిన ఖాళీలలో కూడా రిక్రూట్మెంట్ జరగలేదు. ఉన్న ఉద్యోగుల మీద పనిభారం చెప్పలేనంతగా పెరిగింది. శాఖలు నడపలేని స్థితిలో టెంపరరీ, క్యాజువల్, కాంట్రాక్టు ఉద్యోగులను నియమిస్తూ వస్తున్నారు. ఇన్‌స్పెక్షన్, రుణాల మంజూరు, రికవరీ, క్రెడిట్ కార్డు వ్యాపారం, ఏటీఎంలలో క్యాష్ పెట్టటం, క్యాష్ శాఖలకు సరఫరా చెయ్యటం, సీనియర్ ఎగ్జిక్యూటివ్ స్థాయివరకు, ఒకటేమిటి అన్ని విభాగాలలో అన్ని క్యాడర్లలో కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. సుమారు లక్షన్నర మంది పర్మినెంట్ ఉద్యోగాలలో టెంపరరీ క్యాజువల్ కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీళ్లందరినీ పర్మినెంట్ చేయాలని ఏండ్ల తరబడి ఉద్యమాలు జరుగుతున్నా ప్రయోజనం లేదు. సమాన పర్మినెంట్ ఉద్యోగాలలో పనికి సమాన వేతనం మచ్చుకైనా మిగల్లేదు.

ఫీచర్స్ అండ్ పాలిటిక్స్



ఒకేసారి ఓటేసిన 96 మంది కుటుంబసభ్యులు!

బెంగళూరు : లోక్‌సభ ఎన్నికల మూడో విడత పోలింగ్ సందర్భంగా కర్ణాటకలో మంగళవారం ఒకే కుటుంబానికి చెందిన 96 మంది కలిసి వచ్చి ఓటేశారు. హుబ్బళి-ధార్వాడ్ స్థానానికి జరిగిన ఎన్నికల్లో నూల్వి గ్రామానికి చెందిన కంటెప్ప తోతాడ కుటుంబం ఒకేసారి పోలింగ్ కేంద్రానికి తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రం వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగి సందడి చేశారు. మూడు తరాలకు చెందిన ఆ కుటుంబ ఓటర్లు ప్రతి ఎన్నికల్లోనూ ఇలాగే ఓటు వేస్తుంటారు. కాగా అసోంలోని డిబ్రూఘాట్‌కు చెందిన ఓటర్లు పడవల్లో వచ్చి ఓటేశారు.

బెంగాల్‌లో 25 వేల ఉద్యోగాల రద్దుపై స్టే

- తృణమూల్ సర్కార్‌కు సుప్రీం మొట్టికాయలు

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో 25 వేలకు పైగా ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది నియామకాలను రద్దు చేస్తూ కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు మంగళవారం స్టే విధించింది. నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ 25,753 ఉద్యోగాలను రద్దు చేస్తూ ఏప్రిల్ 22న కోల్‌కతా హైకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పర్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. హైకోర్టు తీర్పుపై స్టే విధించింది. అయితే ఈ విచారణలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ప్రభుత్వ ఉద్యోగాలు చాలా విలువైనవి. ప్రజల విశ్వాసం కోల్పోతే ఇక అంతా శూన్యం. మీరు దీనిని ఎలా పరిగణిస్తారు?' అని ధర్మాసనం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తరుపు న్యాయవాదులను ప్రశ్నించింది. కాగా, ఈ నియామక ప్రక్రియ స్కాంపై సిబిఐ విచారణకు ఆదేశిస్తూ కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించడానికి గత విచారణలోనే సుప్రీంకోర్టు నిరాకరించింది. సిబిఐ విచారించి ఉద్యోగులు దోషులుగా రుజువు అయితే హైకోర్టు తీర్పు వర్తిసుందని, ఉద్యోగులు జీతాలను కూడా తిరిగి ఇవ్వాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది.

కేజ్రీవాల్ బెయిల్‌పై సుప్రీం తీర్పు రిజర్వు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ పై అత్యున్నత న్యాయస్థానం విచారణ జరిపింది. ఆయన బెయిల్ పై సుప్రీంకోర్టు షరతులు విధించి, తీర్పును రిజర్వ్ చేసింది. మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్ ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తలతో కూడిన ధర్మాసనం విచారించింది. తదుపరి విచారణ గురువారం లేదా వచ్చే వారంలో జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల వేళ ఓ పార్టీ అధినేతగా ఆయన ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని విచారణ సందర్భంగా ధర్మాసనం అభిప్రాయపడింది. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, ఒకవేళ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తే.. అప్పుడు ఎక్సైజ్ పాలసీ కేసుతో లింకున్న ఫైల్స్‌ను కేజ్రీ చూడరాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రిగా అధికారిక బాధ్యతలు నిర్వర్తించొద్దని సూచించింది. అయితే, సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని ఇడి వ్యతిరేకించింది. సిఎం అయినంత మాత్రాన ఈ కేసును ప్రత్యేకంగా పరిగణించరాదని అభిప్రాయపడింది. కేసుల విషయంలో రాజకీయ నాయకులకు మినహాయింపు ఉండకూడదని స్పష్టం చేసింది. ఇరు పక్షాల వాదనలూ విన్న అత్యున్నత న్యాయస్థానం ప్రస్తుతానికి ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. తన నిర్ణయాన్ని రిజర్వ్‌లో ఉంచింది.

20 వరకు కస్టడీ పొడిగింపు

మరోవైపు కేజ్రీవాల్‌కు కస్టడీని మరోసారి రౌస్ అవెన్యూ కోర్టు పొడగించింది. మంగళవారంతో కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ మంగళవారంతో ముగిసింది. దీంతో అధికారులు ఆయన్ను తీహార్ జైలు నుంచి రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా, కేజ్రీవాల్‌కు మే 20 వరకు కస్టడీని పొడగించారు. దీంతో కేజ్రీవాల్ మరో 14 రోజులు జైల్లోనే ఉండాల్సి ఉంటుంది.

చైనా, ఫ్రాన్స్ సహకార బంధం బలోపేతం

- ఇరు దేశాల మధ్య 18 సహకార ఒప్పందాలు
- ఫ్రాన్స్ సహా యూరప్ దేశాలకు చైనా మార్కెట్లో అవకాశాలు కల్పిస్తాం
- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పష్టీకరణ



బీజింగ్ : చైనా, ఫ్రాన్స్ మధ్య సహకార బంధం మరింత బలోపేతమైంది. ఇరు దేశాల ప్రభుత్వ సంస్థల మధ్య 18 సహకార ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. పౌర విమానయానం, వ్యవసాయం, ప్రజల మధ్య మార్పిడులు, హరితాభివృద్ధి, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి వంటి రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి. ఫ్రాన్స్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పర్యటిస్తున్న నేపథ్యంలో ఈ ఒప్పందాలు కుదిరాయి.

సోమవారం పారిస్‌లో కీలకమైన బిజినెస్ కౌన్సిల్ సమావేశం ముగింపులో జిన్‌పింగ్ ప్రసంగించారు. ఇరుదేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా ఆర్థిక, వాణిజ్య రంగాలను మరింత పరిపుష్టం చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫ్రాన్స్, ఇంకా యూరప్ దేశాల నుండి వచ్చే కంపెనీలకు మరిన్ని అవకాశాలను కల్పించేందుకు చైనా మార్కెట్ ద్వారాలను బార్లా తెరుస్తామన్నారు. వాణిజ్య సంబంధాలను రాజకీయ, సైద్ధాంతిక లేదా భద్రతా అంశాలకు వర్తింప చేయడానికి జరిగే ఏ ప్రయత్నాన్నైనా చైనా, ఫ్రాన్స్‌లు సంయుక్తంగా వ్యతిరేకించాలని కోరారు. చైనా, యూరప్ దేశాల మధ్య పరస్పరం లబ్ధి చేకూర్చే సహకారాన్ని పెంచుకోవడానికి కృషి చేస్తామన్నారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనడంతో ఫ్రాన్స్‌తో చేతులు కలిపేందుకు చైనా సిద్ధంగా వుందన్నారు. బహుళ ధృవ ప్రపంచాన్ని నిర్మించడంలో చైనా, యూరప్ రెండు ప్రధాన శక్తులని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. ప్రపంచ శాంతి సుస్థిరతలకు, సంక్షేమానికి చైనా-యూరప్ సంబంధాలు చాలా కీలకమని అన్నారు. చైనా మార్కెట్ ద్వారాలు తెరిచే వుంటాయని, అందరినీ కలుపుకుని పోతుందనే స్పష్టమైన సంకేతాలను జిన్‌పింగ్ తన ప్రసంగంలో స్పష్టంగా ఇచ్చారని సమకాలీన అంతర్జాతీయ సంబంధాల ఉపాధ్యక్షుడు ఝూంగ్ జియాన్ వ్యాఖ్యానించారు.

రాంపురంలో ఉద్రిక్తత

- పరిటాల సునీత ఎన్నికల ప్రచారంపై రాళ్లదాడి

ప్రజాశక్తి-అనంతపురం

రాప్తాడు నియోజకవర్గంలో ఎన్నికలు రణరంగాన్ని తలపిస్తున్నాయి. మంగళవారం నాడు కనగానపల్లి మండలం రాంపురం గ్రామంలో టిడిపి అభ్యర్థి పరిటాల సునీత ఎన్నికల ప్రచార వాహనాలపై కొందరు వైసిపి మద్దతుదారులు రాళ్ల దాడి చేశారు. దీంతో ఒక్కసారిగా గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ మంత్రి, టిడిపి అభ్యర్థి పరిటాల సునీత రాంపురం గ్రామంలో మంగళవారం ఉదయం ఎన్నికల ప్రచారం చేపట్టారు. గ్రామంలో కాన్వాయ్‌పై నుంచి పరిటాల సునీత ప్రసంగిస్తున్న తరుణంలో వైసిపి మద్దతుదారులు చొక్కాలు విప్పి.. మిద్దెలపై నుంచి రాళ్లు రువ్వారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరు ముగ్గురు కానిస్టేబుళ్ల ఎంత ప్రయత్నించినా వినకపోవడంతో వారు ఎస్ఐకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ప్రత్యేక పోలీసు బలగాలతో అక్కడికి చేరుకుని రాళ్లు రువ్వుతున్న వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పరిటాల సునీత మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో టిడిపికి వస్తున్న మద్దతును చూసి ఓర్వలేక వైసిపి వాళ్లు ఇలా దాడులు చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి వాటికి బెదిరేది లేదని ఇంతకు ఇంత ధీటుగా సమాధానం ఇస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో రాప్తాడు, రాష్ట్రంలో టిడిపి విజయం సాధిస్తుందన్నారు.